honeybee.org
Vol-11 Issue-1

సంపుటి 11 సంచిక 1 నవంబర్ - డిశంబర్ 2022

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



# తక్కువ ఖరీదులో హైడ్రాలిక్ క్రేన్



ఇన్నోవేటర్
**కడివెండి మహిపాల్ చారి**
హన్మకొండ జిల్లా, తెలంగాణ

## నిర్వహణ ఖర్చులు ఉండవు

ట్రాక్టర్‌కు క్రేన్ ఏర్పాటు చేసుకోవాలంటే లక్షలాది రూపాయలు వెచ్చించాలి.
ఇది సామాన్య రైతుకు కూడా అందుబాటు ఖరీదుకే లభిస్తుంది.
గ్రామాల్లో, గోడౌన్ల వద్ద హమాలీలు లభించక ధాన్యం మూటలు,
ఇతర బరువులను ఎత్తే కూలీల ఖర్చు విపరీతంగా ఉంటోంది.
దీనికి పరిష్కారంగా కనుగొన్నదే ఈ హైడ్రాలిక్ క్రేన్.
ట్రాక్టర్‌లకు, లారీలకు, ఎద్దుల బండ్లకు బరువులను ఎత్తడం, దించడం
కేవలం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులే చేసుకోవచ్చు.
ఎటువంటి నిర్వహణా ఖర్చులు ఉండవు.
ఊరికి ఒక్క క్రేన్ ఉంటే చాలు రైతులు ధాన్యం సంచులు ఇంటికి, మార్కెట్‌కు
తరలించేందుకు హమాలీల కొరకు వేచి ఉండాల్సిన అవసరం లేదు.
గోడౌన్ యజమానులకు ఇది చాలా ఉపయోగకరమైనది.



వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555



# మినీ మిల్లర్



ఇన్నోవేటర్
**వినయభూషణ్ రెడ్డి**
గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## బియ్యంతో పాటు చిరు ధాన్యాలు కూడా పట్టవచ్చు

ధాన్యం పండించిన తర్వాత మార్కెట్‌లో ధర లేదని తెలిసి,
బియ్యం చేసి అమ్ముదామంటే సమీపంలో రైస్ మిల్లు
లేనివారు ఎంతమంది ఉన్నారు.
గ్రామానికి ఒక్కటి ఈ మినీ రైస్ మిల్లును ఏర్పాటు చేసుకుంటే
గ్రామంలోని ధాన్యం మొత్తం మర ఆడించి నాణ్యమైన బియ్యం
అమ్ముకుని లాభాలు పొందవచ్చు.
ఈ మినీ రైస్ మిల్లు వరితో పాటు కొర్రలు, అండు కొర్రలు,
ఊదలు, బరిగలు కూడా బియ్యం పడుతుంది.
గోధుమలకు కూడా పై పొట్టు తీస్తుంది.
కేవలం 12 అడుగుల పొడవు వెడల్పు వున్న గది చాలు
దీన్ని ఏర్పాటు చేసుకోవటానికి. ఖరీదు కూడా సామాన్యులకు
అందుబాటులోనే ఉంటుంది.





వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

సంపుటి-11 సంచిక - 1 నవంబర్ - డిశంబర్ 2022

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* చింతల వెంకట్ రెడ్డి మరో ఇన్నోవేషన్ "పంటల సర్వరోగ నివారిణి 'ఆముదము + మట్టి' - 4
* కండక్టర్ నుండి ప్రకృతి ప్రేమికుడు - సాంప్రదాయ వైద్యుడుగా మారిన 'అగ్రూరి బాల నర్సయ్య" - 6
* విపత్కర పరిస్థితుల్లో సృజనాత్మకతను వెలిబీయటం - కరోనా కష్టకాలంలో అనుభవాలు - 9
* జాతీయ మీడియా ప్రశంసలు, అంతర్జాతీయ పురస్కారం అందుకున్న 'ప్రకృతి ప్రేమికుడు' కొమెర జాజి - 11
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 18
* రైతులకు ఆశాజనకంగా మారిన 'వెంకట కృష్ణ' ఇన్నోవేషన్‌లు మిరప, మామిడి, బత్తాయి పంటల రక్షణలోఅద్వితీయ విజయాలు - 20
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 23
* ఇన్నోవేటర్ స్థాయి నుంచి ఇన్నోవేటర్లకి స్ఫూర్తినిచ్చే స్థాయి దాకా... కేవలం ఒక్క లీటరు నీటితో మొక్కను పెంచిన 'పద్మశ్రీ' కథ - 26
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**
నవంబర్-డిశంబర్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# అయోమయంలో రైతు వారసత్వం

'పల్లెసృజన' నిర్వహించే చిన్న శోధయాత్రల్లో గ్రామ ప్రజలతో ఇష్టాగోష్టిగా యాత్రికులు సంభాషణలు జరుపుతూ ఉంటారు. పరస్పర గౌరవంతో మనసులోని మాటలు చెప్పుకుంటారు వారు. ఈ చర్చలు నిస్వార్థంగా మనసు విప్పి మాట్లాడుకోవటానికి తోడ్పడతాయి.

రైతుల పెద్ద సమస్య - అందరి సమస్య వ్యవసాయం లాభదాయకంగా లేదన్న విషయం. ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా , యంత్రాల సబ్సిడీ లాంటి ఎన్నో ప్రణాళికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసినా, వ్యవసాయాన్ని లాభదాయకం చేయలేక పోతున్నాయి. మద్దతు ధర ఉన్నా, అది సరిపోవటం లేదు. దీంతో వ్యవసాయం ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతులకు, కౌలు రైతులకు లాభదాయకంగా లేదు. అక్కడక్కడ, కూరగాయలు, పూల తోటలు, పండ్ల తోటలు కొంత లాభదాయకంగా ఉన్నా, ప్రతి సంవత్సరం ఆదాయం గ్యారంటీ లేకుండా ఉంటోంది. పట్టణాలకు దగ్గరగా ఉన్న పల్లెల్లోని రైతులు కూరగాయలు, పూలు పండిస్తూ పట్టణాల్లో తామే స్వయంగా అమ్ముకుంటున్నారు. వీరి పరిస్థితి కొంత మెరుగ్గా అగుపడుతోంది కాని ఈ విధానాన్ని అందరూ అమలు చేయడం సాధ్యం కాదు.

వ్యవసాయం లాభదాయకంగా ఎందుకు లేదు? ఒక గింజ విత్తితే దోశెడు గింజలు ఇచ్చే పంట ఎందుకు లాభదాయకం కావటం లేదు? పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ అన్న సూత్రం ప్రకృతికి పరిమితమైన సృష్టిలోని అద్భుత క్రమం. అయినా రైతు ఎందుకు లాభపడటం లేదు?. రాను రాను నికర ఆదాయం పడిపోవడం, పెట్టుబడులు పెరగడం, ప్రభుత్వ సహాయం తగ్గుతూ ఉండటం, మార్కెట్‌లో ధర సహకరించక పోవడం, సరియైన నిర్ణయాలు చేయకపోవడం, ఏ పంట వేయాలో తోచక రైతు తికమక పడటం, టెక్నాలజీ పేరుతో పెట్టుబడులు పరిమితిని మించడం, వ్యవసాయ నిర్ణయాలు సైంటిస్టులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు చేయడం - రైతులు వాటిని పాటించి నష్టాల్లోకి కూరుకుపోవడం అందరూ చివరికి రైతే తప్పు చేశాడని ఎత్తిపోయటం జరుగుతున్న ఈ వ్యవస్థలో రైతు క్షేమం కోసం మనసు పెట్టి పనిచేసే వారే లేరు. దీనికి తోడుగా ద్రవ్య వ్యవస్థ రైతులను అప్పుల ఊబిలోకి లాగుతోంది. అవగాహన లేని రైతును మార్కెట్ వ్యవస్థలోకి లాగడం - మరెన్నో.... ఇవన్నీ కలిసి వ్యవసాయం లాభదాయకమైన వృత్తి కావటానికి ప్రతిబంధకాలు అవుతున్నాయి. రైతు కష్టపడతాడు అయినా నష్టపోతున్నాడు. ఇలా నష్టపోతూ రైతులు ఎన్నాళ్ళు ఈ వ్యవసాయాన్ని కొనసాగిస్తాడు? ఆదాయం రెట్టింపు చేయడం అన్న ప్రభుత్వ నినాదంలో పసలేదు. నికర ఆదాయం రైతుకు కనిపించాలి. అది పెరుగుతూ ఉండాలి. ఏ పరిశ్రమ అయినా ప్రతి సంవత్సరం అభివృద్ధి చూపెట్టాలంటారు కదా! మరి వ్యవసాయ పరిశ్రమలో అభివృద్ధి ఎక్కడ? అంతా నష్టమే. ఈ నష్టం పెరగడం కూడా జరుగుతున్నది. దీనికి కారణం ఏమిటి? ఇలా అధిక కమతాలు దేశంలో సంవత్సరాలకొద్ది నష్టాలలో ఉంటే, ఇంకా ఎన్నేళ్ళు మన రైతులు వ్యవసాయం జీవన వృత్తిగా కొనసాగిస్తారు? వారి సంతతిని తమ వృత్తిలోకి రమ్మని ఎలా ఆహ్వానిస్తారు?



'పల్లెసృజన' గ్రామ సంభాషణల్లో గమనించిన ప్రధానాంశం "పెరుగుతున్న పెట్టుబడి". ఈ పెట్టుబడి ప్రతి పంటకు ప్రతి సంవత్సరమూ పెరుగుతూ వస్తోంది. "రైతులకు రెట్టింపు ఆదాయం" కన్నా "రైతు పెట్టుబడులను మూడు సంవత్సరాల్లో సగానికి" తగ్గించడం ధ్యేయంగా ఉంటే ఈపాటికి వ్యవసాయం అత్యంత ఆకర్షణీయమైన వృత్తిగా మారేది. పెట్టుబడులు పెరగడం అన్న సత్యం అందరికీ తెలిసినా "వినాయకుడి బొడ్డులో తేలు" కథలాగా దేశంలోని అందరు వ్యవసాయ భాగస్వాములు దాచిపెడుతున్నారు. కారణం పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకుల స్వార్థం మాత్రమే.

రైతు పెట్టుబడులలో ప్రధానమైనవి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, నీళ్ళు ( విద్యుత్, డీజిల్). వీటిలో ప్రతి అంశానికి రైతు పెట్టుబడులు పెరుగుతూ ఉన్నాయి. ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు పెట్టినా మార్కెట్‌లో వీటి ధరలు పెరుగుతునే ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో రైతు పంట పండించాలంటే ఎంతైనా ఖర్చు పెట్టాల్సిందే! దాంతో ఈ పెట్టుబడులన్నీ అంచనాలకు మించి రైతును ముప్పు తిప్పలు పెడుతున్నాయి. స్థానికంగా తయారు చేయడం రైతులు పూర్తిగా మానేశారు. చాలామంది రైతులకు విత్తనాలు అంటే దుకాణాల్లో దొరుకుతాయన్న విషయం తప్ప వారే తయారు చేసుకోవాలన్న నిజం తెలీదు. అలాగే ఎరువులు బయటినుండి, సబ్సిడీ పద్ధతిలో వారికి చేరటం మాత్రమే తెలుసు. పురుగు మందులు స్థానిక దుకాణదారుల సలహాలు, వ్యవసాయ అధికారుల సిఫారసులతో రైతులు వాడుతున్నారు. ఎంత ఖర్చవుతుంది, పంటకు ఎంతవరకు

లాభమవుతుందన్న విషయం సమాజంలో ఎవరికీ తెలియదు. యంత్రాలు పెద్ద కమతాలకు మాత్రమే తయారవుతున్నాయి. వాటిని అధిక సంఖ్యలో ఉన్న సన్న, చిన్నకారు రైతులు వాడితే పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయి. వీరికై తక్కువ ధరలో యంత్రాలు, పరికరాలు, మనుష్యులకు, పశువులు ఉపయోగించే విధంగా ఎవరూ ప్రయత్నాలు చేయటం లేదు. 'పల్లెసృజన' లాంటి సంస్థలు గత రెండు దశాబ్దాలుగా రైతుల కొరకు రైతులు చేసిన పరికరాలు కొంత సన్న, చిన్నకారు రైతుల అవసరాలకును తక్కువ పెట్టుబడితో సమకూరుస్తున్నాయి. నీరు ఏవిధంగానైనా రైతుకు చాలా వరకు తక్కువ ఖర్చుతోనే అందుతుంది. ఉపరితల జలాలు పెరిగితే ఈ ఖర్చులు రైతుకు మరింత తగ్గుతాయి.

రైతుకు ఎకరానికి 22-25 వేల రూపాయల ఖర్చు మామూలైపోయింది. 2-3 ఎకరాలున్న సన్న, చిన్నకారు రైతులు ఖరీఫ్, రబీ పంటలు పండించాలంటే కనీసం ఒక లక్ష రూపాయలు సమకూర్చుకుంటే కాని వ్యవసాయం ముందుకు సాగదు. ఈ పెట్టుబడి ఎలా వస్తుంది? ఎవరిస్తారు? రైతు ఎలా తీరుస్తాడు? తీర్చకపోతే వచ్చే పంటకు పెట్టుబడి ఎలా సాధ్యమవుతుంది. మరి సాధ్యం కాకపోతే రైతు జీవనం ఎలా సాగిస్తాడు. కుటుంబ ఖర్చులు, వారి నివాసం, ఆరోగ్యం, చదువు..... ఇవన్నీ ఎలా సాగుతాయి? వ్యవసాయాన్ని, కుటుంబాన్ని ఈడ్చుకుంటూ జీవితాంతం రైతులు ఇలా గడపాల్సిందేనా? గుదిబండ మెడకు కట్టుకుని నడవడం అంటే రైతు జీవితమేనేమో! సమాజానికి, వ్యవస్థకు ఈ బాధ అర్థం కావటం లేదు. అభివృద్ధి, లాభాలు లేని వ్యవసాయానికి భవిష్యత్తు ఉందా? యువతరం ఈ వ్యవసాయాన్ని కొనసాగిస్తారా? కొనసాగించాలంటే ఏం చేయాలి? ఏమీ చేయకుంటే మన దేశ వ్యవసాయ భవిష్యత్తు ఎలా ఉంటుంది? ఈ చర్చ అత్యవసరం. సన్న, చిన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకుని, వారి వ్యవసాయం లాభకరంగా ఎలా చేయాలన్న విషయం అతి ప్రధాన విషయంగా ఎంచి ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సమాజిక వర్గాలు మనసుపెట్టి చర్చించి, మంచి నిర్ణయాలు తీసుకోవాలి. పెట్టుబడి ఖర్చు సగానికి సగం తగ్గించే విధానాలు, రైతుల క్రియాశీలతనుంచి వచ్చే పరిష్కారాలను సమీకృతం చేస్తూ కొత్త వ్యవసాయ సహాయ విధానాలు అమలు చెయ్యాలి.

వ్యవసాయదారులకి ఏ పంట వేసి, ఏరకంగా వ్యవసాయం చేసినా లాభాలు రావటం అన్నదే ముఖ్యం. లాభాలు కావాలంటే పెట్టుబడి తగ్గాలి. పెట్టుబడి తగ్గాలంటే ఊరి బయటినుండి తక్కువ రావాలి. అది సాధ్యం చేయాలంటే ఊరిలోని ప్రకృతి సామర్థ్యాలను, వనరులను సంపూర్ణంగా వాడుకోవాలి. ఉదాహరణకు చింత చెట్టు సదా ఉత్పత్తి చేస్తూనే ఉంటుంది. చేపలు పిల్లలు పెడతాయి, కోళ్ళు గుడ్లు పెడతాయి, మేకలు, గొర్రెలు పిల్లలను ఇస్తాయి, పశువులు దూడలను పుట్టిస్తాయి, పురుగులు, చీమలు, పక్షులు నిరంతరంగా పునరుత్పత్తి చేస్తూనే ఉంటాయి. సూర్యుడు ఎండనిస్తూనే ఉంటాడు. వరుణుడు వర్షాలను కురుస్తూనే ఉంటాడు. వాయువు ఎల్లప్పుడు మన వెంటే ఉంటుంది..... ఇలా మనం వద్దన్నా ప్రకృతి తన పని తాను చేసుకుంటూ ఉంటుంది. ఇవన్నీ మనకు ఉచిత, పునరావృత పెట్టుబడులు. వీటిని పూర్తిగా అర్థం చేసుకుని, కాపాడుకుంటూ, వీలైతే పెంచుతూ, వాడుతూ, అతి తక్కువగా ఊరవతలి ఖర్చు (బయటి నుంచి కొనుగోలు చేయటం) ద్వారా వ్యవసాయం చేయాలి. పూర్వం భారతదేశంలో వ్యవసాయం ఇలాగే జరిగింది. దేశ ప్రజలకు ఎల్లప్పుడూ ఆరోగ్యాన్ని అందించింది. మన సమాజం 'పరస్పర ఆధారిత జీవన విధానం'గా వ్యవసాయాన్ని నిర్వహించింది, ఆచరించింది.

వ్యవసాయోత్పత్తులు మానవ మనుగడకు అత్యవసరం కావున వాటిని ద్రవ్యమానంతో పోల్చి, లాభకరమా కాదా అనే దృష్టికోణంలో చూడడం, పాశ్చాత్య వాసనలతో వాటిని కళ్ళు మూసుకుని ఆచరించరించడంతో వ్యవసాయంలో సంక్షోభం ప్రారంభమైంది.  పాశ్చాత్య పోకడలను గుడ్డిగా అనుకరించడమే కాకుండా, ప్రపంచ ఆర్థిక సంస్థల బెదిరింపులకు, అభివృద్ధి చెందిన రాజ్యాల ప్రాపకానికై భారత ప్రభుత్వాలు చేసిన నిర్ణయాలు కూడా మన వ్యవసాయాన్ని నిర్వీర్యం చేయడానికి తోడయ్యాయి. దీనికి తోడు, వ్యవసాయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చెందిన దేశాల టెక్నాలజీలను, పరిశోధనా విధానాలను కాపీ కొడుతూ వాటిని ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నాలు ఫలించడంతో భారతీయ వ్యవసాయ పద్ధతుల అస్తిత్వం మరుగున పడింది. ఒక విధంగా మటుమాయమయ్యింది. వీటన్నిటికి తోడు రాజకీయ నాయకుల మరియు అంతర్జాతీయ కాపిటలిస్టుల అవినాభావ సంబంధాలు, భారతీయ వ్యవసాయ విధానాలు రైతుల జీవితాలను పూర్తిగా సంక్షోభంలోకి త్రోసివేసాయి. ఇలా చేసిన వారే ఇప్పుడు "కార్పోరేట్ వ్యవసాయం" ఒక్కటే ప్రస్తుత సంక్షోభానికి పరిష్కారం అని వక్కాణిస్తున్నారు. ఇప్పుడు అర్థమయ్యింది కదా ఇన్ని సంవత్సరాలు మన వ్యవసాయాన్ని లాభకరంగా ఉండకుండా చేసి, మొత్తం వ్యవసాయం కార్పోరేట్ల చేతుల్లోకి తీసుకు వెళ్ళేందుకు దేశాన్ని సిద్ధం చేసిన ఘనత రాజకీయ నాయకులు – క్యాపిటలిస్టులదే. వీరి నాటకాలకు మనం దాసోహం అందామా? భావి తరాలు – ప్రకృతి ఒడిలో పరస్పర సహకార సహజీవన వ్యవసాయం కొనసాగిస్తూ 'దేశానికి పల్లెటూళ్లే పట్టుగొమ్మలు'  అనే మన పూర్వ కీర్తిని పునరుద్ధరిద్దామా అన్న అతి ప్రధాన నిర్ణయాన్ని చేయాలి.

వచ్చే తరాలకు మనం ఇచ్చే సందేశం ఏమిటి? వ్యవసాయాన్ని సాంకేతిక, పారిశ్రామిక శక్తులకు విడిచిపెడదామా? ప్రకృతి ఒడిలో మన ఒరవడితో వ్యవసాయాన్ని పునరుద్ధరిద్దామా? మన తర్వాతి తరాలు జవాబుకై ఎదురు చూస్తున్నాయన్న బాధ్యతను మనం మరచిపోవద్దు సుమా!

...... సంక్రాంతి శుభాకాంక్షలతో.....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



# చింతల వెంకట్ రెడ్డి మరో ఇన్నోవేషన్
# పంటల సర్వరోగ నివారిణి ఆముదము + మట్టి

- వీరరాఘవ రెడ్డి

'పల్లెసృజన' పాఠకులకు "పద్మశ్రీ" పురస్కార గ్రహీత చింతల వెంకట్ రెడ్డి గారు చిరపరిచితులే. రైతులు తమ పొలంలోని మట్టిని జాగ్రత్తగా ఎటువంటి రసాయన అవశేషాలు లేకుండా కాపాడుకుంటే అదే రైతులను గట్టెక్కిస్తుంది అని ఎన్నోసార్లు నిరూపించి, ఎన్నో ప్రయోగాలు చేసి, వాటికి పేటెంట్లను కూడా పొందారు. సాక్షాత్తు భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ గారే స్వయంగా దేశ విదేశాల్లో జరిగిన సభల్లో "మంచి దిగుబడులు సాధించ టానికి, చీడ పీడల నుండి విముక్తి పొందటానికి మా రైతుల టెక్నాలజీ అద్భుతం" అని ఉటంకించారు.

చింతల వెంకట్ రెడ్డి గారు ఇటీవల చేసిన ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు సాధించిన ఇన్నోవేషన్ "మట్టి + ఆముదము" వల్ల అన్ని రకాల పంటలు సర్వరోగ నివారణి పొందుతాయని తాను చేసి నిరూపించడమే కాదు, ఎంతోమంది రైతులు కూడా ఈ పద్ధతిని నమ్మి పాటించి అద్భుత ఫలితాలను పొందారు. ఈ పద్ధతిని గురించి 'పల్లెసృజన' పాఠకులకు అందిస్తున్నాము.

మూడు సంవత్సరాల క్రితమే ఈ విషయంపై ప్రయోగాలు చేయటం ఆరంభించారు చింతల వెంకట్ రెడ్డి. తన పొలంలో వంకాయ మొక్కలు, కొన్ని పండ్ల మొక్కలు, ఇంటిలోని పెరటి చెట్లపై ఆముదం కలిపిన మట్టి ద్రావణాన్ని వేరు వ్యవస్థకు అందివ్వటం, చెట్లపై పురుగు మందులా పిచికారి చెయ్యటం జరిగింది. ఈ ప్రయోగం వల్ల సాధారణంగా వంకాయ చెట్లను ఆశించే దోమ, కాయను తొలిచే పురుగులు ఏమాత్రం లేకుండా వంకాయలు కాయటం తో ఈ ప్రయోగం విజయవంతం అయిందని గ్రహించాడు. పండ్ల చెట్లు, ఇట్లోని పెరటి చెట్లు కూడా ఎటువంటి పురుగు సోకకుండా, ఆరోగ్యంగా పెరగటం గమనించాడు. ఇలా మొత్తం పంట కాలంలో రెండు లేదా మూడు సార్లు వేరుకు ఈ మిశ్రమాన్ని అందివ్వాల్సి ఉంటుంది.

మట్టి + ఆముదము తయారు చేసుకునే విధానం, వాటి వల్ల పంటలకు జరిగే లాభాలను గురించి తెలుసుకుందాం. సివిఆర్ మట్టి వ్యవసాయ విధానం గురించి గత సంచికలలో మీకు తెలియజేయటం జరిగింది. మీ పొలంలో నాలుగు అడుగుల లోతు వరకు త్రవ్వి తీసిన మట్టి ఎండలో 10-15 రోజులు బాగా ఎండనిచ్చి ఆ తర్వాత ఆ 'పై మట్టి', 'లోపలి మట్టి' లను వేరు వేరుగా పొలంలోని ఒక చెట్టు క్రింద లేదా మీకు వీలుంటే ఒక గదిలో వేసి ఉంచాలి. భవిష్యత్తులో ఈ మట్టి వర్షానికి ఎట్టి పరిస్థితుల్లో తడవ కూడదు అన్న విషయం గుర్తు పెట్టుకుని ఆ మట్టిని ఎటువంటి తడి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. మీరు తవ్వి ఉంచుకున్న లోపలి మట్టిని ఒక కర్రతో బాగా మెత్తగా దంచి, జల్లి పట్టి వచ్చిన మెత్తటి మట్టిని ఒక తట్టెడు (10-15 కిలోలు) తీసుకుని అందులో 200 మి.గ్రా. నుండి అర లీటరు ఆముదం బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని పంట మొదళ్ళ వద్ద ఒక్కో చెట్టుకు గుప్పెడు లేదా పిడికెడు చెట్టు దశను బట్టి వేయాలి. ఈ ఆముదము మట్టిని పొలంలో బాగా తేమ ఉన్నపుడు వేసినట్లయితే, మొక్కలు వెంటనే తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ విధంగా పంట మొత్తంమీద రెండు లేదా మూడు సార్లు చేస్తే చాలు.

త్రవ్వి తీసిన మట్టి ఎండలో 10-15 రోజులు బాగా ఎండనిచ్చి ఆ తర్వాత ఆ 'పై మట్టి', 'లోపలి మట్టి' లను వేరు వేరుగా పొలంలోని ఒక చెట్టు క్రింద లేదా మీకు వీలుంటే ఒక గదిలో వేసి ఉంచాలి. భవిష్యత్తులో ఈ మట్టి వర్షానికి ఎట్టి పరిస్థితుల్లో తడవ కూడదు అన్న విషయం గుర్తు పెట్టుకుని ఆ మట్టిని ఎటువంటి తడి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి.

ఇలా పంటలకు మట్టి, ఆముదం మిశ్రమాన్ని



అందివ్వటం వల్ల ఉద్యాన పంటలతో సహా అన్ని రకాల పంటలపై ఎటువంటి పురుగు ఆశించదు. ఆఖరుకు దోమ కూడా పంటలను ఆశించదు, మంచి నాణ్యమైన దిగుబడి వస్తుంది. ఈ విధంగా పండించిన పంట దిగుబడి ఎంతో ఆకర్షణీయంగా, రుచికరంగా ఉండటంతో పాటు ఎన్నో రకాల పోషకాలను కలిగి ఉంటుంది. ఇలా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలను భుజించటం వల్ల చాలావరకు రోగాలను నివారించుకోవచ్చు.

కర్నూలు జిల్లా, గోనెగండ్ల మండలం, నేరడుప్పల గ్రామ వాసి 'కురువ నర్సింహులు' అనే రైతు ఈ "మట్టి + ఆముదము" మొక్కలకు అందివ్వటం, మట్టి నీరు పిచికారి చేయటం ద్వారా ఎటువంటి రసాయన పురుగు మందులు, రసాయన ఎరువులు లేకుండా 5 ఎకరాల్లో వంకాయ పంట పండించాడు. కేవలం 60 రోజుల్లో వంగతోట దాదాపు నడుముల ఎత్తు వరకు పెరిగి చూడటానికి ఎంతో ఆకర్షణీయంగా ఉండటంతో పాటు, రైతు ఊహించని దిగుబడి వచ్చింది. ఆ పంటను, ఆ రైతు పండించిన విధానాన్ని తెలుసుకుందామని వీరరాఘవ రెడ్డి, గోనెగండ్ల మండలం 'తిప్పనూరు' గ్రామానికి చెందిన 'శ్రీరామ్' మరియు బొల్లవరం గ్రామానికి చెందిన 'సురేంద్ర గౌడు' లతో కూడిన 'పల్లెసృజన' బృందం "నేరడుప్పల" గ్రామానికి వెళ్ళింది. ఆ రైతు పొలానికి వెళ్ళినపుడు పంటను చూసి ఎంతో ఆహ్లాదం, ఆనందం వేసింది. ఇద్దరు ముగ్గురు వ్యక్తులు పొలంలోకి వెళ్ళి 'పుచ్చు ఉన్న వంకాయలు ఉన్నాయేమో చూద్దామని 15-20 నిమిషాల పాటు పొలమంతా తిరిగినా, ఒక్కటంటే ఒక్క పుచ్చు వంకాయ కనిపించలేదు'.

రైతు నర్సింహులు 'నేరేడుప్పల' గ్రామంలో ఆదర్శ రైతు. తనకున్న పొలంలో 5 ఎకరాల్లో వంకాయ పంట వేసి, దీన్ని సివిఆర్ పద్ధతిలోనే పండించాలని నిర్ణయించుకున్నాడు. త్రికరణశుద్ధిగా ఎటువంటి రసాయన ఎరువులు కాని, పురుగు మందులు కాని వాడకుండా వంకాయ పండించి, అద్భుత దిగుబడి సాధించాడు. ఆ పంటను చూస్తే చాలు కంటికి అంత ఇంపుగా అనిపించేలా పంట ఎదిగింది. ఎన్నో మూటల రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు ఉపయోగించిన తోటలకన్నా, ఎక్కువ దిగుబడి సాధించాడు. పంట చూడటానికి, తినటానికి కూడా ఎంతో నాణ్యత ఉండటం అదనపు ఆకర్షణ.

మట్టిని నీటిలో కలిపేందుకు నర్సింహులు పొలంలోనే నీటి తొట్టెలను ఏర్పాటు చేసుకున్నాడు. పంటపై పట్టి నీటిని పిచికారి చేయాలి అనుకున్నపుడు ఆ తొట్లలో అవసరమైన మట్టిని వేసి, అందులోకి నీరు వదులుతాడు. మట్టి నీటిలో బాగా కలిసి, కొద్దిసేపు తేరుకున్న తరువాత తాను పిచికారి చేసేందుకు అవసరమైన ఆధునికంగా తయారైన ట్రాక్టరు





అనుసంధానిత స్ప్రేయర్‌ను ఆ నీటి తొట్టెల వద్దకే తీసుకు వచ్చి స్ప్రేయర్ ట్యాంకులోకి మట్టినీటిని తోడుకుని, నేరుగా పొలంలోకి వెళ్ళి ఆ నీటిని పిచికారి చేస్తాడు. ఈ విధంగా చేయటం వల్ల తనకు చాలావరకు శ్రమ, మనుషుల అవసరం తగ్గిందని అంటారు నర్సింహులు. చాలామంది రైతులు ప్లాస్టిక్ నీటి డ్రమ్ముల్లో నీటిని తోడుకుని, అందులో మట్టిని కలిపి ఆ నీటిని స్ప్రేయర్లలోకి తోడుకుని వెళ్ళి స్ప్రే చేస్తూ ఉంటారు. ఆ పద్ధతిని మొదట్లో ఆచరించటం వల్ల ఈ పనికి 2-3 కూలీలు అదనంగా పని చేయవలసి వచ్చేదని, తన 5 ఎకరాల పంటకు ఇలా మట్టి నీటిని కలుపుకుని, తైవాన్ స్ప్రేయర్లతో పిచికారి చేయటం వల్ల కూలీల ఖర్చు ఎక్కువ అవుతోందని గ్రహించి, ఈ ట్రాక్టర్ అనుసంధానిత స్ప్రేయర్‌ను కొనుగోలు చేశాడు నర్సింహులు. ఇప్పుడు ఒకరు లేదా ఇద్దరు మనుషులు మొత్తం పొలానికి తక్కువ సమయంలోనే మట్టి నీటిని పిచికారి చేయటం వల్ల చాలావరకు కూలీల ఖర్చు, శ్రమ తగ్గిందని అంటాడు నర్సింహులు.

చింతల వెంకట్ రెడ్డి గారు కనుగొన్న మట్టి ఆముదం పద్ధతి, పంటలపై మట్టి ద్రావణం ఉపయోగించడం ద్వారా వరి, గోధుమల్లో డి-3 మరియు 'సి' విటమిన్ లు గణనీయంగా పెరిగాయి. ఈ విషయాన్ని అంతర్జాతీయంగా ఇప్పటికే కొన్ని దేశాలు పేటెంట్‌ను మంజూరు చేశాయి. చైనా దేశం కూడా వెంకట్ రెడ్డి గారికి 'పేటెంట్' మంజూరు చేసింది. వీరి మట్టి వ్యవసాయ పద్ధతులను మన దేశంలోని చాలా రాష్ట్రాలు ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల రైతులు విరివిగా ఉపయోగించుకొని ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల్ని పండించుకుంటూ, అధిక దిగుబడులను కూడా సాధిస్తున్నారు. మన తెలుగు రాష్ట్రాల రైతాంగం కూడా వచ్చే పంట కాలం నుంచి 'సివిఆర్' మట్టి వ్యవసాయ పద్ధతులను ఆచరించి, రసాయన రహితంగా, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను అధిక దిగుబడులు సాధిస్తారని ఆశిస్తోంది 'పల్లెసృజన'.

వారి సూచనలను ఆచరించి, ఆరోగ్యకరమైన పంటలను అధిక దిగుబడులు సాధించాలని ప్రతి రైతుకు సూచిస్తోంది 'పల్లెసృజన'. చింతల వెంకట్ రెడ్డి (సివిఆర్) వ్యవసాయ పద్ధతులు సంబంధించిన వీడియోలను ఇంటర్‌నెట్ ద్వారా 'గూగుల్' అయితే "చింతల వెంకట్ రెడ్డి" అని, 'యూట్యూబ్'లో అయితే 'సివిఆర్ టెక్నిక్' అని వెతకటం ద్వారా మీరు అన్ని వివరాలతో కూడిన వీడియోలు పొందవచ్చు. ●

**చింతల వెంకట్ రెడ్డి గారి ఫోన్ నెం. : 98668 83336**

**రైతు కురువ నర్సింహులు, కర్నూలు జిల్లా. ఫోన్ : 9704700336**

# కండక్టర్ నుండి ప్రకృతి ప్రేమికుడు - సాంప్రదాయ వైద్యుడుగా మారిన "అగ్రూరి బాల నర్సయ్య"



"పల్లెసృజన" 2006లో మొదలు పెట్టినపుడు 'పల్లెజ్ఞానం' సమానాంతరంగా విస్తృతి చెందాలన్న సంకల్పంతో ప్రారంభించ బడింది, తెలియకుండానే ఎంతో మంది జీవితాల్లో మార్పు తీసుకు వచ్చి సమాజానికి లేదా ప్రకృతికి మేలు చేసే స్థాయికి తీసుకు వచ్చింది. అలా 'పల్లెసృజన' ద్వారా జీవన గమనాన్ని మార్చుకున్న ఎంతోమంది వ్యక్తులలో "అగ్రూరి బాలనర్సయ్య" కథ గురించి తెలుసుకుందాం. ....

నల్గొండ జిల్లా, కనగల్ మండలం, తెలకంటి గూడెం గ్రామానికి చెందిన 45 సంవత్సరాల బాల నర్సయ్య తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, యాదగిరి గుట్ట డిపోలో కండక్టర్‌గా పని చేసేవాడు. ఉద్యోగం కూడా పర్మనెంట్ అయి, దాదాపు 26 వేల రూపాయల దాకా జీతం కూడా తీసుకుంటుండే వాడు. ఏ సాధారణ యువకుడికైనా అది తృప్తికరమైన జీవితం అని తన పనిలో నిమగ్నమౌతారు. కానీ, బాల నర్సయ్యకు మాత్రం ఆ జీవితం ఎందుకో తృప్తినివ్వలేదు. ఉద్యోగమైతే చేస్తున్నాడు కానీ, ఇది కాదు తన జీవితం, ఏదో చెయ్యాలి, ఏదో సాధించాలి అన్న తృష్ణతో తిరుగుతూ ఉండేవాడు. అలా ఒకరోజు ఆర్టీసీ పార్కులో తిరుగుతూ అక్కడ ఒక సంస్థ ఏర్పాటు చేసిన ప్రదర్శనను చూడటానికి వెళ్ళాడు. అక్కడ ఏర్పాటు చేసిన అన్ని స్టాల్‌లను చూసుకుంటూ ముందుకు వెళ్తున్నాడు కానీ, అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనలేవీ అతని మనసుకు హత్తుకు పోవటం లేదు. అలా చూసుకుంటూ ముందుకు వెళ్తున్నపుడు "పల్లెసృజన" స్టాల్‌ను కూడా యాదృశ్చికంగా చూడటం జరిగింది. అతనికి ఈ స్టాల్‌లో ఏదో ప్రత్యేకత ఉందే అనిపించింది. స్టాల్ ముందు ఇన్నోవేషన్లను ప్రదర్శినకు ఉంచారు, స్టాల్‌లో పల్లెసృజన పత్రికలు, ఇతర సమాచారం కొరకు ఏర్పాటు చేసిన వాటిని పరిశీలించాడు. అక్కడి ఇన్నోవేషన్లను తీక్షణంగా పరిశీలించి చూస్తూ వీటిలో ఏదో ప్రత్యేకత ఉందే అనుకుంటూ అక్కడ వున్న పత్రికను చూశాడు. కొన్ని పేజీలు తిరగేసిన తర్వాత ఈ పత్రికలో కూడా ఏదో ప్రత్యేకత ఉంది అనుకుని వెంటనే పత్రికకు చందా కట్టి, అక్కడ ఉన్న పాత పత్రికలకు కూడా కొంత సొమ్ము చెల్లించి ఇంటికి తీసుకు వెళ్ళాడు. వెళ్ళే ముందు 'పల్లెసృజన' కార్యాలయం ఎక్కడ ఉంటుంది అని అడిగాడు. సికింద్రాబాద్ లోని 'వాయుపురి'లో ఉంటుంది అని పత్రికపైన వున్న చిరునామా చూపించాడు అక్కడ స్టాల్ అజమాయిషీ చూస్తున్న సుభాష్ అనే వ్యక్తి. అక్కడ నేను 'బ్రిగేడియర్ గణేశం' గారిని కలవొచ్చా అని అడిగాడు. తప్పక కలవ వచ్చు అని సమాధానం చెప్పాడు సుభాష్.

ఇంటికి వెళ్ళి పత్రికలను తిరగేసిన తర్వాత దీన్ని గురించి ఇంకా తెలుసుకోవాలనిపించింది. ఒకరోజు వాయుపురి లోని 'పల్లెసృజన' కార్యాలయానికి వచ్చాడు. అక్కడ పాఠశాల విద్యార్థులకు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు గురించి ఇన్నోవేటర్లను గురించి పిల్లలకు వివరిస్తున్నారు బ్రిగేడియర్ గణేశం గారు. అక్కడ ఆ కార్యక్రమాన్ని విని, తర్వాత కార్యాలయం బయట ప్రదర్శనగా ఉంచిన ఇన్నోవేషన్లను శ్రద్ధతో తిలకించాడు. ఆ తర్వాత అక్కడ వున్న సందర్శకుల పుస్తకంలో తన పేరు, చిరునామా వ్రాసి, 'పల్లెసృజన' ఎక్కడ ఏ కార్యక్రమం ఏర్పాటు చేసినా నాకు కూడా సమాచారం ఇవ్వండి నేనూ అందులో పాల్గొంటాను అన్నాడు. ఆ తర్వాత గణేశం గారిని కలుసుకున్నారు కానీ, వారు కార్యాలయం అంతా చిన్న పిల్లలతో నిండి వుండటం, వారికి పల్లెసృజన గురించి వివరించే కార్యక్రమంలో హడావిడిగా ఉండటంతో, తనను తాను పరిచయం చేసుకుని, సరే నేను మళ్ళీ ఒకసారి వచ్చి మిమ్మల్ని కలుస్తాను సార్ అని వారివద్ద సెలవు తీసుకుని వెళ్ళాడు.

ఆ తర్వాత పత్రికలలో ముద్రించిన 'చిన్న శోధయాత్ర' గురించిన చిత్రాలు, దాన్ని గురించిన సమాచారం చదివాక ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలి అనుకున్నాడు. పత్రికలో వీటితో పాటు బాల నర్సయ్యకు బాగా నచ్చిన అంశం 'సంపాదకీయాలు'. సమాజంలో జరుగుతున్న విషయాలను ఓ కొత్త పద్ధతిలో చెపుతూ, వాటికి పరిష్కారం, సూచనలు, సమాజానికి ఇచ్చే సలహాలు చూసి "ఏదో గుప్తనిధి" దొరికినట్లుగా అనిపించి, ఎంతో ఆకట్టుకోవటంతో 'పల్లెసృజన' పట్ల ఇంకా మక్కువ పెరిగింది. ఎలా వీరివెంట తిరగటం,

ఎలా వీళ్ళతో మమేకం కావాలి అనుకుంటున్న సమయంలో 'శోధయాత్ర' గురించి పూర్తిగా చదివి, ఈ కార్యక్రమంలో ఎలాగైనా పాల్గొనాలి అనుకుని మొత్తానికి 2021 డిశంబర్ 17-19 తేదీలలో తెలంగాణ లోని 'ములుగు' జిల్లా, తాడ్వాయి నుండి ఏటూరు నాగారం వరకు జరిగిన 39వ శోధయాత్రలో పాల్గొనటం జరిగింది.

అప్పటి నుండి తాను హైదరాబాద్‌కు రావటం అంటూ జరిగితే 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించడం ఒక ప్రత్యేకమైన పనిగా పెట్టుకున్నాడు. ఆ తర్వాత పల్లెసృజన ఏర్పాటు చేసిన "పల్లెసృజన కుటుంబ సమావేశం", తెలంగాణ అటవీశాఖ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన "తెలంగాణ మూలికా వైద్యుల (సాంప్రదాయ వైద్యుల) సమావేశం"లో రెండు రోజులూ పాల్గొనటం జరిగింది. ఆ సాంప్రదాయ వైద్యుల సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వైద్యులతో పరిచయాలు, వారు సమాజానికి చేస్తున్న సేవలు విని అప్పుడు అనిపించింది 'పల్లెసృజన'తో పరిచయం ఏర్పడటం తన అదృష్టంగా భావించాడు. 'శోధయాత్ర'లో బ్రిగేడియర్ గణేశం గారి వెంట అడుగులు వేస్తూ వెళ్ళటం అనేది అందరికీ లభించే అదృష్టం కాదది, ఏదో సుకృతం చేసిన వాళ్ళకే లభించే అవకాశం అంటాడు బాలనర్సయ్య.

హైదరాబాద్‌లోని దూలపల్లిలో జరిగిన 'సాంప్రదాయ వైద్యుల సమావేశం'లో పాల్గొనటానికి ముందు, ఆ తర్వాత నా జీవితంలో చాలా తేడా జరిగింది అని ఖచ్చితంగా చెప్పగలను అంటాడతను. అక్కడ వైద్యులు తమ వైద్య విధానాలు, మూలికలు, వారికి సంక్రమించిన ఆ జ్ఞానం గురించి విన్న తర్వాత తాను కూడా తన పూర్వీకులు తాత 'లక్ష్మయ్య', తండ్రి 'రాములు' చేసిన వైద్యాలు, తాను తెలుసుకున్న కొన్ని మూలికల వివరాలు జ్ఞాపకం రావటంతో "ఇది తాను చేయవలసిన పని" అని నిర్ధారించు కున్నాడు.

తాను కూడా సాంప్రదాయ వైద్యుడుగా మారిపోయి కాలిన గాయాలకు, మధుమేహ వ్యాధి, పక్షవాతం, మధుమేహవ్యాధి గ్రస్తుల గాయాలు మానిపోయేలా చేయటం, మూత్ర పిండాల వ్యాధులతో పాటు మరెన్నో రోగాల నివారణ, నియంత్రణకు అవసరమైన మూలికా వైద్యం చెయ్యటంలో ఇప్పుడు ఎంతో పేరు గడించటం జరిగింది. తన వైద్యవృత్తి కూడా విజయవంతంగా నడుస్తోంది.

దూలపల్లిలో జరిగిన వైద్యుల సమావేశంలో తాను గమనించింది ఏమిటంటే, ఏ వైద్యుడి దగ్గర అవసరమైన మూలికలు లేవు, వాటిని సమీపంలోని అడవికి వెళ్ళి సేకరించడం లేదా వచ్చిన రోగులకే అవసరమైన మూలికల పేర్లు వ్రాసి మీ ప్రాంతంలో వున్న మూలికలు అమ్మే షాపుల్లో తీసుకోమనటం లాంటివే చేస్తున్నారు అని గ్రహించాడు. దీనికి విరుద్ధంగా తనకున్న 5 ఎకరాల పొలంలో కొంత పొలం తన భుక్తి



శోధయాత్రలో పాల్గొన్న బాలనర్సయ్య



కోసం పంటలు వేసుకుంటూ మిగతా పొలంలో వైద్యానికి అవసరమైన ఎన్నో రకాల ఔషధ మొక్కలను పెంచుకుంటున్నాడు. వీటిని తన వైద్యానికి ఉపయోగించుకోవటమే కాదు, సమీప ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులు తమ వ్యవసాయ క్షేత్రానికి వచ్చేలా చేసి, పిల్లలకు ఔషధ మొక్కల గురించిన జ్ఞానాన్ని వ్యాప్తి చేస్తున్నాడు. భావి తరాల వారికి కొన్ని మొక్కల పేర్లు, వాటి ఔషధ గుణాలు కూడా తెలియకుండా పోతున్నాయని, ఈ ఏర్పాటు చేయటం తనకెంతో ఆనంద దాయకం అంటాడు బాలనర్సయ్య. ఈ కార్యంతో పాటు ఎక్కడెక్కడి నుంచో వచ్చే రైతులకు, రోగులకు ఔషధ మొక్కలను అందించటం వల్ల కూడా ఔషధ మొక్కల పెంపకాన్ని విస్తృతం చేస్తున్నాడు ఈయన.

ముఖ్యంగా గ్రామ ప్రాంతాల్లోని మధ్య తరగతి వారికి ఈ మొక్కల పట్ల అవగాహన పెంచి, వారు మొక్కలను పోషించ గలిగితే చాలా వరకు తమ రోగాలను తామే నయం చేసుకుని, ఆసుపత్రుల పాలు కాకుండా, ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉందన్నది బాల నర్సయ్య అభిప్రాయం. సమాజంలోని ప్రతి ఒక్కరికి ఔషధ మొక్కల పట్ల అవగాహన పెరగాలి, వారి ఇళ్ళవద్ద నిత్యం అవసరమయ్యే ఔషధ మొక్కల పెంపకం చేపట్టేలా తనవంతు కృషి చేస్తున్నానని అంటాడు బాలనర్సయ్య. ఇతను కేవలం మొక్కలను పెంచటం, అందరికీ పంచటమే కాదు, సమాజంలోని తోటి వ్యక్తులకు తనకు చేతనైనంతలో ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించటంలో ఎప్పుడూ ముందుంటాడు నర్సయ్య. సాగర్ రోడ్డులో, తెలకంటి గూడెం సబ్‌స్టేషన్ దగ్గరలో బాలనర్సయ్య ఏర్పాటు చేసిన "సుగంధి హెర్బల్స్" లో ఔషధ మొక్కల పెంపకం, సాంప్రదాయ వైద్యం కోసం సంప్రదించవచ్చు.

'పల్లెసృజన' స్ఫూర్తితో సమాజానికి ఇంకా ఎంతో తనవంతు సహాయ సహకారాలు అందించాలన్న తృష్ణతో, తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఔషధ మొక్కలను పెంచుతూ, అవసరమైన వారికి వాటిని సరఫరా చేయటమే కాదు, బాల నర్సయ్య, అతని భార్య 'శ్రీమతి సరిత' తో కలిసి ఎంతోమందికి తమ సాంప్రదాయ వైద్యం ద్వారా ఎన్నో రుగ్మతలకు ఔషధాన్ని అందిస్తున్నాడు. వీరివద్దకు ప్రస్తుతం ప్రతి రోజు 40 నుండి 50 మంది వివిధ రోగాలతో వస్తూ ఉన్నారు.

బాల నర్సయ్య అందిస్తున్న ఔషధాలలో కొన్ని రోగాలను గురించి తప్పక తెలుసుకోవాల్సిన అవసరముంది. కిడ్నీలో రాళ్ళు ఏర్పడి, ఎంతో బాధను అనుభవిస్తున్న రోగులు కేవలం నెల రోజుల్లోనే

కిడ్నీలోని రాళ్ళు మూత్ర ద్వారాం ద్వారా క్రింద పడిపోయేలా ఆయుర్వేద ఔషధాలను అందిస్తున్నాడు. రోగి కిడ్నీలో వున్న రాళ్ళ మోతాదును బట్టి ఇచ్చే ఔషధంలో మార్పులు ఉంటాయి. ఇప్పటి వరకు దాదాపు 20 మి.మీ. వరకు వున్న రాళ్ళను కూడా మూత్ర ద్వారం ద్వారా బయటకు వచ్చేలా వైద్యం చేసి రోగలకు ఉపశమనం కలిగించాడు.

ఆ తర్వాత సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య "మధుమేహం". ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఇన్సులిన్ ఇంజక్షన్ తీసుకునే షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా 15 నుండి 30 రోజుల్లోనే మధుమేహం నియంత్రణ లోకి వచ్చేలా చేశాడు. ఈ వ్యాధి గ్రస్తులకు ఏవైనా గాయాలు అయితే ఒకపట్టాన అవి మానవు. రోజు రోజుకూ పుండు పెరిగిపోతూనే ఉంటుంది. ఒక దశలో అది చెడు కురుపుగా మారి కాళ్ళు, చేతులు తీసివేసిన వాళ్ళు కూడా ఎంతోమంది ఉన్నారు. అటువంటి రోగులకు కూడా షుగర్ తగ్గించడంతో పాటు పుండును కూడా మానేలా చేస్తాడు. గాయాన్ని కూడా శుభ్రం చేసి, అవసరమైన మందులు ఇవ్వటం వల్ల 10–15 రోజుల్లోనే గాయాలు మానిపొయ్యేలా చేస్తాడు.

ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోతున్న జబ్బుల్లో సోరియాసిస్ ఒకటి. అటువంటి రోగులకు కొన్ని మాత్రలు, శరీరంపైన వున్న దురదలు, పుండ్లు మానేలా ఒక తైలాన్ని తయారు చేసి ఇస్తాడు. నర్సయ్య మందుల ఉపయోగించిన ఎందరో రోగులు శరీరంపై దురద వల్ల గోక్కుని రసి కారి, పొట్టు రాలతున్న, పుండ్లు అయిన రోగులకు కూడా అవి కేవలం 10 రోజుల్లోనే పొట్టు రాలటం, రసి కారటం మాని పొయ్యేలా చేస్తాడు. ఈ వ్యాధి మానే ముందు కొద్దిగా దురద కూడా పెరిగి వ్యాధి నెల రోజుల్లోనే నయమైపోతుంది. సోరియాసిస్ వ్యాధి ఒక నెల రోజుల్లో 90 శాతం పైగా నయమైపోతుంది. మిగతా రోగం కూడా రెండు మూడు నెలల్లో పూర్తిగా నయమైపోతుంది అంటాడు నర్సయ్య. ఇంత వరకు తాను సోరియాసిస్‌కు మంచి ఇచ్చిన రోగులు మళ్ళీ వ్యాధి తిరగతోడింది అని ఎవ్వరూ రాలేదు అంటున్నాడు.

కొందరు రోగులు నోటి సమస్యల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటారు. అటువంటివారు ఇతరులతో మాట్లాడాలంటే కూడా ఎంతో బాధ పడుతూ ఉంటారు. తమ నోటి దుర్వాసన వల్ల ఇతరులు ముక్కు మూసుకుని వారితో మాట్లాడే పరిస్థితిని వారు భరించలేరు. వారితో మాట్లాడితే వినేవారు ఆ వాసనను భరించలేరు. అటువంటి రోగులకు కూడా కేవలం వారం పది రోజుల్లోనే ఆ సమస్య నుండి ఉపశమనం కలిగించాడు.

కీళ్ళ నొప్పులకు సంబంధించిన పైపూత మందు, తైలం (జండు బాం లాంటిది) వీరే స్వయంగా తయారు చేసి ఇస్తారు. వాటిని ఉపయోగించి వేలాది మంది ఉపశమనం కలిగిందని సంతోషంగా



పొలంలో పెరుగుతున్న ఔషధ మొక్కలు



మోకాలి నొప్పి నివారణ 'వర్మం చికిత్స' చేస్తున్న దృశ్యం


ఉందన్నారు. నల్గొండ, పరిసర మండలాల పరిధిలో 'బాల నర్సయ్య' వైద్యం ఎంతో పేరు గాంచింది.

బాలనర్సయ్య ఈ వైద్యాలన్నీ తన పూర్వీకుల నుండి చాలా వరకు నేర్చుకున్నాడు. తన తండ్రి యొక్క తండ్రి (జేజబ్బ), నాయనమ్మల నుండి కొంత వైద్యం, తన తండ్రి నుండి కొంత వైద్యం నేర్చుకున్నాడు. 2018 లో హైదరాబాద్ లోని దూలపల్లి అటవీశాఖ ప్రాంగణంలో, 'పల్లెసృజన' ఆధ్వర్యంలో జరిగిన సాంప్రదాయ వైద్యుల సమ్మేళనంలో అక్కడ పాల్గొన్న తెలంగాణ సాంప్రదాయ వైద్యుల వద్ద నుండి కొన్ని రోగాలను నయం చేసే వైద్యాలను నేర్చుకున్నాడు. ఇలా నేర్చుకున్న వైద్యాలకు తనదైన శైలిని జోడించి, వీలైనంత త్వరగా రోగాలు నయమయ్యేలా ఎంతోమంది రోగులకు ఉపశమనం కలిగిస్తున్నాడు.

జాతీయ స్థాయిలో ఇటీవల 'గోవా'లో ఏర్పాటు చేసిన 'సాంప్రదాయ వైద్యుల సమ్మేళనం'కు బాల నర్సయ్యను 'పల్లెసృజన' తరుఫున ఎంపిక చేసి పంపడమైనది. ఆ సమావేశంలో జాతీయ స్థాయిలో వైద్యులను కలవటం వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుసుకో గలిగామని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు బాల నర్సయ్య.

ప్రకృతి ప్రసాదించిన ఎన్నో ఆయుర్వేద మొక్కలను పోషిస్తూ, వాటితో తన చుట్టు ప్రక్కల గ్రామాల్లోని వారికి ఉపశమనం కలిగించడంతో పాటు, తోటి వైద్యులకు అవసరమైన ఔషధ మొక్కలను అందజేస్తూ ఆనందంగా జీవనం కొనసాగిస్తున్నాడు బాలనర్సయ్య. ఒక సాధారణ కండక్టరును సమాజానికి వైద్యుడుగా, సహాయ సహకారాలు అందించే వ్యక్తిగా మారి, చివరికి తన ఉద్యోగానికే రాజీనామే చేసి, వైద్యం, ఔషధ మొక్కల పెంపకం ప్రధాన వృత్తి అయ్యేలా తనకు తెలియకుండానే 'పల్లెసృజన' ఉపయోగ పడినందుకు ఎంతో ఆనందంగా ఉంది పల్లెసృజన కుటుంబానికి. బాల నర్సయ్య ఏర్పాటు చేసిన "సుగంధి హెర్బల్స్" పేరుతో అందిస్తున్న వైద్యం, ఔషధ మొక్కల వితరణ దినదినాభివృద్ధి చెందాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ●

**అగ్రూరి బాల నర్సయ్య, ఫోన్ : 9515194746, 7989761918**



విపత్కర పరిస్థితుల్లో సృజనాత్మకతను వెలిదీయటం

# కరోనా కష్టకాలంలో అనుభవాలు

(ఆచార్య అనిల్ గుప్త గారి 'హనీబీ' పత్రిక సంపాదికీయానికి స్వేచ్ఛానువాదం)

- స్వేచ్ఛానువాదం : జమ్ములమడక శశిమోహన్

కరోనా సమయంలో విధించిన లాక్‌డౌన్, షట్‌డౌన్ ల వలన కలిగిన కష్టాలని తట్టుకోవడానికి చాలామంది పేదవారు, కొందరు గొప్ప వారు కూడా సంసిద్ధంగా లేరు. వారు ఆ కాలంలో తమ ఆర్థిక, సామాజిక కార్యకలాపాలు నిర్వహించుకోవటానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు, సామాజిక సంఘాలే కాక, సామాన్యులు కూడా ఎంతోమంది మరెన్నో విధాల సేవలందించారు. దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది మునుపెన్నడూ లేనంత కష్టం అనుభవించాల్సి వచ్చింది. కానీ, ఇంత కష్టకాలంలో కూడా ఎక్కడో మిణుకు మిణుకు మంటూ చిన్న ఆశ కనిపించింది నాకు.

కష్టాలని తగ్గిస్తాయని కాదుగానీ, నేను కొన్ని ఆశాజనక అంశాలను మీముందుంచుతాను. ఇది కేవలం మునుపెన్నడూ కనీ వినీ ఎరుగని విపత్కర పరిస్థితుల్లో కూడా ధైర్యం, దీక్ష, పట్టుదల, పరిశోధనలతో కొత్త పరిష్కారాలు చాలా తక్కువ సమయంలో మనకున్న తక్కువ వనరులతోనే కష్టకాలం గట్టెక్కించేందుకు నిరంతరం జరిగిన శ్రమ దీన్నే గుర్తు చేసుకుందాము.

ముందుగా వలస కార్మికుల గురించి చెప్పుకొందాం. వారిలో చాలామందిని వారి యజమానులు, కాంట్రాక్టర్లు పనిలోంచి తీసి వెయ్యగా, వారు కాలి నడకన కొన్ని వందల కిలోమీటర్లు నడిచి, తమ స్వంత గ్రామానికి వెళ్ళే ప్రయత్నం చేశారు. ఈ సమయంలోనే కొందరు సేవా తత్పరత కలిగినవారు గతుకుల రోడ్లలో నడుస్తుండగా గాయపడి రక్తం కారుతున్న కొందరి కాళ్ళకి మందు వేసి కట్టు కట్టిన వాళ్ళున్నారు, త్రాగటానికి మంచి నీరందించి, భోజనం పెట్టి, పాదరక్షలు ఇచ్చిన వారూన్నారు. ప్రభుత్వాలు, అధికారులకన్నా ముందు వారికి రవాణా సదుపాయం కల్పించిన వారున్నారు. తరువాత ప్రభుత్వం వీరికి ప్రత్యేక రైళ్ళు, బస్సులు, ఏర్పాటు చేసింది. అనేకమంది గుంపులుగా ఏర్పడి ఈ వలస పోయే వారికి భోజన వసతి కల్పించారు. 'GIAN' వారు తమ అన్నపూర్ణ పథకం ద్వారా కొన్ని వేల మంది ఆకలి తీర్చింది. చాలా సందర్భాల్లో భోజనం పెట్టటంకన్నా, భోజనం అవసరమున్న వాళ్ళని వెతికి పట్టుకోవటం కష్టమైపోయింది. దేశంలోని మారుమూల ప్రాంతాలలో వున్న ఇటువంటి వలసదారులని వెతకటం కష్టమైంది. పైగా పట్టణాల నుంచి పల్లెటూర్లకు వలన వచ్చినవారు కోవిడ్ వ్యాపించకుండా లాక్‌డౌన్, కర్ఫ్యూలు విధించింది ప్రభుత్వం. కాకపోతే పల్లెలలో వసతులు తక్కువ కనుక ఇటువంటి చర్యలు తీసుకొనకపోతే, వారి కదలికలు నియంత్రించకపోతే ఇంకా ఎక్కువ ప్రమాణంలో అనర్థం జరిగుండేది. పట్టణాల నుంచి ఇటువంటి కార్మికుల (ఉపాధి కోల్పోయిన వారు) కై వారు తమ తమ స్వంత గ్రామాలు చేరటానికి కొంత కాలం లాక్‌డౌన్‌ని ఎత్తివేస్తే బాగుండేదేమో ! కాకపోతే ఈ కోవిడ్ వైరస్ ఎంత ప్రమాదకరమైనదో అప్పటికి ఇంకా పూర్తిగా అవగాహన రాలేదు కనుక అధికారులు చాలా కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి వచ్చింది.

ఆ సమయంలో చాలా సవాళ్ళు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రోగ నిర్దేశక కేంద్రాలు దాదాపు లేనట్లే, వైద్య సిబ్బందికి పిపిఇ రక్షణ వస్త్రాల కొరత, రోగ నిరోధక మందులు, తగినన్ని ఆసుపత్రులు, పడకలు... లాంటి ఎన్నో జటిలమైన సమస్యలు పెను సవాళ్ళుగా నిలిచాయి. కానీ ప్రపంచం ఆశ్చర్యపోయే విధంగా చాలా స్వల్ప సమయంలోనే (నెలలు) భారతదేశం కోవిడ్ వ్యాక్సిన్ కనుకొనటమే కాదు, ప్రపంచ దేశాలన్నింటికి ఉచితంగా ఎగుమతుల రూపంలో అందించింది. ఈ ఘనత మనదేశం ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధి చేసుకొంటున్న బయోటెక్నాలజికల్ సామర్థ్యత. అది ఈ ఆపత్కాలంలో పనికి వచ్చింది. ఆ కాలంలో ఆక్సిజన్ ఉత్పత్తి చేసే యంత్రాలు ఆస్పత్రులలో, ఇళ్ళలో వాడుకోవటానికి సిలిండర్ల కొరత ఏర్పడింది. చాలా తక్కువ సమయంలోనే ఆ కొరతని తీర్చుకొనే సామర్థ్యాన్ని సంపాదించాం. ఎన్నో వేల ప్రాణాలు కాపాడుకోగలిగాము. ఆ కాలంలోనే 'అమరేలీ' ప్రాంతంలో శోధయాత్ర జరపుతుంటే, ఒక విషయం తెలిసింది. అక్కడ ఆక్సిజన్ సిలిండర్లు ఏర్పాటు చేసుకో గలిగారు కానీ, దాని రెగ్యులేటర్‌లు తగినన్ని లేక సిలిండర్లు నిరుపయోగంగా ఉండిపోయాయి. అప్పుడు 'జోషి' అనే ఒక ఇన్నోవేటర్ డాక్టర్లని కలిసి రెగ్యులేటర్‌ల డిజైన్‌లు దానిలో నుంచి బైటకొచ్చే ఆక్సిజన్

నియంత్రించటం, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు లాంటి వివరాలు తెలుసుకొని తానే స్వయంగా ఒక రెగ్యులేటర్ తయారు చేసి, దానిని నిపుణులైన డాక్టర్లచేత పరీక్షింపజేసి, వారు సంతృప్తి వ్యక్తం చేసిన తరువాత 150 రెగ్యులేటర్‌లు తయారు చేసి ఉచితంగా అందజేశాడు. ఈవిధంగా ఎన్నో వేల ప్రాణాలు కాపాడినవాడైనాడు. అదే కాలంలో పోలీసులు కూడా చాలా కష్టపడి గంటలు, రోజుల కొద్ది విశ్రాంతి లేకుండా తమ సేవ అందించారు. వారి స్వంత కుటుంబాలు ఎలా ఉన్నాయో కూడా పట్టించుకోకుండా డ్యూటీ చేశారు. అటువంటి వాళ్ళ కొరకు కొందరు యువకులు, బాధ్యత గల పౌరులు పోలీసుల అనుమతితో, వారికి ఇబ్బంది కలగకుండా పోలీసులు చేసే డ్యూటీని తగు జాగ్రత్తలు పాటిస్తూ చెయ్యటం గమనించాము.

చాలా స్టార్టప్ కంపెనీలు కోవిడ్ సమయంలో సహాయకారిగా ఉంటూ, అనేక వస్తువులు, పరికరాలు చాలా తక్కువ కాలంలోనే తయారు చేసి అందించారు. అవి చైనా లాంటి దేశాల నుంచి చవకగా దిగుమతి చేసుకొన్న రకాలకన్న ఎంతో నాణ్యమైనవిగా ఉండి, పరిస్థితిని చక్కదిద్ది ఎన్నో ప్రాణాలను కాపాడాయి. ఈ కనివినీ ఎరుగని విపత్కర పరిస్థితుల్లో ఆరోగ్య సదుపాయాలు తగినన్ని లేని సమయంలో, మన రక్షణ మరియు ఇతర స్వచ్ఛంద ధార్మిక సంస్థలు తాత్కాలిక ఆసుపత్రులను ఏర్పాటు చేశాయి. ఎంతోమంది డాక్టర్లు, వైద్య విద్య చదువుతున్నవారు కూడా రాత్రి పగలు తమ స్వంత ఆరోగ్యం అని చూడకుండా తమ సేవలందించారు. ఎందరో ఈ మహా యజ్ఞంలో సమిధలై పోయారు. ఇతరులను రక్షించుటకై తమ ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తించి, తగువిధంగా మరణానంతర సత్కారం అందించటం మన కనీస విధి. పౌర సమాజం 1962, 1965 యుద్ధాల తర్వాత ఆపత్కాల పరిస్థితులని ఏవిధంగా ఎదుర్కొన్నారో కొంచెం నేర్చుకొన్నది. కాని ఇప్పుడు అది సరిపోదు. మనమింకా అప్రమత్తంగా ఉండాలి అనిపిస్తోంది.

ప్రకృతి కొద్ది కాలంలోనే తిరిగి తన పూర్వ స్థితికి వచ్చి, తన కష్టాలను తట్టుకొనే శక్తిని ప్రదర్శించింది. పారిశ్రామిక ఎదుగుదలని ఎవ్వరూ కాదనరు కానీ, ప్రకృతికి మనం హాని చెయ్యకుండా వుంటే, అదే మనలో నూతనోత్సాహాన్ని నింపుతూ తాను నూతన ఒరవడులు తొక్కుతుంది.

మనిషిని మనిషి పట్టించుకోని ఈ కష్ట కాలంలో కొందరు మానవతా మూర్తులు వీధి కుక్కలు, యజమానులు వదిలి వేసిన కుక్కలకు లాక్‌డౌన్ కాలంలో అవి ఆకలి దప్పులతో అలమటించి మరణించకుండా వాటికి ఆహార పానీయాలందించారు.

పిల్లల చదువులు బాగా దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే పిల్లలు ఆన్‌లైన్ తరగతులు ఏర్పాటు చేసినా, చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సాధారణంగా పేదవారి పిల్లలే





ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతారు కనుక వారి తల్లిదండ్రులు వారికి ఆన్‌లైన్ క్లాసులకి అవసరమైన స్మార్ట్ ఫోన్‌లు, లాప్‌టాప్‌లు, ఐపాడ్‌లు సమకూర్చలేక పోయారు. కొందరు ఆలోచనా పరులైన ఉపాధ్యాయులు (బాలాజాదవ్) కాన్ఫరెన్స్ కాల్స్ ద్వారా పిల్లలకి పాఠాలు చెప్పారు. ఇంకొందరు (అశోక్ భాయ్ లాంటివారు) స్థానిక కేబుల్ టీవీ ఛానల్ వాళ్ళను ఉపయోగించుకొని వేలమంది పిల్లలకి పాఠాలు చెప్పారు. కొందరు ఉపాధ్యాయులు బ్లాక్ బోర్డ్‌లను తన ద్విచక్ర వాహనాలపై తీసుకు వెళ్ళి పిల్లల ఇలాఖాలలో పాఠాలు చెప్పారు. కొందరైతే లౌడ్ స్పీకర్లు కూడా వాడి పాఠాలు చెప్పారు. ఈవిధంగా ఈ కరోనా కష్టకాలంలో నూతనంగా ఆలోచించి, రకరకాల కొత్త పద్ధతుల ద్వారా ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు చెప్పారు. ఇంత చేసినప్పటికీ చాలామంది పిల్లలు ఈ కాలంలో పాఠాలకి దూరమైనారు. ఇలా నష్టపోయిన చదువు కాలాన్ని భర్తీ చెయ్యటానికి కొత్తరకం బోధనా పద్ధతులు, పరికరాలు కావాల్సి రావచ్చు. అది అందరూ ఆలోచించాల్సిన విషయం.

ఈ విపత్కర పరిస్థితుల్లో శాస్త్రవేత్తలు, పరిపాలనా సిబ్బంది, ప్రజలు ఎంతో కష్టపడి తమ శక్తికి మించి శ్రమించి పనిచేసిన సందర్భాలలో మనం నేర్చుకొన్న పాఠాలేంటి? ప్రపంచాన్ని అతలా కుతలం చేసిన ఈ కష్ట కాలంలో లక్షల సంఖ్యలో కార్మికులు వలస పోవాలంటే, పోలీసులు కానీ, ఇతర ప్రభుత్వ యంత్రాంగం కానీ వారి వలసలకి కొంచెం వెసులుబాటు కల్పించి నిబంధనలని సడలించి ఉంటే బాగుండేది. వాళ్ళు మైళ్ళకొద్ది కాలినడకన నడిచి వెలుతుంటే కొంత సహాయ సహకారాలందించి ఉంటే బాగుండేదేమో. (కానీ ఆ రోజుల్లో ఉన్న పరిస్థితుల్లో ఈ వెసులుబాటు ఇవ్వాలన్న ఆలోచన కూడా ఎవ్వరికీ వచ్చి ఉండకపోవచ్చు) చాలామంది కుటుంబ సామాను మొత్తం ఒక్క సైకిల్‌పై తీసుకొని వెళుతూ అదీ చేతకాక సైకిళ్ళను వదిలేసి వెళ్ళిపోయిన వారున్నారు. కనీసం వారికి కొత్త సైకిల్ కొనుక్కొనే సహాయం చేసినా బాగుండేది.

మరలా ఇటువంటి విపత్కర పరిస్థితులు సంభవిస్తే ప్రజలు ఏవిధంగా ప్రవర్తించాలి, నడుచుకోవాలి, ఆ తీరుతెన్నులు రాసివుంచే విపత్కర పరిస్థితుల కరదీపికకు కొన్ని మార్పులు చేసుకోవాల్సి ఉన్నదేమో. ఇటువంటి కనివినీ ఎరుగని పరిస్థితులు సంభవిస్తే, ప్రజలు, విద్యార్థులు, ఇతరులు ఏవిధంగా స్పందించాలి అని పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలలో తప్పనిసరిగా ఒక పాఠ్యాంశంగా చెప్పాలి. భగవంతుని దయవలన శతాబ్దికొకసారి వచ్చే ఇటువంటి దుర్ఘటన మళ్ళీ రాకూడదనే కోరుకొందాం. కానీ ఖర్మకాలి వస్తే దీనిని ఎదుర్కోవటానికి మనం సర్వ సన్నద్ధంగా ఉండాలి. ఇటువంటి సందర్భాలలోనే కొత్త ఆలోచనలు, ఇన్నోవేటర్లు, ఇన్నోవేషన్‌లు మానవాళికి ఇతర జీవరాసులకి రక్షణలో సహాయకారిగా ఉండటానికి చాలా అవసరం ఎంతైనా ఉంటుంది అనిపిస్తుంది. ●

# జాతీయ మీడియా ప్రశంసలు, అంతర్జాతీయ పురస్కారం అందుకున్న 'ప్రకృతి ప్రేమికుడు' కొమెర జాజి



-వీరరాఘవ రెడ్డి

పల్నాడు (సమైక్య గుంటూరు) జిల్లా, కారంపూడి గ్రామవాసి "కొమెర జాజి" (అంకారావు) 'పల్లెసృజన' పాఠకులకు, ఫేస్ బుక్, ట్విట్టర్, యూట్యూబ్ లాంటి సాంఘిక మాధ్యమాలను అనుసరిస్తున్న కోట్లాది మందికి చిర పరిచితుడే. వారంలో కనీసం 5 రోజులు కేవలం అడవిని శుభ్రం చేయటం కోసమే తన జీవితాన్ని ధార పోసిన ఇతని అనన్య ప్రకృతి ప్రేమకు స్పందించని హృదయం ఉండదు అంటే అతిశయోక్తి కాదు.

విశ్వంలో ప్రతి ప్రాణికి ఆక్సిజన్ అందుతోంది అడవుల ద్వారా నే. ప్రతి రైతు జీవన విధానం ప్రకృతి పైననే ఆధారపడి ఉంటుంది. ఒకప్పుడు సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండేవి. నేడు ఆ పరిస్థితి లేదు. అందుకు కారణం అడవులు అంతరించి పోవడం, అక్కడ వాతావరణం దెబ్బ తినడం వల్ల అరుదైన మొక్కలు అంతరించి పోతున్నా యి. అడవిని ఆధారంగా చేసుకుని జీవించే ప్రాణులు కూడా కనిపించకుండా పోతున్నాయి. భూగర్భ జలాలు అంతరించి పోవటం వల్ల ప్రాజెక్టులలో నీరు ఇంకిపోతోంది. జీవ నదులు ఎండిపోతున్నాయి, రైతు జీవనం పూర్తిగా దెబ్బతిని, ఆహార కొరత ఏర్పడి కరువు కోరల్లోకి జారిపోయి, యుద్ధాలు కూడా జరిగే ప్రమాదం పొంచివుంది. అందుకే నావంతు కనీస బాధ్యతగా ఈ అడవుల్లోని వ్యర్థాలను ఏరి శుభ్రం చేస్తూ, మొక్కలు నాటుతూ, వాటికి అవసరమైన నీరు అందిస్తూ, అడవులు పూర్వ వైభవా న్ని సంతరించుకునేందుకు కృషి చేస్తున్నాను. అడవులను కాపాడుకోలేక పోతే భవిష్యత్తు తరం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది అంటాడు కొమెర జాజి.

ఈ కార్యక్రమం భవిష్యత్తులో కొనసాగాలన్న ఉద్దేశ్యంతో విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన పెంపొందించే కార్యక్రమం చేస్తుంటాడు జాజి. ప్రతి పాఠశాలలో విద్యార్థులతో మమేకమై ఇలాంటి కార్యక్ర మాలను సమాజానికి తెలియజేస్తున్న "పల్లెసృజన" పత్రికను వారికి చూపించి, గ్రామ గ్రామాన ప్రతి విద్యార్థి మనసులో పల్లెసృజనపై ప్రేమ కలిగేలా తన ప్రకృతి పాఠాల అనంతరం "పల్లెసృజనకు జై, పల్లెసృజన కుటుంబా నికి జై" అంటూ ప్రతి చిన్నారిచేత నినాదాలు చేయిస్తుంటాడు. నేటి బాలలే రేపటి పౌరులు అని అందరూ అంటుంటారు. కానీ జాజి మాత్రం ఈ చిన్నారులదే భవిష్యత్ లోకమని, ఆ విద్యార్థులను ప్రకృతికి భక్తులుగా మార్చడమే తన లక్ష్యమని, ఇప్పటికే కొన్ని లక్షల మంది విద్యార్థులకు ప్రకృతిపట్ల అవగాహన కల్పించాను అని సగర్వంగా చెప్పుకుంటాడు.

ఇలాంటి జాజి అందిస్తున్న సేవలను గుర్తించిన అమెరికాలోని కాలిఫోర్నియాకి చెందిన "టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్" సంస్థ భారత దేశంలో "వరల్డ్ కైండ్‌నెస్ డే-2022" పురస్కారాల్లో 'టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్' ల సరసన మన 'పర్యావరణవేత్త'గా కొమెర జాజి కూడా "తాల్ హీరో" (TALHero) పురస్కారం అందుకోవడం ఆనంద దాయకం. ఇది తాను అవార్డులు, రివార్డులతో అవసరం లేకుండా, తన పని తాను చేసుకుం టూ పోతున్న జాజి నిరాడంబరతకు సమాజం అందించిన గౌరవం.

ప్రకృతి ప్రేమికుడుగా మారిన "కొమెర జాజి" నల్లమల అడవికి చేస్తున్న సేవకు ప్రకృతి పులకరిస్తోంది. అడవులలో ఎందరో





అడవిలో మొక్కలు నాటి, ఎంతో దూరం నుండి నీరు తెచ్చి పోస్తు దృశ్యం

యువకులు తమ పార్టీల పేరుతో అడవులను ప్లాస్టిక్ మయం చేస్తుంటే, వాటిని శుభ్రం చేయడం, పాఠశాలలకు వెళ్ళి పిల్లలకు ప్రకృతి పాఠాలు చెప్పడం నిరంతరంగా చేస్తూనే ఉన్నాడు. వీరి సేవా భావానికి ప్రపంచ దేశాల్లోని పేరెన్నిక గన్న 'ద వీక్' లాంటి పత్రికలు, బిబిసి లాంటి వార్తా ఛానల్లు, సామాజిక మాధ్యమాలు, ఇతన్ని గురించి కథనాలు ప్రచురిస్తున్నాయి, ప్రసారం చేస్తున్నాయి. ఇంతటి ఘనత సాధించిన జాజి నేటికీ సామాన్య మానవుడిగా తన పని తాను చేసుకుంటూ పోతునే ఉన్నాడు.

2022లో 'జాజి' గురించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన వార్తలు : 1. జనవరి 30, ఆదివారం ఆంధ్రజ్యోతిలో కవర్‌పేజి కథనం, 2. మార్చిలో 'హిందూ నగారా' పత్రిలో వ్యాసం, 3. మార్చిలో 'పల్లెసృజన' పత్రిలో కథనం, 4. జులై 17న ఆదివారం ఆంధ్రజ్యోతిలో ఒక పేజి వ్యాసం, 5. సెప్టెంబర్‌లో 'కాన్ఫిడెన్స్' ఆంగ్ల పత్రికలో 4 పేజీల వ్యాసం, 6. నవంబర్ 13న 'బిబిసి' ఛానెల్‌లో ప్రసారం, 7. నవంబర్ 21న 'ఎబిఎన్ ఛానల్'లో ప్రసారం, 8. డిశంబర్ 5న 'స్వతంత్ర' ఛానెల్ ప్రసారం, 9. డిశంబర్ 11న 'సాక్షి' ఆదివారం పత్రికలో వ్యాసం, 10. డిశంబర్ లో 'ద వీక్' ఆంగ్ల పత్రికలో 4 పేజీజల వ్యాసం, 12. డిశంబర్ 25న 'తెలంగాణ' 'ఆదివారం' పత్రికలో వ్యాసం, 13. డిశంబర్ 30న ఈనాడు పత్రికలో వ్యాసం, 14. 'పల్లెసృజన' నవంబర్–డిశంబర్ పత్రికలో వ్యాసం.. ఇవే కాకుండా పలు యూట్యూబ్ ఛానళ్ళలో కథనాలు, 1. tharjani.in, 2. indiaherald.com, 3. northlines.com, 4. ipanewspack.com, 5. teluguoneindia.com, 6. ruralmedia.in, 7. tryxyz.com, 8. msn.com, 9.capitalvoice.com లాంటి పలు వెబ్‌సైట్‌లలో వ్యాసాలు ప్రచురితమయ్యాయి. " 'ప్రకృతి తల్లి' నా బాధ్యతను ఈవిధంగా తీసుకుంది. ఇది పూర్తిగా 'పల్లెసృజన కటుంబం' విజయం. నేను ఇప్పటికీ, ఎప్పటికీ 'పల్లెసృజన' బిడ్డనే. ఇది మనస్ఫూర్తిగా చెప్తున్న మాట. సమాజం అందరికీ తేనె పంచమని 'పల్లెసృజన' వదిలిన 'తేనెటీగ'ను నేను. పల్లెసృజన ఆజ్ఞ ప్రకారం తేనెను పంచుతున్నాను." అంటాడు జాజి.

తనకున్న రెండెకరాల పొలంలో ఒక ఎకరం పొలాన్ని జొన్న పంట వేసి, ఆ పంటను తాను ఇంటి కొరకు కోత కోసుకుని నూర్పిడి చేసుకోకుండా కేవలం పక్షులు తినటానికే కేటాయించాడు. సరియైన



తిండి లేక పక్షులు కూడా అంతరించి పోతున్నాయని వాటి పోషణకు తనవంతు సహాయం చేస్తున్న జాజి గొప్ప మానవతావాది అనటంలో ఆశ్చర్యం లేదు. అడవులకు సమీప గ్రామాలు, పట్టణాల్లోని వ్యక్తులు తమ సంతోషం కోసం మద్యపానీయాలు, చిరుతిండ్లను ప్లాస్టిక్ సంచులలో తెచ్చుకొని, అడవుల్లో సంతోషంగా గడుపి వాటిని మాత్రం అక్కడే వదిలేసి వస్తున్నారు. వాటిలో మిగిలి వున్న ఆహార పదార్థాలతో పాటు, ప్లాస్టిక్ కూడా తినటం వల్ల కొన్ని పక్షులు, జంతువులు మరణించడం తన కళ్ళారా చూసి, మనసు చలించి ఈ విధంగా అడవులను శుభ్రం చేస్తూనే ఉన్నాడు.

తాను గతంలో ప్రకృతి పాఠాలు చెప్పిన పల్నాడు జిల్లా, కారంపూడి మండలం లోని సింగరుట్ల తాండా పాఠశాలను తిరిగి సందర్శించినప్పుడు అక్కడ 'పక్షుల కోసం "పక్షిగూడు ప్రాజెక్ట్" చేపట్టి పక్షుల కొరకు గూళ్ళను ఏర్పాటు చేయటం చూసి ఎంతో సంతోషించాడు. పిల్లలకు మనం ఏది చెప్తామో అదే ఖచ్చితంగా చేస్తారు. ఇంత చిన్న వయసులోనే ఎంత గొప్ప ఆలోచన చేశారని ఆశ్చర్య పోయాడు. "ప్రకృతి పాఠశాల" పేరుతో తాను ఎన్నో పాఠశాలలకు వెళ్ళి ప్రకృతి పాఠాలు నేర్పడం వల్ల తప్పకుండా ప్రయోజనం చేకూరుతోందని ఎంతో మురిసిపోతాడు కొమెర జాజి.

పెరటి తోటల్లోని మొక్కలను విద్యార్థులకు చూపిస్తూ, వాటి పేర్లు, వాటివల్ల మానవాళికి, పశు పక్ష్యాదులకు చేకూరే లాభాలు, వాటిలోని ఔషధ గుణాలు, అవి ఎప్పుడు చిగుర్లు వేస్తాయి, వాటిని ఎలా రక్షించుకోవాలి విషయాలను చెబుతూ చిన్నారుల్లో ప్రకృతిపై ప్రేమ అనే బీజాలను వేస్తున్న గొప్ప ఆశావాది కొమెర జాజి. మొక్కలు మనకు ఎలా మేలు చేస్తాయి, వాటిలోని ఔషధ గుణాలు తెలియజేస్తూ ప్రత్యక్షంగా మొక్కలను వారికి చూపించడం వల్ల వారిలో ఎంతోకొంత మంది తాము చూసిన మొక్క ఎక్కడైనా కనబడితే, వాటి సంరక్షణ చెయ్యక పోతారా అని చిన్న ఆశ అంటాడు కొమెర జాజి.

"మనదేశంలో ఎన్నో రకాల ఔషధ మొక్కలు అంతరించి పోతున్నాయి. ఈ ఔషధ మొక్కలు అడవి ప్రాణులకు చాలా శక్తినిస్తాయి. అలాగే మన పూర్వీకులు ఈ చెట్లపైనే ఆధారపడి స్వంత వైద్యంతో ఆరోగ్యంగా జీవించారు. భావి తరాల వారు కూడా బాగుండాలి అంటే ఇప్పుడు మనం బాధ్యతగా ఉండాలి. నా శక్తి కొద్ది నిత్యం అడవులలో తిరుగుతూ ఎన్నో ఔషధ మొక్కలను గుర్తిస్తూ, అవి అంతరించి పోకుండా నీళ్ళు పోసి కాపాడుతున్నాను. అరుదైన మొక్కల కోసం నా అన్వేషణ. ఒక్క ఔషధ మొక్కను గుర్తించి కాపాడినా జన్మ ధన్యం అయినట్లే. ఒక మనిషి ప్రాణం పోతే ఎలా మళ్ళీ తీసుకు రాలేమో, ఒక్క మొక్క అంతరించిపోతే మరలా కోట్లు ఖర్చు చేసినా దాన్ని తీసుకు రాలేము. అవి ఉన్నపుడే విలువ తెలుసుకోవాలి. తిరిగి బాగా అలసిపోయినా, సంద్ర చెట్టు నీడలో సేద తీరుతా" అంటూ తన నిత్య కార్యక్రమాలను గురించి వివరించారు కొమెర జాజి.

అలుపు అనేది లేకుండా కొండలు, కోనలు, గుట్టలు, మిట్టలు దాటుకుంటూ ప్రకృతి మాతకు తనివితీరా సేవలందిస్తూ, విశ్వవ్యాప్త కీర్తిని ఆర్జిస్తున్న 'కొమెర జాజి'ని సమాజానికి పరిచయం చేసే భాగ్యం 'పల్లెసృజన'కు కలగడం సంతోషదాయకం. వీరు ఇలాగే మరిన్ని ప్రకృతి పాఠాలతో తెలుగు రాష్ట్రాల్లోనే కాదు విశ్వ వ్యాప్తంగా ప్రకృతి ప్రేమికుల కు ప్రేరణ కావాలని కోరుకుంటోంది పల్లెసృజన కుటుంబం.

**ప్రకృతి ప్రేమికుడు కొమెర జాజి ఫోన్ నెం. : 9908411700**

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## తినుబండారాల తయారీతో మహిళలకు, యువతకు ఉపాధి

రైతు కుటుంబాలు అని అంటారు కానీ, ఆ కుటుంబాల్లో రైతు పని చేసేది కొందరు మాత్రమే మిగతా వారు ముఖ్యంగా పెద్ద, మధ్య రకం రైతుల ఇళ్ళల్లో మహిళలు పొలాలకు వెళ్లి పని చెయ్యటం చాలా అరుదు. పొలానికి వెళ్ళేవారికి అవసరమైన ఆహారం తయారు చెయ్యటం తోనే వారి పని అయిపోయి మిగతా సమయాల్లో ఇంట్లో ఖాళీగా కూర్చోలేక ఇళ్ళు సర్దుకోవటం, శుభ్రం చేయటం లాంటి ఏదో ఒక పని చేసుకుంటూ కాలం గడుపుతుంటారు. చాలా సమయం వీరందరూ ఒకచోట కూడి లోకాభిరామాయణం చెప్పుకుంటూ గడుపుతుంటారు. పంటల నూర్పిడి సమయాల్లో మాత్రమే ఎక్కువ సేపు పని చేయాల్సి ఉంటుంది. అటువంటి మహిళలు ఇంట్లో ఖాళీగా కూర్చోకుండా, వారి ద్వారా కూడా ఎంతో కొంత ఆదాయం సమకూరేలా చేసే ఉపాధి 'చిరుతిళ్ళ తయారీ'.

గ్రామాల్లోని దుకాణాలకు ఎక్కడెక్కడి నుంచో వచ్చి చెగోడీలు, వేరుశనగ చిక్కీలు, వేడి చేసి, మసాలా కలిపిన వేరుశనగ విత్తనాలు, శనగలతో తయారయ్యే గుండు పప్పు లాంటివి, అప్పాలు, చెక్కలు ఇలా రకరకాల ఆహార పదార్థాలు ప్రస్తుతం అంగళ్ళలో లభిస్తున్నాయి. వాటిని తయారు చేసేందుకు పూర్వం నైపుణ్యం గల మహిళలు మాత్రమే చేసేవారు. కానీ ప్రస్తుతం వాటిని తయారు చేసేందుకు చిన్న చిన్న యంత్రాలు తయారు చేశారు పునాది స్థాయి ఇన్నోవేటర్లు. వాటిని ఉపయోగించుకుని ఇళ్ళల్లోనే ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించడం ద్వారా ఎంతోమంది మహిళలు అదనపు ఆదాయం పొందటం ద్వారా మంచి ఉపాధి లభిస్తుంది. పైగా గ్రామాల్లో ఇలాంటివి తయారు చెయ్యటం వల్ల వాటి ఉత్పత్తి ఖర్చు కూడా చాలా తక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఆ తినుబండారాలు తయారు చేసేందుకు అవసరమైన పిండి కొరకు ఉపయోగ పడే వేరుశనగ, శనగ, పెసర, మినుము లాంటి ముడి పదార్థాలన్నీ గ్రామాల్లోనే పండిస్తారు. కాబట్టి రైతులు ఆ పంటలను ఎక్కువగా పండించి, అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలు కూడా ఎక్కువ అవుతాయి. వరి, జొన్న లాంటి పంటలే కాక చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాల విస్తీర్ణం కూడా పెరుగి రైతు మార్కెట్‌కు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఏ గ్రామంలోని ధాన్యాలు ఆ గ్రామంలోనే అదనంగా విలువను జోడించడం ద్వారా ఎక్కువ లాభాలను ఆర్జించే అవకాశాలు కూడా మెరుగవుతాయి.

ఇటువంటి తినుబండారాలను తయారు చేసేందుకు కొందరు ఇన్నోవేటర్లు తయారు చేసిన చిన్న చిన్న యంత్రాలను 'పల్లెసృజన' వెలుగులోకి తీసుకు వచ్చింది. వాటిని సమకూర్చుకోవటం ద్వారా మంచి ఉపాధితో పాటు, తీరిక సమయాలను వృధాగా గడపకుండా ఆదాయ

వనరుగా మార్చుకోవచ్చు. ఈ ఆహార పదార్థాలను తయారు చేసేందుకు అవసరమైన ముడి పదార్థాలన్నీ గ్రామాల్లో తయారయ్యేవే.

ఉదాహరణకు చెగోడీలు తయారు చేసేందుకు శనగ పిండి, బియ్యపు పిండి, కారం, ఉప్పు, నూనె అవసరం అవుతాయి. వీటిలో శనగ పిండికి అవసరమైన శనగలు, బియ్యపు పిండికి అవసరమైన వడ్లు, కారం కొరకు మిరప, బెల్లం కొరకు చెఱుకు, నూనె కొరకు వేరుశనగ, ప్రొద్దు తిరుగుడు విత్తనాలు అన్నీ రైతు పండించేవే. ప్రతి గ్రామంలో వీటిని పిండిగా తయారు చేసే పిండిమరలు ఎలాగూ ఉంటాయి. ఇక ఉప్పు విషయానికి వస్తే సముద్ర తీర గ్రామాల్లో అయితే ఉప్పు కూడా వారి గ్రామంలోనే లభిస్తుంది. మిగతా గ్రామాల వారు కేవలం ఉప్పు కొనుగోలు చేస్తే చాలు. మిగతావన్నీ తమ ఇంట్లో లేదా గ్రామంలో లభించేవే కాబట్టి వీటి తయారీలో పట్టణాల్లో చేసేవాటికన్నా తక్కువ ధరకు మార్కెటింగ్ చేసుకునే వారికి విక్రయించవచ్చు. ఇలాంటి వ్యాపారం చేసే వారు కూడా గ్రామాల్లో నాణ్యమైన తినుబండారాలు తక్కువ ధరకే లభిస్తుంటే పట్టణాల నుండి కాక, గ్రామాల నుండే కొనుగోలు చేసి, తమ సంచార వ్యాపారం ద్వారా విక్రయించి, వారు కూడా అదనపు ఆదాయాన్ని పొందే అవకాశాలు ఎక్కువ.

లేదా గ్రామంలోని యువకులు వీటిని మార్కెటింగ్ చేసుకోవటం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చు. ఈ యంత్రాలను కొనుగోలు చేసేందుకు అవసరమైన ధనాన్ని సంపాదించటానికి ఎక్కువ కష్టపడాల్సిన అవసరం లేకుండా ప్రస్తుత ప్రభుత్వాలు, మహిళా పొదుపు సంఘాలు, డ్వాక్రా గ్రూపుల ద్వారా ఈ యంత్రాలను సమకూర్చుకుని,





వాటి ఖరీదును విడతల వారీగా తిరిగి చెల్లించటం వల్ల కొనుగోలు భారం కూడా చాలా వరకు తగ్గుతుంది. పైగా ఉపాధి కొరకు గ్రామాలను వదిలి పట్టణాలకు వలస వెళ్ళాల్సిన అవసరం కూడా ఉండదు. పట్టణాలకు వెళ్ళి ఉపాధి పొందటం వల్ల తమ సంపాదన ఇంటి ఖర్చులకే అధికంగా వెచ్చించాల్సి వస్తుంది. అదే గ్రామాల్లో అయితే తక్కువ ఖర్చుతో ఉపాధి పొందవచ్చు. గ్రామాల్లో సంపద పెరిగితే దేశానికి ఎంతో మేలు జరుగుతుంది.

ఈ రంగానికి అవసరమైన యంత్రాలను గుంటూరుకు చెందిన జ్యోతుల జస్వంత్ అనే ఇన్నోవేటర్ చెగోడీలు, అప్పాలు (చెక్కలు), వేరుశనగ పప్పును వేడి చేసిన తర్వాత వాటిని పొట్టు తీసి, పలుకులు తయారు చేసే యంత్రం లాంటి వాటిని తయారు చేయటం జరిగింది. వీటిని ఏర్పాటు చేసుకోవటం ద్వారా మీ ఇంట్లోనే తినుబండారాలు తయారు చేసి, వాటిని అవసరమైన పరిమాణంలో ప్యాకింగ్ చేసి విక్రయించుకోవచ్చు. వీటికి అవసరమైన పిండిని రుబ్బేందుకు గ్రైండర్లు కూడా ఇప్పుడు దాదాపు ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్నాయి. లేదా ఒక గ్రైండరు కొనుగోలు చేసుకోవచ్చు.

ఈవిధంగా గ్రామాల్లో యువతీ యువకులు తమ తీరిక సమయంలో అదనపు ఆదాయం సమకూర్చుకుని తమ ఇంట్లోనే స్వయం ఉపాధి పొందాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ఈ యంత్రాలు కావలసిన వారు సంప్రదించండి...

**సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

## NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia.org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే **NIF టోల్ ఫ్రీ నెంబర్ : 1800 233 5555** కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**- ఎడిటర్**

National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

# జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు



**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

## ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000**లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. **7,50,000**లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. **10,000**లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెలికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 13వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

## దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

## దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2023

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : **040-40253096**) సంప్రదించండి.

# నవంబర్ - డిశంబర్ 2022 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు







నవంబర్ 3-5 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన 'కిసాన్ మేళ' ప్రదర్శనలో మన పల్లెసృజన ఇన్నోవేటర్లు మహిపాల్ చారి, షణ్ముఖరావు, వెల్లె శ్రీనివాస్, నర్సింహారావులు పాల్గొన్నారు. సుమారు 25 ఇన్నోవేషన్లను ఈ మేళాలో ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రదర్శనకు 20-25 వేల మంది రైతులు తిలకించారు. ఈ ప్రదర్శన లో మహిపాల్ చారి 30 వీడర్లు, వెల్లె శ్రీనివాస్ 500 స్టార్టర్ల రిమోట్‌లు, 500 లీటర్ల వరకు కలుపు మందు, గ్రోత్ ప్రమోటర్ ల విక్రయం జరిగింది. చివరి రోజు ప్రదర్శన నిర్వాహకులు సుగుణాకర్ రావు గారు మన ఇన్నోవేటర్లను అభినందించి, సత్కరించారు. సుభాష్, శివరామ్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.










'పల్లెసృజన' గ్రామాలకు అందిస్తున్న సేవకు గారు జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థ "సంత్ ఈశ్వర్ సేవా సంస్థ" వారి "సంత్ ఈశ్వర్ సేవా సమ్మాన్-2022" పురస్కారంతో పాటు, లక్ష రూపాయల రివార్డును స్వీకరిస్తున్న 'పల్లెసృజన కుటుంబ సభ్యులు, వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం, శ్రీమతి అరుణఆ గణేశం, జమ్మలమడక శ్రీకర్, సుభాష్ చందర్'లు




డిసెంబర్ 15న గుంటూరులో 'నాబార్డ్' సౌజన్యంతో 'ఎఫ్.పి.ఓ.'ల అవగాహన సదస్సులో 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను గురించి, వాటి పనితీరు, అవశ్యకత గురించి సుభాష్ చందర్ రైతులకు వివరించడం జరిగింది.












డిసెంబర్ 3న 'టిఎస్ఐసి' కార్యాలయంలో 'అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం' సందర్భంగా జరిగిన 'వికలాంగుల కొరకు ఇన్నోవేషన్లు' ప్రదర్శనలో పాల్గొని తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించిన 'మోధా శివకుమార్, గర్రె అశోక్'లు వికలాంగుల కోసం చేసిన ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో జయేష్ రంజన్, ఐ.ఎ.ఎస్., పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశంలు పాల్గొన్నారు.











డిసెంబర్ 3-5 తేదీలలో గుంటూరు లోని 'ల్యామ్‌ఫామ్' లో "అగ్రిటెక్-2022" ప్రదర్శనలో 18 మంది 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు 45 ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. 'నాబార్డ్, ఆంధ్రప్రదేశ్' సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను వేలాది మంది రైతులు వాటిని ఎంతో ఆసక్తితో తిలకించారు.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

– 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## ఉల్లి నాటే యంత్రం

**సమస్య – పరిష్కారం :** ఉల్లి సాగులో నారు పోసిన తర్వాత పొలంలో నాటడం అన్న చర్యతో రైతులకు వ్యవసాయ ఖర్చులు ప్రారంభ మౌతాయి. ఈ ప్రక్రియ ధనం, సమయం, శ్రమలతో కూడుకున్న పని. ఇది తట్టుకోలేకే ఉల్లిసాగు మానివేసిన రైతులు కూడా చాలామందే ఉన్నారు. ఉల్లిసాగు చేసే రైతు లకి అయ్యే ప్రధాన ఖర్చులలో ఒకటైన నారు నాటే ఖర్చు తగ్గించటానికి మహారాష్ట్రకు చెందిన 'పండరినాథ్ సర్జేరావ్ మోరే' అన్న రైతు దీనికి పరిష్కారంగా సెమీ ఆటోమేటిక్ యంత్రాన్ని కనిపెట్టాడు.

**పరికరం :** ఈ ఉల్లినారు నాటే యంత్రాన్ని ట్రాక్టరుకు అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది. ఇది కూలీల ఖర్చును, శ్రమను చాలావరకు తగ్గిస్తుంది. ఇది నారు నాటడంతో పాటు మరో మూడు పనులను కూడా చేస్తుంది. మొదటిది నారు నాటడం, రెండవది ఎరువులు వేయటం, మూడవది నీటి పారుదలకు అనువైన సాళ్ళను చేయటం. అంటే పొలం లో నారు నాటేముందు సాళ్ళు చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా ఉల్లినారు నాటవచ్చు. మనిషి ప్రమేయం అన్నది సరియైన సమయంలో, యంత్రంలో నిర్ణీత ప్రదేశంలో నారును పెట్టడమే. నాటవలసిన దూరాన్ని, లోతును కూడా సవరించుకోవచ్చు. ఒకసారి సవరించిన తర్వాత ఖచ్చితమైన దూరం, లోతులో నారు నాటడం ఈ పరికరం ప్రత్యేకత. ఈ పనితో పాటు నీరు పారే సాళ్ళను కూడా దానంతట అదే చేసేస్తుంది.




**సాంకేతిక వివరాలు :**

- 25 హార్స్‌పవర్‌లు అంతకన్నా ఎక్కువ సామర్థ్యం కల ట్రాక్టరుకు ఈ పరికరాన్ని అనుసంధానం చేయాల్సి వుంటుంది.
- ఒకటిన్నర మీటర్ల వెడల్పులో 8 వరుసల్లో ఉల్లినారు నాటుకోవచ్చు. అంటే సాళ్ళ మధ్య 18 సెం.మీ., మొక్కల మధ్య 9 సెం.మీ. దూరంలో ఉల్లినారు నాటుకోవచ్చు.
- మొక్క నాటే లోతును భూమిని బట్టి 1 సెం.మీ. నుండి కావలసినంత లోతుగా నాటుకోవచ్చు.
- సాధారణంగా కూలీలతో హెక్టారుకు 4.2 లక్షల నుండి 4.7 లక్షల మొక్కలు నాటడం జరుగుతుంది. ఈ యంత్రంతో హెక్టారుకు 5.5 లక్షల మొక్కలు నాటుకోవచ్చు.
- ఈ యంత్రం పని చేయటానికి డ్రైవర్‌తో కలిపి 5 మంది మనుషులు అవసరమౌతారు.
- ఈ యంత్రంతో రోజుకు 8 గంటల సమయంలో ఒక హెక్టారులో ఉల్లినారు నాటుకోవచ్చు.
- ఎరువు వెయ్యటానికి ప్రత్యేకమైన మనిషి అవసరం లేదు. ఎరువును ఒక ట్యాంకులో నింపడం వల్ల అవసరమైనంత ఎరువును అదే వేసుకుంటూ వెళుతుంది.
- ఈ ఎరువు వేసే డ్రమ్ముతో సహా పరికరం మొత్తం 300 నుండి 350 కిలోల వరకు బరువు వుంటుంది.

**ముఖ్యాంశాలు:**

- వరుసల మధ్య, మొక్కల మధ్య ఖచ్చితమైన దూరంలో నాటు వేయడం జరుగుతుంది.
- నారు వృధా అయ్యే అవకాశాలు, చనిపోయే అవకాశాలు కూడా చాలా తక్కువ.
- ఖచ్చితమైన దూరంలో మొక్కలు అంటాయి కనుక యంత్ర సహాయంతో నూర్పిడి చేసుకోవడానికి సులభంగా ఉంటుంది.
- ఈ యంత్రం ద్వారా ఉల్లి మాత్రమే కాక, మిరప, టమోట లాంటి ఇతర నార్లను కూడా నాటుకోవచ్చు.

**పురస్కారాలు:** ఎన్ఐఎఫ్ వారి 2009లో 5వ జాతీయ ద్వైవార్షిక పోటీల లో నాటి రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ గారు ఇతనిని సత్కరించడం జరిగింది.

## ఫుడ్ ప్రాసెసర్

**సమస్య-పరిష్కారం:** ఔషధాలకి వాడే తినగలిగిన, తినలేని పళ్ళ నుండి రసము, గుజ్జు, నూనెలు, సారము తీయటానికి, కలపటము, దంచటము, ఉడకబెట్టటము, పిండటము లాంటి అనేక ప్రక్రియలు చేయాల్సి వుంటుంది. ఔషధ మరియు ఆహార పదార్థాల తయారు చేసే సంస్థలు తమ ఉత్పత్తులను తయారు చేయటానికి దంచటానికి, కలపటానికి, ఉడకబెట్ట డానికి, ఆవిరి పెట్టి రసాలు, నూనె, గుజ్జు చేయటానికి వేర్వేరు యంత్రాలను ఏర్పాటు చేసుకుంటారు. ఇవన్నీ చేసే ఒక యంత్రం ఎక్కడా లేదు. హర్యానాకు చెందిన 'ధర్మవీర్ కాంభోజ్ అటువంటి అన్ని పనులు చేసే ఒకే యంత్రాన్ని రూపొందించాడు.

టమోట మార్కెట్ ధర ఒక్కోసారి 50 రూపాయలుంటే ఒక్కోసారి రెండు రూపాయలు కూడా పలకదు. ఇక రైతులకైతే అర్ధ రూపాయికి కిలో టమోట ధర పలికిన సందర్భాలు కూడా ఉన్నాయి. అటువంటప్పుడు వీటిని నేరుగా మార్కెట్‌కు తరలించకుండా, వాటితో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసుకుంటే ఎప్పుడూ మంచి రేటు లభించినట్లు అవుతుంది.

అలాగే ఉసిరి కూడా కొద్దిగా అటు ఇటుగా ఒకేసారి మార్కెట్‌కు రావటం వల్ల ధర చాలా దారుణంగా తగ్గిపోతూ వుంటుంది. అటువంటప్పుడు ఈ యంత్రం ఎంతో ఉపయోగకరంగా లాభదాయకంగా వుంటుంది.

**ఉదా.:** 1. ఈ యంత్రంలో టమోటాలను ఉపయోగించి, టమోట ఎసెన్స్, టమోట సాస్, టమోట గుజ్జు, టమోట సూప్ పొడి లను వేర్వేరుగా చేసుకుని ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు.

2. అదేవిధంగా ఉసిరి కాయలను ఉపయోగించి ఉసిరి ఒరుగులు, ఉసిరి జామ్, ఉసిరి నూనె, ఉసిరి ఎస్సెన్స్, ఉసిరి లడ్డులను తయారు చేసుకోవచ్చు.

**పరికరం:** తేలికగా ఎక్కడికైనా తీసుకు వెళ్ళడానికి వీలైన ఈ యంత్రం సహాయంతో అనేక రకాల పళ్ళు, కూరగాయలు, ఔషధ మొక్కలు, విత్తనాల నుండి అనేక ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు. ఇది ప్రెషర్ కుక్కర్‌లా వేడిని నియంత్రించి, తగిన వేడి కాగానే దానంతట అదే ఆగిపోయేలా చేసే సదుపాయం కూడా ఉంది. ఔషధ మొక్కల పూలు, ఆకులను ఇందులో వేసి వాటినుండి అవసరమైన వివిధ రకాల ఉత్పత్తులను సులభంగా తయారు చేసుకోవచ్చు. యంత్రం సహాయంతో అనేక రకాల పళ్ళు, కూరగాయలు, ఔషధ మొక్కలు, విత్తనాల నుండి అనేక ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు.





**సాంకేతిక వివరాలు:**

- సింగిల్ ఫేస్ కరెంటుతో పని చేస్తుంది.
- గంటకు ఒకటిన్నర యూనిట్ల కరెంటు ఖర్చవుతుంది.
- ఈ యంత్రం 125 కిలోల బరువుంటుంది.
- దీనికి చక్రాలు ఏర్పాటు చేయటం వల్ల ఎక్కడికైనా సులభంగా లాక్కెళ్ళవచ్చు.
- దీని మోటరు 1440 ఆర్‌పియంతో పని చేస్తుంది.
- రోటరు వేగం 360 ఆర్‌పియం.
- మొదటి రకం మాడల్‌లో గంటకి 50 కిలోల రసం, రెండో రకం మాడల్‌లో గంటకి 150 కిలోల రసం తీయవచ్చు.
- రెండు హీటర్లు కలిగి, దానంతట అదే వేడిని నియంత్రిస్తూ తగినవేడికి చేరగానే ఆఫ్ అవుతుంది.

**ముఖ్యాంశాలు:**

- వేడిని నియంత్రిస్తూ ఉడకబెట్టే పద్ధతి.
- పళ్ళు, పూలు, కూరగాయలు, ఔషధ దినుసులు – మొక్కలు, ఆకులు లాంటి అనేక రకాల పదార్థాలను విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసుకోవచ్చు.
- అలోవీరను ఉపయోగించి హెర్బల్ జ్యూస్, హెయిర్ జెల్, ఫేస్ వాష్, షాంపూ, హ్యాండ్ వాష్, ఎక్స్ట్రాక్ట్‌లను తయారు చేసుకోవచ్చు.
- మామిడి పళ్ళను ఉపయోగించి, జ్యూస్, చట్నీ, జామ్ మొదలైనవి తయారు చేసుకోవచ్చు.
- ఉసిరిని ఉపయోగించి పౌడర్, హెక్స్ట్రాక్ట్ (పిప్పి), జ్యూస్, హెయిర్ ఆయిల్, జామ్, తీపి పదార్థాలు, లడ్డూలు చేసుకోవచ్చు.
- తులసి, అశ్వగంధ, శతావరి ఇతర మూలికలను ఉపయోగించి రసాలు, ఎక్స్ట్రాక్ట్ చేసుకోచవచ్చు.
- గులాబి, మల్లె, ల్యావెండర్ లాంటి పూలను ఉపయోగించి సెంటు, ఎక్స్ట్రాక్ట్ చేసుకోవచ్చు.
- వ్యక్తులు, మహిళా సమూహాలు, యువత ఉపాధి కల్పనకి ఎంతో ఉపయుక్తమైనది.
- ఆటోమేటిగ్గా పని చేస్తుంది కనుక ఆరోగ్యదాయక మైనది.
- దీన్ని ఉపయోగించి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయటం వల్ల వృధా అనేదే లేకుండా ఆర్థికంగా లాభకరంగా ఉంటుంది.

**పురస్కారాలు:**

- 2009లో భారత రాష్ట్రపతి 5వ జాతీయ స్థాయి పోటీలలో ధరమ్‌వీర్‌ను సత్కరించడం జరిగింది.

**ఈ యంత్రాలు కావలసిన వారు సంప్రదించండి :**

**సుభాష్ చందర్, సెల్ : 96528 01700.**

### రైతులకు ఆశాజనకంగా మారిన 'వెంకటకృష్ణ ఇన్నోవేషన్'లు

# మిరప, మామిడి, బత్తాయి పంటల రక్షణలో అద్వితీయ విజయాలు




- వీరరాఘవ రెడ్డి

'పల్లె జ్ఞానం' సమానాంతరంగా ప్రతి గ్రామానికి చేరుకోవాలి అన్న "పల్లెసృజన" సిద్ధాంతం మనకు తెలియకుండానే ప్రతి గ్రామానికి చేరిపోతుంది అనటానికి నిదర్శనంగా నిలిచాయి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మన ఇన్నోవేటర్ 'సంగబోయిన వెంకట కృష్ణుడు' తయారు చేసిన సేంద్రియ (మూలికా) పురుగు మందులు "స్టాప్, తులసి, పర్‌ఫెక్ట్ మరియు వందర్" అనే పురుగు మందులు.

మూడు సంవత్సరాల క్రితం తెలుగు రాష్ట్రాల మిర్చి రైతులకు కంటిమీద నిద్ర లేకుండా చేసింది "జెమిని వైరస్". ఈ తెగులు సోకిన మిరప చెట్ల ఆకులు పూర్తిగా ముడుచుకు పోయి, సూర్య రశ్మి ద్వారా పత్రహరితాన్ని స్వీకరించలేని పరిస్థితికి చేరిపోయి ఎటువంటి దిగుబడి రాకుండా అంతరించి పోతాయి. ఈ వైరస్ నివారణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహా "అనవసరంగా వ్యాపారులు 'జెమిని వైరస్' నివారణకు చెప్పే ఏవేవో పురుగు మందులను పిచికారి చేసి నష్టపోకండి. ఈ వైరస్‌కు మందు లేదు. వైరస్ సోకిన చెట్లను గుర్తించిన వెంటనే వాటిని పీకివేసి, పొలానికి దూరంగా తీసుకు వెళ్ళి కాల్చివేయండి" అన్నారు. ఈ విషయం అప్పుడు దాదాపు అన్ని వార్తాపత్రికల్లో ప్రచురించ బడింది.

ఇదే విషయాన్ని 'పల్లెసృజన' మన ఇన్నోవేటర్ వెంకట కృష్ణకు అందివ్వటం జరిగింది. ఈ విషయాన్ని సవాలుగా స్వీకరించిన ఇన్నోవేటర్ దీని నివారణకు "స్టాప్" అనే పురుగు మందు తయారు చేసి ప్రయోగాత్మకంగా నిరూపించాడు. గత మూడు సంవత్సరాలుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని వేల ఎకరాల మిరప పంటను కాపాడ గలిగాయి ఈ పురుగు మందులు.

**ఇన్నోవేషన్ల సమానాంతర వ్యాప్తి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన రైతు వెంకట్ (8885245289) రైతు విజయ గాథను గతంలో పల్లెసృజన పత్రికలో ప్రచురించడం జరిగింది. కృష్ణా జిల్లా నందిగామకు చెందిన రైతులు అప్పటికే ఈ వైస్ భారిన పడి నాశనమైపోతున్న కొన్ని వందల ఎకారాల పంటను దున్నివేయటం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న 'పల్లెసృజన' పాఠకులు వారికి సలహా ఇవ్వగా మిగిలిన కొంతమంది రైతులు ఈ 'స్టాప్' మందును ప్రయోగించి, ఇక లాభం లేదు అనుకున్న పంట నుండి సాధారణంగా వచ్చే దిగుబడిని సాధించారు.

ఈ జెమిని వైరస్ మళ్ళీ ఈ సంవత్సరం విపరీతంగా విజృంభించి రైతులను కుదేలు చేస్తోంది. ఈ సంవత్సరం కూడా గుంటూరు జిల్లా 'సత్తెనపల్లి' ప్రాంత రైతు 27 ఎకరాలలో మిర్చి నాటడం జరిగింది. జెమిని వైరస్ పూర్తిగా పొలాన్ని కబళించి వేయటంతో ఈ పంట తీసివేసి, వేరే పంట వేసుకుందాము అని ఒకరోజు 20 ఎకరాల పంటను దున్నివేయటం జరిగింది. మిగతా 7 ఎకరాలు రేపు దున్నేద్దాం అనుకుని, తరువాత ఏ పంట వేద్దామా అని తన మిత్రుడైన 'అనిల్ కుమార్' అనే రైతును సలహా అడిగాడు. అప్పటికే అనిల్ తన మిర్చి పంటకు సోకిన జెమిని వైరస్‌ను 'స్టాప్' మందు ద్వారా తొలగించ వచ్చు అని తెలంగాణ లోని గద్వాల జిల్లాకు చెందిన రైతు 'రమేష్' ద్వారా తెలుసుకుని, ఆ మందును తెప్పించుకుని వాడి విజయవంతంగా తన పంటకు సోకిన తెగులును నివారించుకున్నాడు. ఇదే విషయాన్ని తన మిత్రునికి తెలియజేస్తూ..... "సరే నువ్వు దున్నేసిన 20 ఎకరాల పొలాన్ని ఏమీ చెయ్యలేము. మిగిలిన 7 ఎకరాల పంట తీసివేయాల్సిన అవసరం లేదు, నావద్దకు వస్తే నేనో మందు ఇస్తాను దాన్ని కొట్టి చూడు, ఒకే వారం లోపల నీ పంటలో తేడా గమనిస్తే మళ్ళీ ఆ మందు తెప్పించుకుని



పిచికారి చేసి, పంటను రక్షించుకో" అని సలహా ఇచ్చాడు.

మిత్రుని సలహా మేరకు అతనివద్ద 'స్టాప్' మందును తెచ్చుకుని పిచికారి చేయగా, వారం రోజుల్లోనే పంటలో ఎంతో మార్పు కనబడింది. వెంటనే మళ్ళీ అదే మందును తెప్పించుకుని పంటపై మూడుసార్లు పిచికారి చేశాడు. పంట పూర్తయ్యే సరికి ఆ పొలంలో ఎకరాకు 17 క్వింటాళ్ళ మిర్చి దిగుబడి వచ్చింది.

ఈ విషయాన్ని 'సత్తెనపల్లి' గ్రామంలో పంట పొలాలకు ట్రాక్టరు ద్వారా పిచికారి చేసి స్వయం ఉపాధి పొందుతున్న 'కోటేశ్వర రావు' (9010062383) అనే రైతు ఇతర రైతులకు చెప్పటం జరిగింది. రైతు మాటలను రైతులు తప్పక నమ్ముతారు అనటానికి ఓ ఉదాహరణగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని జిల్లాల రైతులు మరీ ముఖ్యంగా కర్నూలు, కృష్ణా, గుంటూరు, గద్వాల, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నాగర్ కర్నూలు జిల్లాల రైతులు ఈ పురుగు మందును తెప్పించుకుని, తమ పంటలను కాపాడుకున్నారు.

మరి కొన్ని రోజుల్లో మిరప కాయలు కాసి, పంట చేతికి వచ్చే సమయంలో ఈ సంవత్సరం పంట వల్ల విపరీతమైన నష్టం వచ్చింది అనుకుంటున్న వందలాది ఎకరాల పంటను కాపాడింది "స్టాప్" పురుగు మందు.

అలాగే గత సంవత్సరం నుండి మిర్చి పూత లోంచి 'నల్లటి చీమల్లాంటి' పురుగులు సోకి మిరప పంట దిగుబడి విపరీతంగా తగ్గుతోంది. ఈ పురుగులను వ్యవసాయ శాఖ వారు "త్రిప్స్" అని అంటున్నారు, కొందరు రైతులు 'పూతలో పురుగులు' అని, 'నల్లి' అని అంటున్నారు. పేరు ఏదైనా ఇదే ఇన్నోవేటర్ వెంకట కృష్ణ తయారు చేసిన "పర్‌ఫెక్ట్' అనే సేంద్రియ (మూలికా) పురుగు మందు కేవలం రెండుసార్లు పిచికారి చేస్తే పూర్తిగా నివారించ బడింది. ఈ విషయం కూడా ఉభయ తెలుగు రాష్ట్రాల రైతులకు చేరుకోవటంతో 'త్రిప్' వల్ల కూడా పంట నష్టం జరగకుండా కొన్ని వందల ఎకరాల పంటను కాపాడింది వెంకట కృష్ణ ఇన్నోవేషన్. ఈ మందులు కేవలం పంటకు సోకిన రోగాన్ని నయం చేయటమే కాదు, పొలంలో 'మిత్ర పురుగులు' విపరీతంగా తయారయ్యాయి అని గుంటూరు జిల్లా సత్తెనపల్లి ప్రాంత రైతు 'రామారావు' తన పంటలోని మిత్ర పురుగులు వున్న మిరప పంట చెట్లను పంపి తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. అంటే ఈ పురుగు మందులు వాడటం వల్ల అతని మిరప పంటను కాపాడేందుకు మిత్ర పురుగుల సైన్యం వచ్చి చేరిందన్న మాట. ఇక ఏ పురుగులు ఆ పంటను ఆశించినా అవే వాటిని తినేస్తాయి. పురుగు మందు పిచికారి చేసే పని చాలా వరకు తగ్గుతుంది.





నల్గొండ జిల్లాకు చెందిన లక్ష్మారెడ్డి అనే రైతుకు పురుగు మందులు అమ్మే దుకాణం కూడా ఉంది. అతను తన మిరప పంటపైన తనవద్ద వున్న అన్ని రకాల మందులను ప్రయోగించినా పంటలో ఎటువంటి మార్పు రాలేదు. అతని బావమరిది అయిన రామిరెడ్డి అనే రైతు వెంకటకృష్ణ పురుగు మందులను కేవలం ఒకసారి పిచికారి చేస్తేనే పంటలో చెప్పుకోతగ్గ మార్పు వచ్చిందని తను కూడా ఆ మందులు తెప్పించుకుని పిచికారి చేసి, తన పంటను కాపాడుకున్నాడు.

ఆంధ్రప్రదేశ్ లోని మదనపల్లి ప్రాంతం టమోట పంటకు ప్రసిద్ధి. ఇక్కడి నుంచి టమోట చాలా రాష్ట్రాలకు ఎగుమతి కాబడుతుంది. ఈ విషయాన్ని గ్రహించిన పల్లెసృజన నవంబర్ నెలలో మదనపల్లికి చెందిన రైతు భాస్కర రెడ్డి (9959666901)తో వెంకట కృష్ణ తయారు చేసిన మూలికా పురుగు మందుల గురించి తెలుపగా, అతను 'తులసి, పర్‌ఫెక్ట్' అనే మందులు తెప్పించుకుని తన టమోట పంటపై ప్రయోగించి చూశాడు. ఈ మందులు ఉపయోగించిన తర్వాత తన పంటను మార్కెట్‌కు తరలించగా, అక్కడ మార్కెట్‌లో ఉన్న అందరు రైతుల టమోట కంటే తన పంట ప్రత్యేకమైన ఆకర్షణ కలిగి ఉండటం గమనించాడు. అక్కడి వ్యాపారులు కూడా ఈ విషయాన్ని గ్రహించి, భాస్కర రెడ్డి టమోట పంటకు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేయటం జరిగింది. ఈ విషయాన్ని భాస్కర రెడ్డి చెపుతూ వచ్చే సంవత్సరం నుండి తాను ఇతర రసాయన మందుల వైపు చూడకుండా కేవలం పల్లెసృజన వారి మూలికా పురుగు మందులతోనే పంట పండిస్తానని, కేవలం ఒక్కసారి ఉపయోగించినందుకే పంటలో అంతటి తేడా కనిపించింది, ఇక రసాయన మందులు ఉపయోగించకుండా కేవలం ఈ మందులనే ఉపయోగించటం వల్ల వినియోగదారులకు ఆరోగ్యకరమైన పండ్లను అందించటంతో పాటు, తనకు అధిక దిగుబడి, అధిక ఆదాయం సమకూరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

తెలంగాణ రాష్ట్రంలోని హన్మకొండ జిల్లాకు చెందిన రైతు 'రాజిరెడ్డి'కి 20 ఎకరాల్లో మామిడి తోట ఉంది. అతను గత 9 సంవత్సరాలుగా తను ఎన్ని పురుగు మందులు వినియోగించినా, ఆశించిన పంట రావటం లేదని విసుగు చెంది ఈ సంవత్సరం 'పల్లెసృజన' వారి మందులు ఉపయోగించి చూద్దాం అప్పుడు కూడా పంట రాలేదంటే ఈ తోట తీసివేయటం మంచిది అనుకుని వెంకట కృష్ణ తయారు చేసిన 'తులసి' అనే మందును ముందుగా తెప్పించుకుని

పిచికారి చేశాడు. రాజిరెడ్డి గత 9 సంవత్సరాల్లో ఏనాడూ చూడనంత విపరీతంగా మామిడి చెట్లకు పూత రావటం చూసి తానే ఆశ్చర్య పోయాడు. ఆ పూత ఎంత విపరీతంగా వచ్చిందంటే, సాధారణంగా చెట్టుకు అప్పుడప్పుడూ క్రింద వున్న కొమ్మలను నరికేస్తూ ఉంటారు రైతులు. అలా కొమ్మను నరికిన చోట, చెట్టు మొదలుకు ఎక్కడైనా దెబ్బ తగిలిన చోట కూడా విపరీతంగా వచ్చిన పూత చూసి ఆశ్చర్యపోయాడు. ఇవి పండ్లుగా మారితే 'పనస' చెట్ల మాదిరి మామిడి చెట్టు బుడాలకు కూడా పండ్లు కాస్తాయేమో అనిపిస్తోందని అంటున్నాడు. ఈ పూతను ఎలాగైనా కాపాడుకోవాలి. ఇందులో కేవలం ఒక్క శాతం పండ్లుగా మారినా అనూహ్యమైన దిగుబడి వస్తుందని ఇప్పుడు 'పర్‌ఫెక్ట్' అనే పురుగు మందును తెప్పించుకుని పిచికారి చేశాడు. పర్‌ఫెక్ట్ అనే మందు పూత పిందె రాలకుండా కాపాడుతుంది.

రైతులు తమ అన్ని పంటలపై ఈ సేంద్రియ పురుగు మందులు ఉపయోగించటం వల్ల పంటలకు వచ్చిన చీడ పీడల నివారణ జరగటమే కాకుండా, పొలంలోకి విపరీతంగా మిత్ర పురుగులైన అక్షింతల పురుగులు, పంటలకు హాని చేసే పురుగులను తినే నులి పురుగులు, బదనిక అనే పురుగు, సాలె పురుగులు, తేనెటీగలు లాంటి ఎన్నో పురుగులు విపరీతంగా ఆకర్షించ బడతాయి. అంటే రైతుల పంట పొలాల్లోకి మిత్ర పురుగులనే సైన్యం కాపలాగా ఉంటుందన్న మాట. అలా జరిగినప్పుడు రైతు అనవసరంగా రసాయన మందులు పిచికారి చేస్తే అవి చనిపోయే ప్రమాదం ఉంది కాబట్టి రైతు తనకు తెలియకుండా రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించే అవకాశముంది. ఈ విధంగా జరగటం వల్ల సమాజానికి కూడా రసాయన పురుగు మందుల అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు కూడా లభిస్తాయి. తద్వారా రైతు సమాజం ఆరోగ్యాన్ని కూడా కాపాడినట్లవుతుంది.

ఈ విషయాలను తెలుసుకున్న అనంతపురం జిల్లాకు చెందిన బత్తాయి తోటల రైతులు పల్లెసృజనను సంప్రదించి, తమ తోటలకు కూడా ఇవే మందులు తెప్పించుకుని ఉపయోగిస్తున్నారు. ఈ సేంద్రియ పురుగు మందులు బత్తాయి తోటలను నష్టపరిచే పండాకు తెగులు, ఆకు చుట్టు పురుగులు, పండ్లపై వచ్చే మంగు తెగుళ్ళను సమర్థవంతంగా నివారించటమే కాక, పండు నాణ్యత, రుచిలో కూడా గణనీయమైన మార్పును తీసుకు వస్తాయి. పండు నిలువ శాతాన్ని పెంచుతాయి.



'పల్లెసృజన' కోరుకుంటున్నది కూడా ఇదే. జ్ఞానం ప్రతి పల్లెకూ విస్తరించాలి అని. ఎటువంటి వ్యాపార ప్రకటనలు లేకుండా కేవలం వాట్సాప్ గ్రూపులు, రైతు నోటి నుండి మరో రైతు చెవికి చేరటం ద్వారానే మొత్తం ఈ 3–4 సంవత్సరాల్లో వేలాది ఎకరాల్లో ఎన్నో రకాల పంటలను కాపాడ గలగడం ''రైతు విజయం''గా భావిస్తోంది 'పల్లెసృజన'.

పురుగు మందుల కొరకు సంప్రదించండి....

**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 7989038186 / 8125799904**

**సుభాష్ చందర్, ఫోన్ : 96528 01700**

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేడు సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరుతుందని భావిస్తున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

**Loksarvani**
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

**24401**

### రసంపీల్చే పురుగు, గొంగళి పురుగు నివారణకు :

ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి పంటలకైనా నష్టం చేసేవి రసంపీల్చే పురుగులు, గొంగళి పురుగులు. వీటి నివారణకి రకరకాల పద్ధతులున్నా, గుజరాత్ రాష్ట్రంలోని జాంనగర్ జిల్లా కళ్యాణ్‌పూర్ తాలూకాకి చెందిన 'పర్బత్ భాయ్ హాజీభాయ్ భాటియా' పూర్తి సేంద్రియ పద్ధతిలో చాలా విజయవంతంగా ప్రయోగించి సఫలం పొందుతున్నాడు. ఆయన పద్ధతి ప్రకారం ఒక కిలో వేప ఆకులు, కిలో సీతాఫలం ఆకులు, కిలో ఉమ్మెత్త ఆకులు, కిలో కలబంద ఆకులకి 250 గ్రా. ఉల్లి, 250 గ్రా. ఎండుమిర్చి, 250 గ్రా. వెల్లుల్లి, 200 గ్రా. పొగాకు పొడిల మిశ్రమానికి 10 లీటర్ల నీటిని చేర్చి మూతపెట్టిన బాండాలో సన్నని సెగపై మరిగించాలి. బాగా మరిగిన తర్వాత మిశ్రమాన్ని చల్లార్చి వడకట్టాలి. ఈ వడకట్టిన మిశ్రమంలో 2 లీటర్ల గోమూత్రం, 250 గ్రా. బెల్లం చేర్చి బాగా కలియతిప్పాలి. ఈ మిశ్రమాన్ని పంటపై పిచికారి చేస్తే రసంపీల్చే పురుగులు, గొంగళి పురుగులను సమర్థవంతంగా నిర్మూలించవచ్చు.

**24402**

### ధాన్యం నిలువ చేయటానికి ఊదుగ ఆకులు

ధాన్యాన్ని పండించటం ఒకయెత్తయితే దాన్ని నిలువ చేయటం మరోయెత్తు. రోజుకో కొత్త పద్ధతి వస్తున్నా, తాను చాలాకాలం నుంచి ఏ ఇబ్బందీ లేకుండా ఓక పద్ధతి వాడుతున్నాను అని చెపుతున్నారు వడోద్రా జిల్లా, ఛోటా ఉదేపూర్ తాలూకా నివాసి 'వసంత్ భాయ్ బి. ధనక్'. తన పద్ధతిని వివరిస్తూ జొన్న, రాగులు, సజ్జలు మొదలైన ధాన్యాలను సాధారణంగా పొడగాటి వెదురు బుట్టలు (గుమ్మిలు) లో నిలువ చేస్తారని, ముందుగా వెదురు బుట్టను ఆవుపేడతో అలుకుతానని, తర్వాత ఒక వరుస ఊదుగ ఆకులు (ఎండినవి), తర్వాత దాన్యము, తర్వాత మరలా ఆకులు, తర్వాత ధాన్యము ఇలా బుట్ట నిండేవరకు పోసి, పైన ఆకులు వేసి మూత పెట్టి గాలి చొరబడకుండా ఆవుపేడతో కప్పెయ్యాలి. తాను ఇరవై కిలోల ధాన్యం నిలువ చేయటానికి ఒక కిలో ఆకులు వాడుతున్నానని, ధాన్యం తీసినప్పుడల్లా మళ్ళీ జాగ్రత్తగా గాలి చొరకుండా ఆవుపేడతో కప్పి పెడతానని ఈ పద్ధతి చాలా చౌకగా వుండటమే కాక, ఎలాంటి పురుగులు ధాన్యాన్ని సోకవని, ఈ పద్ధతిని తాను ఎన్నో సంవత్సరాల నుంచి వాడుతున్నానని చెపుతున్నారు.

**24403**

### పత్తి, కూరగాయల పంటలలో చీడల నివారణకు

పత్తి, ఏ కూరగాయల పంటలలోనైనా చీడ పట్టకుండా తాను చాలా సులువైన పద్ధతిని వాడుతున్నానని గుజరాత్ రాష్ట్రంలోని జూనాఘడ్ జిల్లా, మాల్యా తాలూకా నివాసి గీతాబెన్ కాంతిలాల్ సోలంకి చెప్తున్నారు. ఈమె తేలుకొండి కాయ ఆకులు, వేర్లను సేకరించి, నీడలో బాగా ఆరనిచ్చి, వాటిని పొడిచేసి, నీటిలో కలిపి ప్రతి పంట, కూరగాయల పంటలపై పిచికారి చేస్తుందట. తాను 10 మీటర్ల చదరం గల పంటకి 500 గ్రా. పొడిని వాడుతానని చెపుతున్నారు. ఈ పద్ధతి వాడటం ప్రారంభించిన తర్వాత తన పత్తి, కూరగాయల పంటలలో చీడ పట్టడం బాగా తగ్గిపోయిందని చెపుతున్నారీమె.



**24404**

### మిరప పంట అధికోత్పత్తి, చీడ నివారణకు :

గుజరాత్ రాష్ట్రం, బనస్కాంతా జిల్లా, దనేరా తాలూకాకు చెందిన అంబా భాయ్ ధరమ్‌భాయ్ పటేల్ తను వాడే పద్ధతి దేశంలో మిరప పండించే అందరు రైతులకు ఉపయోగ పడుతుందని గట్టిగా చెపుతున్నారు. తన పద్ధతిని వివరిస్తూ ఆయన "ఒక కిలో వేపాకులు, ఒక కిలో జిల్లేడు ఆకులు, ఒక కిలో జెముడు ఆకులు తీసుకొని నీరు కలిపి ఈ మిశ్రమంలో కొంచెం ఉప్పును కలిపి 4 నుండి 5 రోజులపాటు ఒక పాత్రలో వేసి మూతపెట్టి మురగ బెట్టారు. తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, మిరప పంటపై పిచికారి చేస్తే పంట ఆరోగ్యంగా ఉండటమే కాక, అధిక దిగుబడిని ఇస్తుంది అని చెపుతున్నారు.

**24405**

### పొలంలో ఎలుకల నివారణకు మూలికలతో మందు

పొలాల్లో ప్రత్యేకించి ధాన్యం పండించే పొలాల్లో ఎలుకల బెడద ఎక్కువ. అవి పంటకు చాలా నష్టం కలుగజేస్తుంటాయి. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ జిల్లా, ఉమర్‌పాడ తాలూకా నివాసి 'కన్సర్‌భాయ్



గజలాభాయ్ చౌదరి' తాను ఎలుకల బాధనుండి తప్పించుకోవటానికి మూలికలు వాడుతానని చెపుతూ తనపద్ధతిని ఈవిధంగా వివరించారు. ఆయన గచ్చకాయ గింజలు, ఇప్ప విత్తనాలు, జొన్నలు కలిపి పొడిచేసి, తగినంత నీటిని చేర్చి చిన్న చిన్న గులికలుగా తయారు చేస్తానని, ఈ గుళికలను ఎలుక బొర్రలలో ఉంచుతానని, ఈ గులికల వాసన, రుచి నచ్చక ఎలుకలు పారిపోతాయని, తానీ పద్ధతి చాలా సంవత్సరాల నుంచి వాడుతున్నానని చెపుతున్నారు.

**24407**

**పశువులలో గాయాలకు లేపనం:**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన సబర్‌కాంతా జిల్లా, సాతన్‌పూర్ ఇదర్ తాలూకా నివాసి 'చౌదరీ మంగూబెన్ బాబా భాయ్' పశువులకి దెబ్బలు తాకితే త్వరగా నయం కావని, దానికి కారణం గాయాలపై ఈగలు చేరి, పుండును ఇంకా రదం చేయటం వల్లనేనని, దీనికి విరుగుడుగా తానొక పద్ధతిని అవలంభిస్తున్నానని చెప్తున్నారు. ఈమె పద్ధతి ప్రకారం తక్కలి ఆకుల రసాన్ని తీసి మెత్తటి దూదితో ఆ పుండుపైన అద్దటం వలన పుండు త్వరగా నయమౌతుందని, తక్కలి ఆకులని దాణాతో కలిపి రెండు మూడు రోజులపాటు తినిపిస్తే ఫలితం ఇంకా త్వరగా వస్తుందని తాను కనుగొన్నానని చెప్తున్నారు.

**24414**

**మొక్కలపై చీడ నివారణకు ఒక మతగురువు కనుగొన్న చికిత్స:**


మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంపాల్ సమీపంలోని లాంజింగ్ ప్రాంత నివాసి 'లాంగ్‌జామ్ లోకేంద్రో సింగ్' క్రైస్తవ మతగురువు. డిగ్రీ వరకు చదివిన ఈయన మత ప్రవక్తగానే కాక, వ్యవసాయం కూడా చేస్తూవుంటారు. తన పొలంలో మొక్కలకు పట్టిన చీడల నివారణకు తానే ఒక సేంద్రియ పద్ధతిని కనుగొన్నారు. పోకబంతి ఆకులను, పూలను నీడపట్టున ఆరబెట్టి పొడిచేసి ఉంచుకుంటాడు. రెండు లీటర్ల నీళ్లలో 500 గ్రా. ఈ పొడిని కలిపి 50 గ్రా. ఉతికే సోడాను కలిపి రెండు గంటల తర్వాత పొలంలో పిచికారి చేస్తారు. ఈ కలిపిన మిశ్రమం 10 చ.మీ. ప్రాంతానికి సరిపోతుంది. ఈవిధంగా రెండు మూడు రోజులకోసారి పూత పూసే ముందు లేదా కాపు కోతకు ముందు పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెప్తున్నారీయన. ఇది పేనుబంక నివారణకు సమర్ధవంతంగా పనిచేస్తుంది అంటారాయన.

**24416**

**ధాన్యం నిలువకి బిరియాని ఆకు:**

బీహార్ రాష్ట్రంలోని బక్సద్ జిల్లా, మొహల్లా సోనయ్‌పట్టి ప్రాంత నివాసి 'మురళీ శరణ్ సింఘు' ధాన్యం నిలువకి బిర్యాని ఆకు వాడుతానని చెప్తున్నారు. పప్పులు, ధాన్యం నిలువ చేయటానికి ముందు వెదురు గుమ్మిలో క్రింద బిర్యాని ఆకులు వేసి, వాటిపై ధాన్యాన్ని పోసి మళ్ళీ ఒకసారి మధ్యలో ఆకులు వేసి, ఆపైన మళ్ళీ ధాన్యం వేసి, పై భాగంలో మళ్ళీ బిర్యాని ఆకులు పరిచి నిలువ చేస్తే ధాన్యాన్ని 7 నుండి 8 నెలల వరకు సురక్షితంగా కాపాడుకోవచ్చు అని చెపుతున్నారీయన. ఈ పద్ధతిలో ప్రత్యేకత ఏమిటంటే బిర్యాని ఆకు (తేజ్ పత్తా)ని వంటలో వాడిన తర్వాత కూడా శుభ్రం చేసి ఎండబెట్టి ధాన్యం నిలువ చేయటానికి వాడుకోవచ్చు.

చాలా రకాల పంటలలో ఆకుముడత తెగులు పంటకు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది. ఈ తెగులు ప్రత్యేకించి, చలికాలం, మేఘావృతమైనప్పుడు ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు గుజరాత్



రాష్ట్రం, సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, దేవీపూర్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ జయరామ్ భాయ్ లఖాత్రియా' గన్నేరు చెట్లను ఆశ్రయిస్తాడు. ఇది పూర్తి సేంద్రియ పద్ధతే అని చెపుతాడాయన. ఆయన రెండు కిలోల గన్నేరు ఆకులను తీసుకుని, మెత్తగా నూరి ముద్దచేసి, ఆ ముద్దను 5 లీటర్ల నీటిలో కలిపి ఐదారు రోజులపాటు మురగబెడ్తాడు. తర్వాత ఈ ద్రావకాన్ని కొద్దిసేపు మరిగించి, 150 మి.లీ. ఈ మరిగించిన ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి పంటపై ఆకులు క్రింద భాగానికి తగిలేలా పిచికారి చేస్తాడు. దీంతో ఆకుముడత తెగులు సమర్ధవంతంగా అరికట్ట బడుతుంది అంటారు. ఈ ద్రావకాన్ని మురగబెట్టేటపుడు గాలి పారకుండా మూత పెడితే త్వరగా మురిగిపోతుందట. ఈద్రావకం బూజు తెగులుకు కూడా బాగా పనిచేస్తుంది అంటారాయన.

**27102**

**రసాయనాలు వాడకుండా గొర్రెలకు సోకే పేలు, పిరుదలను తీసేసే పద్ధతి:**

గొర్రెలకి పేలు, పిరుదులు సోకడం సహజం. వాటిని తీసివేయటానికి నానా రకాల క్రిమి సంహారక మందులు వాడటంకన్నా, సులభమైన పద్ధతి ఒకటుందని అంటున్నారు 'కుర్దా' జిల్లాకు చెందిన 'చిత్రసేన్ మంగరాజ్' అనే రైతు.



అతనివద్ద 65 గొర్రెలు ఉన్నాయి. వాటికి పట్టిన పేలు, పిరుదులను తొలకించేందుకు రాత్రిపూట గొర్రెల షెడ్డులో నాలుగైదు బాతులను గొర్రెలతో పాటు వదిలేస్తే అవి రాత్రంగా గొర్రెలను పట్టి పీడిస్తున్న పేలు, పిరుదులను చంపుకుని తింటాయి. రసాయనాలకన్నా అలాంటి సహజ శత్రువులను ఏర్పాటు చేయటం చాలా మంచిది అంటాడు. బాతులు అందుబాటులో లేనివారు కోళ్ళను వదిలినా అవి కూడా అదే పని చేస్తాయి. దీనివల్ల ఎటువంటి ఖర్చు లేదు. పైగా ఇలా చేయటానికి కోళ్ళను, బాతులను పెంచుకోవటం వల్ల అదనపు ఆదాయం కూడా సమకూరుతుంది.

**27103**

**ఎద్దుల మెడపై నొప్పి నివారణకు వైద్యం:**

సాధారణంగా ఎద్దులు పని చేస్తున్నపుడు మెడపైనున్న కాడిమాను సరియైనది కాకపోయినా, దాన్ని బిగుతుగా కట్టకపోయినా ఎద్దు మెడపై పుండు ఏర్పడటం లేదా, నొప్పి రావటం జరుగుతూ ఉంటుంది. అవి చెప్పలేవు కాని, రైతు దాని మెడపైన నొప్పిని సులభంగా గుర్తించ గలడు. ఆ నొప్పిని భరించలేక ఎద్దు డీలా పడిపోయి, నీరసించి పోతుంది. ఒడిస్సా రాష్ట్రంలోని 'నౌపాడ' జిల్లా 'హరిపూర్' గ్రామానికి చెందిన 'జగన్నాథ్ మాజీ' అనే రైతు ఇటువంటి పరిస్థితుల్లో పశువుల మెడనొప్పి నివారణకు తాను స్వంతంగా ప్రయోగిస్తున్న వైద్య విధానం గురించి తెలియజేస్తున్నారు.

బూషిక చెట్టు బెరడు 200 గ్రా. తీసుకుని, కొద్దిగా నీరు కలిపి లేపనంగా నూరాలి. ఆ లేపనాన్ని కొద్దిగా వేడి చేసి, ఎద్దు మెడపై సాయంత్రం పూట మూడు రోజులపాటు బాగా పట్టించినట్లయితే మెడనొప్పి తగ్గిపోతుంది అంటున్నారు. తాము గత కొన్నేళ్ళుగా ఈ వైద్యాన్ని ఎన్నో పశువులపై ప్రయోగించానని, మంచి ఫలితాలు వచ్చాయని అంటున్నారు.



**27104**

**పశువుల గాయాలకు మందు:**

తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన ఇదయ్‌పాడు తాలూకా, మోలపాపిరాయ్ గ్రామానికి చెందిన 45 సంవత్సరాల పార్వతి అనే మహిళ తాను కేవలం 7వ తరగతి వరకు చదువుకున్నా, పశు వైద్యానికి పనికివచ్చే అనేక సాంప్రదాయ వైద్య పద్ధతులను నేర్చుకుంది. అందులో ఒకటి తాను తరచుగా వాడేది పశువుల గాయాలకు వాడే మందు. ఆమె గుప్పెడు ఉసిరిచెట్టు ఆకులను తీసుకుని మెత్తగా నూరి,



పశువుకు గాయమైన చోట రెండు మూడు రోజులపాటు వరుసగా లేపనంలా పూస్తే మంచి గుణం కనిపిస్తుందని చెపుతోంది.

**27108**

**పశువులు మబ్బుగా ఉండి, ఆహారం తీసుకోక పోయినపుడు:**

తమిళనాడులోని సేలం జిల్లా, మెట్టూర్ తాలూకా, పుదుర్కడ్ గ్రామానికి చెందిన 'కుప్పుస్వామి అనే రైతు తనవద్ద వున్న పశువులకి విరోచనాలను (పుర్రు పూసుకోవడం) అరికట్టడానికి తానే స్వయంగా తయారు చేసుకున్న ఒక మిశ్రమాన్ని వాడుతూ ఉంటాడు. దీన్ని తయారు చేయటానికి అతను గురివింద చెట్టు ఆకులు కొన్నింటిని, నీలజమ్మి ఆకులు కొన్నింటిని, కొన్ని మిరియాలు, వెల్లుల్లి, బెంగుళూరు మిర్చి (కాప్సికం)లను తీసుకుని వాటన్నిటిని కలిపి మెత్తగా నూరి అందులో కొద్దిగా వేడినీరు కలిపి పశువు ముక్కులో రెండుమూడు చుక్కలు వేస్తాడు. దీంతో పశువుకు ఆకలి పెరిగి, మేత బాగా మేసి, చురుగ్గా తయారవుతుంది.

**పశువులలో పొట్ట ఉబ్బరంగా ఉన్నపుడు...**

అతను కొద్దిగా ఇంగువ, వెల్లుల్లి, మిరియాలను తీసుకుని, వాటన్నింటిని మెత్తగా నూరి, ముద్దగా చేసి పశువుచేత తినిపిస్తాడు. కొద్దిసేపటికే ఉబ్బరం తగ్గి పశువుకు స్వాంతన చేకూరుతుంది.

పశువులలో డయేరియా (పుర్రు పోసుకోవడం) నివారణకు ....

ఈ వ్యాధి నివారణకు ఉల్లి కోడులను, పెరుగుతో కలిపి మెత్తగా నూరి పశువుచేత తినిపిస్తే మంచి ఫలితం ఉంటుంది అంటాడు కుప్పుస్వామి. తాను ఈ పద్ధతులను చాలా సంవత్సరాలుగా వాడుతున్నానని, మంచి ఫలితాలు ఉంటాయని అంటున్నాడు. ●






పునాది స్థాయి ఇన్నోవేటర్‌గా ఉండి సమాజ సేవకునిగా మారి, పర్యావరణ వేత్తగా, పరిణితి పొంది 2020లో భారత రాష్ట్రపతి శ్రీ రామ్‌నాథ్ కోవింద్ గారి చేతులమీదుగా 'పద్మశ్రీ' పురస్కారం పొందిన చాలా మంది ఇన్నోవేటర్‌లకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు సుందరం వర్మ గారు.

72 సంవత్సరాల సుందరం వర్మ రాజస్థాన్ లోని సికర్ జిల్లాలో గల దాంతా (రాంఘర్) గ్రామంలో జన్మించారు. 1972లో డైరీ ఫార్మింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తరువాత ఖాదీ గ్రామోద్యోగ్ సంస్థతో సంబంధం పెట్టుకొని తన కుటుంబానికి చెందిన 17 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసేవాడు. తన పొలానికి కంచెంగా వేసుకొన్న మొక్కలు తరచూ నీరు లేక (ఎడారి ప్రాంతం కనుక) చనిపోతుండటంతో తక్కువ నీటితో మొక్కలను బ్రతికించుకోవటం ఎలా? అని అనేక సంవత్సరాలు స్వయంగా క్షేత్ర స్థాయి (తన స్వంత పొలంలో) ప్రయోగాలు చేసి – కలుపు మొక్కల వలన భూమిలోనీ నీరు పైకి ఎగబాకి ఆవిరైపోయి అసలు మొక్క కూడా చనిపోతోందని గ్రహించాడు. ఆ దిశగా అనేక ప్రయోగాలు చేసి భూమిలో "అనవసరంగా నీరు ఒక చోటినుంచి యింకొకచోటికి పాకి అసలైన మొక్కకి నీరు లేకుండా చేస్తుంది" అని గ్రహించి, ఈవిధంగా నీరు వృథా అవుతుందని నిర్ధారణకి వచ్చి 1985 వరకు తన ప్రయోగాలు కొనసాగించి 'డ్రైలాండ్ అగ్రో ఫారెస్ట్రీ' అనే పద్ధతిని రూపొందించారు. తాను అవలంభించిన పద్ధతిలో ఆరు దశలు ఉంటాయని చెప్పారాయన.

1. మొత్తం పొలం వాలుగా ఉండకుండా చదును చేసుకోవాలి.

2. వర్షం పడిన 5–6 రోజులలో మొత్తం పొలం ఒక అడుగు లోతుగా దున్నాలి. తరువాత ఆ పొలంలో మొత్తం కలుపు మొక్కలు పనికి రాని వేళ్ళు, ఆకులు ఏరివెయ్యాలి. అంటే నీరు ఏ అవరోధమూ లేకుండా భూమిలోకి ఇంకిపోవాలన్నమాట.

3. వర్షాలు పడటం ఆగిపోయిన తర్వాత మొత్తం పొలం లోతుగా దున్నాలి. క్రింది మట్టి పైకి వచ్చినప్పుడు అది లోపల వున్న తేమని ఎండిపోకుండా (ఆవిరై పోకుండా) కాపాడుతుంది.

4. రెండవసారి దున్నటం అయిపోయిన కొద్ది రోజులకి ఒక అడుగు లోతుకి 5–6 అంగుళాల వెడల్పుతో గుంటలు తవ్వాలి.

5. ఇప్పుడు నాటవలసిన మొక్కలు 20 సెంటీమీటర్ల లోతుకి ఉండేలా నాటి, వాటిని తడి మట్టితో కప్పాలి. దీనితో మొక్కకు మొదటి రోజుల్లో తడి తగులుతుంది.

6. చివరగా ఒక్కో మొక్కకి 1 లీటరు మాత్రమే నీరు పొయ్యాలి. తరువాత పొయ్యనవసరం లేదు.

ఈ పద్ధతిలో ఆయన షెకావత్ అనే వర్షాధార ప్రాంతంలో 50 వేల చెట్లు నాటారు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే వాటికి కేవలం జీవిత కాలంలో ఒక్క లీటరు నీరు సరిపోతుంది. వర్షాభావం ఉన్న ప్రాంతాల్లో నీరు తక్కువగా ఉండే ఎడారి ప్రాంతంలో ఈ పద్ధతి రైతులకి చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

ఈయనకి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు మొదటి నుండి కూడా సహకరించారు, సహకరిస్తునే ఉన్నారు. ఈయన ఖాదీ గ్రామోద్యోగ్ వారి సహకారం తీసుకుంటూనే వారి సలహాపై ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్, న్యూ ఢిల్లీలో డ్రైలాండ్ ఫార్మింగ్ పై ప్రత్యేక శిక్షణ పొందారు. అక్కడ తాను పొందిన శిక్షణ తనకి ఈ విధమైన తక్కువ నీటితో, కేవలం ఒక్క లీటరు నీటితోనే మొక్కలను పెంచే పద్ధతి కనుగొని ఎడారిని పచ్చదనంతో నింపాలన్న ఉద్యమానికి నాంది పలకటానికి కారణమయ్యిందంటారు ఈయన.

ఈయన కనిపెట్టిన ఈ ఒక్క లీటరుతో చెట్లను పెంచే పద్ధతి



వలన నీటిని ఆదా చెయ్యటమే కాక, నీటి వసతి లేక కరువు ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా కురిసే ప్రాంతాలను చిట్టడవి ప్రాంతాలుగా మార్చవచ్చు. అలా ఆ భూమిని సద్వినియోగం చేసుకొని ఆదాయ మార్గాలు వెతుక్కొనడానికి, ఆ ప్రాంతాల రైతుల జీవనోపాధి అవకాశం మెరుగు పరచుకోవటానికి సహకరించిందని నిరూపితమైంది.

స్వతహాగా రైతే అయిన సుందరం వర్మ ముందునుంచి కూడా కొత్త రకంగా వ్యవసాయం చెయ్యాలనుకొని ఆ దిశగా ప్రయోగాలు చేస్తుండేవాడు. ఈ విధంగా ప్రయోగాలు చేస్తూనే ఆయన ఎస్.ఆర్.-1, రకం కాబూలి శనగను రూపొందించటం జరిగింది. ఈ గింజలు పెద్దవిగా కాక, చిన్నవీ కాక, మధ్యస్థంగా ఉండి చీడ పీడలను తట్టుకొని చాలా అధిక దిగుబడినిస్తుంది. ఈ రకాన్ని ఆయన ఎన్ఐఎఫ్ వారి సహకారం తో 'ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీ & ఫార్మర్ రైట్స్ అథారిటీ (పిపివి & ఎఫ్ఆర్ఎ) వారివద్ద రిజిష్టరు చెయటం జరిగింది. ఇది ఆహార ధాన్యాలకి సంబంధించిన పేటెంట్ లాంటిది.

ఈ రకం కేవలం 60-65 రోజుల్లో కాపుకొచ్చి, మార్కెట్లో లభించే రకాలకన్న మంచి రంగు, రుచి కలిగి, ఎక్కువ తూకం వస్తాయి. శనగ పంటలకొచ్చే అనేక రకాల చీడ పీడలను తట్టుకొని ఏపుగా పెరిగి ఎక్కువ బుడ్డలు (కాయలు) పండుతాయి. ఈయన రూపొందించిన ఈ రకాన్ని ఎన్నో సంవత్సరాలుగా పండిస్తున్నారు. అంతేగాక స్థానికంగా ఉండే రైతులు తాము పండిస్తున్న పంటల రకాలని అభివృద్ధి చెయ్య దలచుకొన్న సందర్భాలలో వారికి సముచిత సలహాలినూ, ప్రోత్సహిస్తున్నారు. ఆ పరిసర ప్రాంత రైతులకి వ్యవసాయంపై ఎటువంటి సందేహాలు, సమస్యలు వచ్చినా తగ్గ సలహాలిస్తూ, సహాయ పడుతుంటారు ఈయన.

ఇదే కాక ఈయన యస్.ఆర్.-23 పేరుతో గోరు చిక్కుడు (గోగరకాయ/ చౌలకాయ) రకాన్ని కూడా రూపొందించటం జరిగింది. దానిని ఉష్ణ ప్రదేశాలతో పాటు వర్షపాతం తక్కువ ఉన్న ప్రదేశాలలోని రైతులు నిర్భయంగా పండించుకోవచ్చు. అదీ కాక ఇది ఏ రకమైన భూమిలోనైనా పండుతుంది. చివరికి ఇసుక నేలల (ఎడారి ప్రాంతం) లో కూడా పండించుకోవచ్చు.

తన గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత చాలా మంది వ్యక్తులు, సంస్థలు ఈయనకి ఉద్యోగం ఇస్తామని ముందుకి వచ్చినా కాదని తనకిష్టమైన ఉష్ణమండలంలోని పంటల అభివృద్ధికై తన జీవితాన్ని అంకితం చేస్తూ తన పొలాన్నే తన ప్రయోగశాలగా చేసుకొని పరిశోధనలు చేస్తూ అనేక మంది రైతులకి ప్రాంతీయ, రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు వచ్చేలా పాటుపడ్డారు. తను సహాయం చేసిన





రైతులు, తనకన్నా ముందు 'పద్మశ్రీ' పురస్కారాలు, జాతీయ స్థాయి గుర్తింపు, భారత రాష్ట్రపతి చేతుల మీదుగా తీసుకొన్నా పరమానంద భరితుడై తన పనిని ద్విగుణీకృత ఉత్సాహంతో కొనసాగించారు.

సుదరం వర్మ గారు జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం వారి సైన్స్ & టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్.ఐ.ఎఫ్. మార్చి 2000 సంవత్సరంలో ప్రారంభించిన నాటి నుండి దీనితో సంబంధాలు కలిగిన వ్యక్తి. ఎన్.ఐ.ఎఫ్.తో కలిసి పని చేస్తూనే క్రమంగా దాని సర్వసభ్య సమావేశ సభ్యునిగా మారిపోయాడు. దాదాపు 15 వేల మంది గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లను వెతికి ఎన్.ఐ.ఎఫ్.కు పరిచయం చేశాడు. 2019లో చీడపీడలని తట్టుకొని అధిక దిగుబడినిచ్చే కాలీఫ్లవర్ రకాన్ని కనిపెట్టి జాతీయ స్థాయిలో 'పద్మశ్రీ' పురస్కారాన్ని (తనకన్నా ముందు) అందుకొన్న శ్రీ జగదీశ్ ఫరేఖ్ ఈయన శిష్యుడే! జగదీష్ ఫరేఖ్ గారిని ఈయన సుమారు 20 సంవత్సరాల క్రితమే ఎన్ఐఎఫ్‌కి పరిచయం చేశారు! అంతే కాక అధిక దిగుబడినిచ్చే మేలు రకం గాజర్ కనుగొన్న శ్రీమతి సంతోష్ పాచర్, అన్ని రకాల పంటల కోతలకీ పనికి వచ్చే యంత్రం కనుగొన్న శ్రీ మదన్ లాల్ కుమావత్, వేడిని తగ్గిపోకుండా నిలువరించే పద్ధతిని కనుగొన్న శ్రీ సుభాష్ ఓలా, పంట వ్యర్థాల నుండి గ్యాస్ తయారు చేసే పద్ధతి కనుగొన్న శ్రీ రామ్‌సింగ్ దహియా, వేరుశనగలను తవ్వి తీసే యంత్రం కనుగొన్న శ్రీ యూసుఫ్ ఖాన్ ... ఇలా ఎంతో మందిని ఎన్ఐఎఫ్ తరుపున స్కౌట్‌గా పని చేస్తూ దేశానికి పరిచయం చేశారు సుందరం వర్మ.

ఎన్ఐఎఫ్ రెండు సంవత్సరాలకి ఒకసారి జాతీయ స్థాయిలోనిర్వహించే పునాది స్థాయి ఇన్నోవేషన్, సాంప్రదాయ జ్ఞాన అవార్డులతో సత్కరించింది. ఈయన పరిచయం చేసిన చాలా మంది ఇన్నోవేటర్లు ఇన్నోవేషన్ స్కాలర్ ఇన్ రెసిడెన్స్ కార్యక్రమాల క్రింది భారత రాష్ట్రపతి భవనంలో కొద్ది రోజులు అతిథులుగా ఉన్నారు.

మీకన్నా ముందు మీరు పరిచయం చేసిన ఇన్నోవేటర్‌లకి రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు వచ్చాయి కదా అంటే భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు ఫలితం ఆశించకుండా పని చేస్తూ పోవటంలోనే ఆనందం ఉంది అంటారాయన నవ్వుతూ.

శ్రీ సుందరంవర్మ గారు ఇంకా ఎక్కువ ఉత్సాహంతో భూమి ఎడారిగా మారిపోకుండా, గ్రీన్ గ్రాస్ రూట్ ప్లాంటేషన్ టెక్నిక్ ద్వారా పర్యావరణ రక్షణ చేస్తూనే ఉన్నారు. ఎడారి ప్రాంతంలో లేదా ఆ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా తనదైన శైలితో సమాజానికి

అసామాన్య సేవలు అందిస్తున్న సుందా రాం గారికి 'పద్మశ్రీ' పురస్కారం వరించినందుకు ''పల్లెసృజన'' వారికి హృదయ పూర్వకంగా అభినందనలు తెలియజేస్తోంది. వీరి స్ఫూర్తితో ఇంకా ఎంతోమంది ఈ దిశగా పని చేస్తారని ఆశిస్తోంది. ఆయన కనిపెట్టిన విత్తనాలు, పద్ధతులను మన ప్రాంతం వారు కూడా ఉపయోగించుకుంటారని, పాఠకులు సుందరం వర్మ గారి కథను చదివి ఆచరించటమే కాకుండా, దేశం గౌరవించిన ఈ వ్యక్తులను సమాజానికి, భావి తరాల యువకులకి తెలియజేయాలని కోరుతోంది. ●

సుందరం వర్మ గారిని సంప్రదించాలనుకున్న వారు :

**సుదరం వర్మ, ఫోన్ : 9414901764**

## పల్లెసృజన పాఠకులకు 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత సుందరం వర్మ గారి సందేశం

"నేను సుందరం వర్మను. భారతదేశంలోని రాజస్థాన్ రాష్ట్ర నివాసిని. ఒక్క లీటరు నీటితో చెట్లను పెంచే పద్ధతి కనుగొన్నందుకు భారతదేశ ప్రభుత్వం నన్ను తన నాల్గవ అత్యుత్తమ పౌర సన్మానం 'పద్మశ్రీ'తో సత్కరించింది. నేనసలు ఈ పద్ధతిని కనిపెట్టడానికి ముఖ్య కారణం నీటి కొరత, తరచూ కరువు రావటం, గ్లోబల్ వార్మింగ్, గ్రీన్ హౌస్ గాసిస్, శిలజా ఇందనాలు, వాతావరణంలో మార్పులు, ప్రపంచంలో ఆకలి, పక్షుల నివాసాల లేమి, ఎడారులు, గ్రీనరీ, కార్బన్‌డయాక్సైడ్, ఉద్గరాలు, తక్కువ వర్షం వలన కలిగే అనర్థాలు, వ్యవసాయం, జీవ వైవిధ్యం మొదలైన వాటిని నియంత్రించటం కొరకు చేశాను.

పచ్చదనం తగ్గిపోవటానికి, జనాభా పెరుగుదల, ఖర్చులు పెరగటం, భూసారం తగ్గిపోవటం, జల వనరులు తగ్గిపోవటం లాంటివి కారణం అవుతున్నాయి. ఎడారి ప్రాంతంలో, వర్షాలు సక్రమంగా పడని ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించటానికి వాటి జీవిత కాలంలో కేవలం ఒక ఒక్క లీటరు నీటితో బ్రతికే చెట్టు పెంపకం చేసే పద్ధతిని కనుగొన్నాను. నా ఈ కొత్త పద్ధతి వలన సమృద్ధిగా ఆహారం, పశుగ్రాసం, ఇంధనం మొదలైనవి పెరగటంతో పాటు ఉపాధి అవకాశాలు పెరగటం, రైతుల ఆదాయం పెరగటమే కాక ఇది పర్యావరణానికి ఏవిధమైన చేటూ చెయ్యదు.

ఈ పద్ధతి ఉపయోగించి నీడనిచ్చే చెట్టు, పశుగ్రాసం, కలప, ఆయుర్వేద మూలికలు, కొన్ని పళ్ళ చెట్లను ఎండాకాలంలో 48 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నా కూడా పెంచుకోవటం సాధ్యమవుతుంది.

ముందుగా నేను ప్రయోగాలు చేసిన ఉదయ్‌పూర్, జైపూర్ ప్రాంతాల్లో ఓఎన్‌జిసి మరియు అటవీ శాఖ వారి సహకారంతో పాఠశాలలు, పంచాయతీ స్థలాలు, పశువుల కొట్ల దగ్గర మొక్కలు నాటాను. నేను నాటిన 55 వేల మొక్కలలో దాదాపు 80 శాతం మొక్కలు బ్రతికాయి. ఈ వార్త దేశ విదేశీ పత్రికల్లో ప్రధానంగా ప్రచురించబడి, కొత్త ఢిల్లీలో 1996లో జరిగిన 2వ అంతర్జాతీయ క్రాప్ సైన్స్ కాంగ్రెస్‌లో చర్చించబడి, వారి ప్రచురణలలో ప్రస్తావించబడింది. నా ఈ పద్ధతిపై ఐసిఎఆర్ వారు జోద్‌పూర్ లోని ఉష్ణమండల పరిశోధన సంస్థలతో పాటు అనేక మంది దేశ విదేశీ శాస్త్రవేత్తలు పరిశీలించి కితాబునిచ్చారు. వీరే కాక మన పూర్వ రాష్ట్రపతి శ్రీయుతలు అబ్దుల్ కలాం, ప్రణబ్ ముఖర్జీ, ప్రతిభా పాటిల్ గార్లు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీ స్వామినాథన్ గారు కూడా ప్రశంసించారు. ఇంతే కాక ఈ పద్ధతిని, దీనిపై పరిశోధనలు అనేక వ్యవసాయ విశ్వ విద్యాలయాలలో జోడించి, సుమారు 25 దేశీయ, 13 అంతర్జాతీయ సదస్సులలో దీనిపై చర్చించటం జరిగింది. నా ఈ ప్రయోగం కారణంగా 2007లో రోమ్ లో, 1999లో జెనీవాలో, ఐడిఆర్‌సి ఒట్టావాలో ప్రారంభోపన్యాసం ఇచ్చే అవకాశం రావటం నా అదృష్టంగా భావిస్తాను.

నా ఈ పరిశోధన వివరాలు గూగుల్‌లో "1 లీటర్ ప్లాంటేషన్ టెక్నిక్ బై సుందరం వర్మ" అని టైప్ చేసి ఎవరైనా పొందవచ్చు.

రాజస్థాన్ రాష్ట్రంలో దాదాపు 70 శాతం నీటి వసతిలేని ప్రాంతం. ఈ దేశంతో పోలిస్తే రాజస్థాన్ రాష్ట్రంలో ఒక్క శాతం నీరు, 10.4 శాతం భౌగోళిక ప్రాంతం, 5.66 శాతం జనాభా ఉండటమే కాక, 84 బ్లాకులు వర్షం పడని ప్రాంతాల్లా ఉండి, 70 శాతం నుండి 100 శాతం భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఇంకా 7 కోట్ల జనాభా, మరో 7 కోట్ల పశువులకు నివాసంగా ఉంది. నేను ప్రారంభించిన ఈ పద్ధతి వలన ఈ ప్రాంతం పచ్చదనంతో నింపి సమృద్ధిగా పశుగ్రాసం అందించి, అక్కడి జనావాసాల కష్టాలకి శాశ్వత పరిష్కారం కల్పించవచ్చు. ఈ ఒకేసారి నీటితో ఖర్చులని తగ్గించి చెట్లు, మొక్కలు పెంచటం వలన రాజస్థాన్ రాష్ట్రంలో జనాభా, పంటలతో పాటు పాడి పరిశ్రమ కూడా అభివృద్ధి చేసుకొని, వ్యవసాయ సంబంధ పరిశ్రమలకు సహాయ పడి, మొత్తం ఈ రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే అవకాశం ఉంది. రైతులు చేతినిండా ఆదాయం పొందవచ్చు. పైగా ఈ పద్ధతి పర్యావరణానికి తోడ్పడి సుస్థిర వ్యవసాయ, తత్సంబంధ కార్యకలాపాలు నిర్విఘ్నంగా కొనసాగించవచ్చు.

ఈ పద్ధతి ద్వారా పైన నేను చెప్పిన ఆహారం కొరత, పశుగ్రాసం, పళ్ళు, అటవీ ప్రాంతం, ఆదాయం, ఇంధనం, పశు పక్ష్యాదులు, ఆవాసాలు, వర్షాలు లేకపోవటం, పర్యావరణ రక్షణ, గ్లోబల్ వార్మింగ్, కార్బన్ డయాక్సైడ్ ఉద్గరాలు, గ్రీన్ హౌస్ వాయువులు, ప్రాంతీయ జీవన విధానం, పర్యావరణంలో మార్పులు లాంటి అనేక సమస్యలకు పరిష్కార మార్గం అవుతుంది.

ఈ నా ఒక్క లీటర్‌తో చెట్లు పెంచటం అన్న పద్ధతిలో ఒక్కొక్క చెట్టుకి దాని జీవిత కాలంలో కేవలం రూ. 500 ఖర్చవుతుంది. 5 సంవత్సరాల తర్వాత ఒక్కో చెట్టు నుంచి 1.5 క్వింటాళ్ళ ఆహారం/ గ్రాసం ప్రతి సంవత్సరం పొందవచ్చు. ఒకసారి ఒక చెట్టు నాటినట్లయితే దాదాపు 20–30 సంవత్సరాలు ఇంకే అదనపు ఖర్చు లేకుండా ఫలితం పొందవచ్చు.

ఒక హెక్టారులో 500 మొక్కలు నాటితే సంవత్సరానికి రూ. 25 వేల రూపాయల ఆదాయం పొందవచ్చు. దీనికయ్యే ఖర్చు అదనం. కానీ ఈ పద్ధతి ప్రకారం 2 లక్షల నుంచి 3 లక్షల వరకు ఉసిరి, ప్లమ్, మునగ లాంటి చెట్ల వల్ల పొందవచ్చు. ఇంతే కాక, పశు సంపద పెరిగితే దీనివల్ల నేరుగా వచ్చే ఆదాయం కాకుండా, వచ్చే ఎరువులు, బయోగ్యాస్ లాంటి అదనపు వనరులు, ఎరువులు, పురుగు మందులను రైతులు తయారు చేసుకొనవచ్చు. దీనివలన వ్యవసాయ ఖర్చులు గణనీయంగా తగ్గిపోతాయి. ఈ పద్ధతిలో పశువుల కాపరులు, వ్యవసాయదారుల ఆదాయం సమృద్ధిగా పెరిగే అవకాశం ఉంది."

**నాకు జరిగిన కొన్ని సత్కారాల వివరాలు :**

❀ 2020లో భారత ప్రభుత్వ 'పద్మశ్రీ' పురస్కారం. ❀ 2006లో అంతర్జాతీయ స్థాయిలో ఐఎఫ్‌పిఆర్‌ఐ (అమెరికా), విఎఆర్‌డిఎఎన్ మరియు ఐఎస్‌ఇఎఫ్ (స్వదేశంలో) సత్కారం. ❀ 2002లో శ్రీ చౌదరి చరణ్‌సింగ్ 'శిరోమణి' బహుమతితో సత్కారం. ❀ 1997లో మొదటిసారిగా (ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే) బాబూ జగ్జీవన్‌రామ్ కిసాన్ పురస్కారం. ❀ 2012–13 సం. ఎన్‌ఐఎఫ్ వారి 'ఉత్తమ స్కౌట్' పురస్కారం. ❀ 2007లో రైతుల హక్కులు, మొక్కల రకాల రక్షణకు గాను ఎన్‌ఐఎఫ్ వారి పురస్కారం. ❀ 2011లో మహేంద్ర & మహేంద్ర వారి 'కర్షక్ సామ్రాట్' సన్మాన పురస్కారం. ❀ 2015 లో హక్కుల పరిరక్షణ, రైతుల హక్కుల రక్షణ సంస్థ వారు మొక్కలు జన్యు సంకేతాల కణాలు, రైతుల హక్కుల రక్షణకు గాను సత్కరించారు. ❀ ఇవే కాక అనేక ప్రాంతీయ, రాష్ట్ర, జాతీయ స్థాయి ఎన్నో పురస్కారాలు.

ప్రపంచ ఆర్థిక ఫోరమ్ వారు నా ఈ నూతన ఆవిష్కరణపైన తగు చర్యలు తీసుకుంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకి నీరు, ఆహారం, పశుగ్రాసం, వాతావరణ, సిఓ2, ఉద్గరణాలు లాంటి సమస్యలకి చక్కని సులభమైన పరిష్కారం చూపిన వారవుతారు.

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## ఔషధ మొక్కలు - వాటి ఉపయోగాలు


ఉమా మహేశ్వర రావు

**వాము ఆకు**: ఈ వామాకును రోజూ ఒక్క ఆకు తింటే చాలు ఊపిరి తిత్తుల్లో వచ్చే సమస్యలు, గొంతు సమస్యలు చాలావరకు తగ్గిపోతాయి. ఆస్తమా వ్యాధి ఉన్నవారు రోజూ రెండు ఆకుల చొప్పున తిన్నట్లయితే ఒక సంవత్సరం రోజుల్లో అసలు ఎటువంటి మందులు ఉపయోగించకుండా ఆస్తమా వ్యాధి తగ్గిపోతుంది. మూత్ర పిండాల్లో రాళ్ళు ఉన్న వారు కూడా ఈ వామాకు తినటం వల్ల మూత్రపిండాల్లోని రాళ్ళు చాలావరకు కరిగి పోతాయి. కడుపు ఉబ్బరం, కడుపు నొప్పి ఉన్నవాళ్ళకు కూడా ఇది చాలా బాగా పని చేస్తుంది. గొంతులో కఫం ఉండి శ్వాస సరిగ్గా ఆడని వాళ్ళు ఈ వామాకు రసాన్ని గోరువెచ్చని నీటితో కలిపి తీసుకుంటే శ్వాస సమస్య నుండి ఉపశమనం పొందవచ్చు.

**వస (వజ)**: సాధారణంగా చిన్న పిల్లలకు ఈ వసను నీటిలో మెత్తగా నూరి (సాది) కొద్దిగా వేలితో తీసుకుని నోట్లో వేస్తూ వుంటారు. కొందరు పాలల్లో కలిపి ఇస్తూ ఉంటారు. వస తినిపించటం వల్ల త్వరగా మాటలు వస్తాయన్న విషయం చాలా మందికి తెలిసిందే. ఇది చిన్న పిల్లలకే కాదు, పెద్దవాళ్ళకు కూడా కండ రోగాలు, గొంతులో నస, బొంగురు గొంతు వున్నవాళ్ళు, కఫ రోగాలు ఉన్నవారు వస తీసుకున్నట్లయితే ఈ బాధల నుండి ఉపశమనం పొందవచ్చు. మూర్ఛ రోగాలు ఉన్నవారు వసను పొడిగా చేసుకుని, రోజూ ఉదయం సాయంత్రం ఒక చిన్న చెంచాడు పొడిని వేడి పాలల్లో లేదా నీటిలో కలిపి తీసుకున్నట్లయితే వారికి 'ఫిట్స్' రాకుండా చేసే గుణం ఇందులో ఉంది. నిద్ర లేమి వ్యాధితో బాధ పడుతున్నవారు కూడా ఈ వస పొడి రెండు చిట్కలు రోజూ రాత్రి వేడినీటితో కలిపి తీసుకున్నట్లయితే బాగా నిద్ర వస్తుంది. ఈ వస ఆందోళనను తగ్గిస్తుంది. గొంతు నస ఉన్నవారు వస చిన్న ముక్కను నోట్లో వేసుకుని చప్పరిస్తూ వున్నట్లయితే గొంతులో నస తగ్గిపోతుంది. ఇది ఎముకలు, కీళ్ళ నొప్పులను కూడా బాగా నివారిస్తుంది.

**సునాముఖి (సోనాముఖి)**: సునాముఖి ఆకులను చూర్ణం (పొడి) చేసుకుని ఒక గాజు సీసాలో తీసి ఉంచుకుని రోజూ పడుకునే ముందు ఒక అర చెంచాడు పొడిని గోరువెచ్చటి నీటిలో తీసుకున్నట్లయితే వీరోచనాలు సాఫీగా జరుగుతాయి. ఇది ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని మందు ఎవ్వరైనా వాడవచ్చు. ఈ పొడి చిన్న పిల్లలకైతే చిటికెడు, 14-16 సంవత్సరాల పిల్లలకైతే అర చెంచా, పెద్దవాళ్ళకైతే ఒక చెంచాడు పొడిని వాడవచ్చు.

**అడ్డసరం**: అడ్డసరం మొక్క ఆకు ఎన్నో రోగాలకు ఔషధంగా పని చేస్తుంది. ఆస్తమా ఉన్నవాళ్ళు, దగ్గు, జలుబు, గొంతులో గళ్ళ (కళ్ళె) ఉన్నవాళ్ళు, ఆయాసం ఉన్నవాళ్ళు, నిద్ర లేమి ఉన్నవాళ్ళు అందరూ దీన్ని వాడవచ్చు. ఈ ఆకును నీడలో ఆరబెట్టి ఉదయం సాయంత్రం అర చెంచాడు పొడిని వేడి నీరు లేదా పాలల్లో తీసుకుంటే పైన చెప్పిన రోగాలన్నిటికి ఉపశమనం కలిగిస్తుంది. ఈ ఆకును కషాయం కూడా చేసుకుని వాడవచ్చు. గజ్జి, జిల, తామర, దురద ఉన్నవాళ్ళు అడ్డసరం ఆకుతో పాటు అతిమధురం కలిపి మెత్తగా నూరి శరీరంపైన పూసుకున్నా, కడుపులోకి తీసుకున్నా దురదలు తగ్గిపోతాయి.

కొందరికి పొడిదగ్గు ఎక్కువగా వస్తూ వుంటుంది. అటువంటి వారు అడ్డసరం ఆకు పొడిలో కొద్దిగా మిరియాల పొడిని కలిపి తీసుకున్నట్లయితే పొడి దగ్గు తగ్గిపోతుంది.

**అక్కల కర్ర**: అక్కల కర్ర అంటే జీలకర్ర అనుకుంటారు కొందరు. అక్కల కర్ర అంటే ఒక చెట్టు వేర్లు. ఆయుర్వేద ఔషధ దుకాణాల్లో వీటి పౌడర్ కూడా లభిస్తుంది. ఈ వేర్లను గంధం తీసి, కొద్దిగా నోట్లో వేసుకున్నట్ల యితే ఒకవైపు తలనొప్పి (ఒంటి తలనొప్పి) వున్నవారికి త్వరగా తగ్గిపోతుంది. నత్తిగా మాట్లాడేవాళ్ళు ఈ గంధాన్ని తేనెతో కలిపి నోట్లో వేసుకుంటూ ఉన్నట్లయితే నత్తిగా మాట్లాడటం త్వరగా తగ్గిపోతుంది. పిప్పి పంటి నొప్పితో బాధ పడేవారు ఈ పొడిని ఒక చుక్క నీటిలో కలిపి, ఒక దూదిలో వేసుకుని పిప్పి పళ్ళు నొప్పి ఉన్నచోట కొద్ది సేపు ఉంచుకుం టే పిప్పి వళ్ళు బాధ నుండి ఉపశమనం పొందవచ్చు.

అక్కలకర్ర పొడిలో మిరియాలు, శొంఠి పొడిని సమంగా కలిపి వేడినీరు లేదా పాలలో తీసుకున్నట్లయితే విపరీతమైన తలనొప్పి, తలలో నరాల వల్ల అసహనంతో బాధ పడేవాళ్ళకు త్వరగా ఉపశమనం లభిస్తుంది. ఈ పొడిలో పటిక బెల్లం లేదా తేనె తో కలిపి తీసుకుంటే జ్వరం కూడా తగ్గే గుణముంది ఈ అక్కల కర్రకు.

**ఆముదం ఆకు**: గ్రామాల్లో రైతు కూలీలు, రైతులు తలనొప్పి వచ్చినట్లయితే తలపైన రెండు ఆముదం ఆకులను వేసుకుని తలకు టవల్ కట్టుకుని తలనొప్పి నుండి ఉపశమనం పొందుతుంటారు. తలలోని వేడిని తీసేసే గుణం ఆముదం ఆకులకు ఉంటుంది. ఆముదం ఆకును కొద్దిగా వేడి చేసి చిన్న పిల్లల పొట్టమీద ఉంచినట్లయితే పిల్లల్లో మలబద్ధకం లాంటి రోగాలు నయమౌతాయి. మొలల బాధ ఉన్నవారు ఆముదం ఆకులో కొద్దిగా కర్పూరం వేసి మెత్తగా నూరి, ఒక గుడ్డతో మలమూత్రం వద్ద కట్టుకున్నట్లయితే మొలల బాధ తొలగిస్తుంది. పచ్చకామెర్లు సోకిన వారికి ఆముదం ఆకు, వెల్లుల్లి 4 రెబ్బలు కలిపి మెత్తగా నూరి, చింత గింజంత మాత్రలుగా చేసుకుని రోజూ ఉదయం, సాయంత్రం రెండు చొప్పున తీసుకున్నట్లయితే త్వరగా తగ్గిపోతుంది.

ఇవేవీ ప్రమాదకరమైనవి కావు. దాదాపు మన వంటింట్లో మరియు పొలంలో లభించేవే కాబట్టి వీటివల్ల సైడ్ ఎఫెక్ట్ అంటూ ఏదీ ఉండదు.

**గమనిక**: ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

**ఉత్తరేణి :**

ఉత్తరేణి మొక్క వేరుతో దంతాలను శుభ్రం చేసుకున్నట్లయితే దంతానికి సబంధించిన దంత శూలలు, పిప్పి పళ్ళు, పళ్ళ పీపుర్లు, పళ్ళల్లో బ్యాక్టీరియా, చిగుళ్ళలో రక్తం కారటం, నోటి దుర్వాసన లాంటి నోటికి సంబంధించిన దాదాపు అన్ని రోగాలు నయం అవుతాయి.

ఉత్తరేణి మొక్క వేర్లను తీసుకుని, బియ్యం కడిగిన నీటిలో వేసి మెత్తగా నూరి గంధం తయారు చేసుకుని, రక్తమొలలతో బాధ పడుతున్న వారు ఆ గంధాన్ని మలమూత్ర ద్వారం వద్ద నొప్పి ఉన్నచోట పైపూతగా పూసినట్లయితే, రక్త మొలలు నివారించ బడతాయి.

ఉత్తరేణి చెట్టు సమూలంగా తీసుకుని కొద్దిగా కచ్చకచ్చగా నూరి, నీటిలో వేసి, కషాయం తయారు చేసుకుని, శరీరం పైన వున్న మచ్చలపైన పూసినట్లయితే అవి నివారించ బడతాయి. లేదా ఉత్తరేణి చెట్టు సమూలంగా తీసుకుని కొద్దిగా ఎండబెట్టిన తర్వాత దాన్ని కాల్చి బూడిద చేసుకుని ఆవు నెయ్యిలో కలిపి శరీరంపైన మచ్చలు ఉన్నచోట పూసినా కూడా మంచి ఫలితం ఉంటుంది.


ఉత్తరేణి చెట్టు

**మేడి పండ్లు - కాయలు :**

మేడి చెట్టు దోర కాయలను సేకరించి, వాటిని రెండు మూడు ముక్కలు చేసి, నీడలో ఆరబెట్టి బాగా ఆరిన తర్వాత వాటిని పొడిగా చేసుకోవాలి. తర్వాత అందులో చేదు జీలకర్ర, మెంతులు కూడా కొద్ది కొద్దిగా తీసుకుని పెనంపైన కాస్త వేడి చేసుకుని పొడిగా చేసుకోవాలి. ఇలా మూడు రకాల పొడులను తయారు చేసుకుని, వాటన్నిటినీ బాగా కలిపి రోజూ ఉదయం పరగడుపున ఒక టేబుల్ స్పూన్ పొడిని నోట్లో వేసుకుని తిని, అవసరమైతే కొద్దిగా నీరు లేదా కాఫీ త్రాగినట్లయితే, మధుమేహం (షుగర్) వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవచ్చు.

బాగా మాగిన మేడి పండ్లను తీసుకుని, చేతితో మెత్తగా పిసికి (అవసరమైతే కొద్దిగా నీటిని ఉపయోగించవచ్చు) అందులో తేనె లేదా పటిక బెల్లం లేదా తాటి బెల్లం ఏదైనా సరే కొద్దిగా కలుపుకుని (చక్కెర మాత్రం కలపవద్దు) ఋతుస్రావం జరుగుతున్న స్త్రీలు తీసుకున్నట్లయితే హెచ్చు తగ్గులు లేకుండా ఋతుస్రావం సరియైన సమయంలో వస్తుంది.

మేడి కాయలతో టమోట, పసుపు, ఇతర కూర తయారీకి అవసరమైన దినుసులన్నీ వేసుకుని మంచి కూర తయారు చేసుకుని అప్పుడప్పుడూ తిన్నట్లయితే కడుపులోని ప్రేవులలో సమస్యలన్నిటినీ నివారిస్తుంది.

కొంతమంది అధిక దాహార్తితో బాధ పడుతుంటారు, ఎన్ని నీళ్ళు త్రాగినా దాహం తీరదు, కడుపేమో నీటితో నిండిపోతుంటుంది. ఇటువంటి వారు మేడి కాయలు లేదా పండ్లు తీసుకుని, వాటిని ముక్కలు చేసి, అందులో ఎటువంటి పురుగులు లేవని నిర్ధారించుకున్న తర్వాత వాటిని ఒక గ్లాసు నీటిలో వేసుకుని, కషాయం తయారు చేసుకుని సేవించినట్లయితే అధిక దాహం లాంటి బాధల నుండి ఉపశమనం పొందవచ్చు.


- 'వైద్య' కొమెర జాజి

**డబర డంగి (బుడ్డ కాయల చెట్టు) :**

పల్నాడు ప్రాంతంలో డబర డంగి అని పిలువబడే చెట్టును కొన్ని ప్రాంతాల్లో బుడ్డ కాయల చెట్టు అని, అడవి ద్రాక్ష అని కూడా అంటారు. దీని ఆకులు కొద్దిగా ఘాటుగా, కారం కారంగా ఉంటాయి. గుప్పెడు ఆకులు తీసుకుని శుభ్రంగా నీటితో కడిగి, చేతితోనే చిన్న చిన్న ముక్కలుగా చేసి, కొద్దిగా నీరు తీసుకుని వేడి చేసి కషాయం తయారు చేసుకోవాలి. ఆ వేడి కషాయాన్ని ఉదయాన్నే టీ, కాఫీ లాగా సేవించినట్లయితే శరీరంలో రోగ నిరోధక శక్తి విపరీతంగా తయారు అవుతుంది. చర్మం రంగు కూడా మారుతుంది. నరాలు, కండరాలు, ఎముకలకు ఎంతో బలాన్ని చేకూరుస్తుంది. శీరరంలోకి ప్రవేశించే



చాలా వరకు వైరస్‌లను చంపేసే శక్తి దీనికుంది. అంతే కాదు ఈ కషాయాన్ని చర్మ రోగాలు వున్నవారు పైపూతగా పూసుకున్నట్లయితే చాలావరకు చర్మరోగాలు నయమౌతాయి. గాయాలపైన ఈ కషాయాన్ని వేసి శుభ్రం చేసినట్లయితే గాయాలు శుభ్రం అవటమే కాకుండా గాయాలు కూడా త్వరగా మానిపోతాయి. శరీరంపైన వున్న మచ్చలు కూడా పోగొట్టే గుణం ఈ ఆకుకు ఉంది. వర్షాకాలం వచ్చే విష జ్వరాలకు, నీళ్ళ విరోచనాలకు ఇది అద్భుతమైన ఔషధం ఈ ఆకును నీటిలో మరిగించి, టీలాగా త్రాగినట్లయితే వర్షాకాలపు రోగాల నుండి ఉపశమనం పొందవచ్చు. శీతాకాలంలో వచ్చే ఒళ్ళు నొప్పులను చాలా బాగా తగ్గిస్తుంది. ఈ చెట్టు కాయలు తింటే పుల్ల పుల్లగా ఉంటాయి. బాగా మాగిన తర్వాత తింటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం. : 9908411700

**అత్తిపత్తి**: 'అత్తిపత్తి' మొక్కలు రెండు విధాలు. 1. మగ అత్తిపత్తి (ముళ్ళు లేనిది) 2. ఆడ అత్తిపత్తి (ముళ్ళు కలది). ఎక్కువగా ఆడ అత్తిపత్తిని ఔషధాలలో వాడుతుంటారు. ఇది అనేక రకాలుగా పని చేసే గొప్ప ఔషధ గుణాలు కలిగిన మొక్క. ఇది మహిళలకు ఎక్కువగా మేలు కలిగించే మొక్క. స్త్రీకి, భూమికి, అత్తిపత్తి మొక్కకు దగ్గర పోలికలు ఉన్నాయి. ఈ మూడింటి తత్వం తెలిసిన వారు వారిని గౌరవంగా చూసేవారు. ఎల్లవేళలా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవిస్తుంటారు. దీన్ని ఔషధాలలో వాడుకునే విధానం కూడా చాలా తేలిగ్గా ఉంటుంది.

అత్తిపత్తి మొక్క వేరు, ఆకు, గింజలు సమాన స్థాయిలో తీసుకుని, నీడలో ఆరబెట్టి, పొడి చేసుకుని ఒక సీసాలో తీసి ఉంటుకుని, రోజూ ఒక స్పూను పొడిని పాలు, కాఫీ లేదా వేడి నీటితో కలిపి తీసుకున్నట్లయితే పురుషుల్లో వీర్య ఉత్పత్తి జరుగుతుంది. వృషణాలు బలపడతాయి. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

ఈ మొక్క ఆకులు ఆడవారి సమస్యలకి బాగా ఉపయోగ పడతాయి. గుప్పెడు ఆకులు తీసుకుని, ఒక గ్లాసు నీటిలో వేసి బాగా మరిగించి, కషాయం తయారు చేసుకోవాలి. చల్లారిన తర్వాత ఆ నీటిని వడబోసుకుని, ప్రతిరోజు ఉదయం పరగడుపున ఈ కషాయాన్ని తీసుకున్నట్లయితే రక్తనాళాలు శుద్ధి అవుతాయి. గర్భాశయం శుద్ధి అవుతుంది. కంతులు గానీ, నీటి బుగ్గలు కాని కరిగి నెలసరి క్రమం తప్పకుండా అవుతుంది. ఇది కొంచెం వేడి స్వభావాన్ని కలిగి, కొద్దిగా చేదుగా ఉంటుంది. ఇది ఒకటేమిటి శరీరంలోని అనేక రకాల అలజడులను తగ్గిస్తుంది.

**రణపాల**: ఈ మొక్క పేరులోనే ఓ ప్రత్యేకత ఉంది. రణం అంటే యుద్ధం మరియు పుండు. అందుకేనేమో ఇది మానవాళి శరీరంలోని ఆరోగ్య సమస్యలపై సైనికుల్లా యుద్ధమే చేస్తుందని చెప్పవచ్చు. చాలా అరుదుగా లభించే మొక్క. దీని మరో ప్రత్యేకత ఏమిటంటే దీనికి పూలు, కాయలు ఉండవు. దీని పత్రాలు మొక్క నుండి పండిపోయి, రాలిన తర్వాత వాటినుండే మళ్ళీ మొక్క మొలుస్తుంది. అందుకే దీన్ని 'పత్రిబీజము' అంటారు. ఈ మొక్కను ఇంట్లో కూడా పెంచుకోవచ్చు. దీని ఆకులు పెలుసుగాను, కణుపులు కణుపులుగాను ఉంటాయి, ఎక్కువ నీటి శాతం కలిగి వుంటాయి.

ఎవ్వరైనా దీని ఆకులను తీసుకుని శుభ్రంగా కడిగి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా తినవచ్చు. రసం తీసుకుని సేవించవచ్చు, నాలుగు ఆకులను ఒక గ్లాసు నీటిలో వేసి, ఆ నీరు సగం వరకు అయ్యేలా మరిగించి, కషాయం చేసుకుని కూడా తాగవచ్చు. ఎవరికి నచ్చిన పద్ధతిలో వారు తీసుకోవచ్చు, ఏ విధంగా తీసుకున్నా, దీని గుణాల లో మార్పు ఉండదు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదు.


బాల నర్సయ్య, నల్గొండ జిల్లా

రణపాల ఆకు మూత్ర పిండాల శుద్ధికి చాలా బాగా ఉపయోగ పడుతుంది. శరీరంలోని అనవసరపు నీటిని బయటకు పంపగలదు. శరీరంలోని కండరాలు, ఎముకలు, ఇతర ఎక్కడైనా అనవసరపు చెడు పదార్థాలను బయటకు పంపడంలో సమర్థవంతంగా పని చేస్తుంది. క్రొవ్వును కరిగించే గుణం దీనికుంది. శరీరంలోని కండరాల మధ్య ఏవైనా గాయాలున్నా వాటిని మానేలా చేస్తుంది. యూరిక్ ఆసిడ్‌ను తగ్గిస్తుంది. కాళ్ళ వాపులను తగ్గిస్తుంది, మూత్రం సాఫీగా వచ్చేలా చేస్తుంది, మూత్రంలో మంట ఉన్నా తగ్గిస్తుంది.

అతిమూత్ర వ్యాధి ఉన్నవారికి ఎక్కువసార్లు మూత్ర విసర్జనకు వెళ్ళ వలసిన అవసరం లేకుండా మూత్రాశయాన్ని వృద్ధి చేసి, తక్కువ సార్లు, ఎక్కువ మూత్రం వచ్చేలా చేస్తుంది అంటే బ్లాడర్ పనితనాన్ని పెంచుతుంది. శరీరంలోని 30-40 వరకు రోగాలను ఇది నయం చేస్తుంది. ఏవైనా శుభకార్యాలకు, ఫంక్షన్‌లకు వెళ్ళినపుడు రుచి బాగా ఉందని కొద్దిగా ఎక్కువగా నూనె పదార్థాలను తిన్నపుడు అజీర్తి, ఆయాసంతో బాధపడుతూ ఉంటారు. అటువంటి వారు కేవలం ఒక్క ఆకును నోట్లో వేసుకుని నమిలి తిన్నట్లయితే కడుపులోని పదార్థాలను త్వరగా అరిగేలా చేసి, ఆయాసాన్ని, అజీర్తి సమస్యను తగ్గిస్తుంది. కడుపులో అల్సర్ లాంటివి ఉన్నా తొలగిస్తుంది. కడుపులో మంటను, గ్యాస్ట్రిక్ ట్రబుల్‌ను తగ్గిస్తుంది. ఆహారం జీర్ణం చేయటంలో చాలా బాగా ఉపయోగ పడుతుంది.

మహిళలు రోజూ ఒకటి రెండు రణపాల ఆకులను తినే అలవాటు చేసుకున్నట్లయితే వారికి గర్భాశయ సమస్యలు తగ్గుతాయి. శరీరం లోపల ఎక్కడ ఎటువంటి పుండ్లు ఉన్నా తగ్గిపోతాయి. ఈ ఆకులను అన్ని రకాల వయసుల్సు వారు కూడా వాడవచ్చు. ఏ సమయంలోనైనా వాడవచ్చు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ ఉండదు. ఈ మొక్క ఇంట్లో ఈ మొక్క ఉంటే, ఇంట్లో డాక్టరు ఉన్నట్లే. కాబట్టి ప్రతి ఇంట్లో తప్పక ఉండాల్సిన మొక్క ఇది. చిన్న చిన్న రోగాలకు కూడా డాక్టరు వద్దకు వెళ్ళే బదులు ఇంట్లో ఈ మొక్కను పెంచుకుంటే, అనవసరంగా పెట్టే డాక్టర్ల, మందుల ఖర్చు తగ్గటమే కాక, ఆ మందులు తినటం వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్‌లు కూడా లేకుండా మనిషి సుఖంగా ఉండవచ్చు. రోగం వచ్చిన తర్వాత దాన్ని మాన్పుకోవటం కన్నా, రోగం రాకుండా చూసుకోవటం ఉత్తమం కదా!


అత్తిపత్త మొక్క


రణపాల మొక్క

**గమనిక**: ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' బాల నర్సయ్య, ఫోన్ నెం.:**

బ్రిగేడియర్ గణేశం గారికి,

నేను 'పల్లెసృజన' పత్రిక చందా కట్టడం జరిగింది కానీ పత్రికలు నాకు అందటం లేదు. పత్రిక సకాలంలో అందేలా చర్యలు తీసుకో గలరు.

**– సారిపల్లి మూర్తి, ముంబాయి.**

మూర్తి గారూ,

మీరు సూచించిన సమస్యనే చాలామంది చందాదారుల నుండి మేము ఎదుర్కొంటున్నాము. మేము పత్రికను సకాలంలోనే ముద్రించి, పోస్ట్ ద్వారా మీకు పంపుతున్నాము. కానీ, పోస్టల్ శాఖ వారి నిర్లక్ష్యమో, లేదా మరే కారణమో కానీ, కొంతమందికి పత్రిక అందటం లేదు. పత్రిక అందలేదు అన్న విషయం తెలియజేసిన వారికి రెండు మూడుసార్లు కూడా పత్రికను పోస్టు ద్వారా పంపటం జరిగింది. అయినా కొందరు పాఠకులకు పత్రిక చేరటం లేదన్న విషయం మాకు విచారకరంగా ఉన్నది. ఇదే విషయాన్ని పోస్టల్ కార్యాలయానికి వెళ్ళి ఫిర్యాదు చేయటం జరిగింది. వారి సమాధానం ఏమంటే, "సాధారణ పోస్ట్ వల్ల ఇటువంటి కొన్ని సమస్యలు మా దృష్టికి వస్తున్నాయి. మీ పాఠకులతో సంప్రదించి, పత్రికలను రిజిష్టరు పోస్టు ద్వారా పొందేలా చర్యలు తీసుకోండి. రిజిష్టర్ పోస్టు ద్వారా అయితే ఆ పత్రిక ఎక్కడ ఉందో కనుగొనటం చాలా సులభం, తప్పకుండా పాఠకున్ని చేరుకునేలా చర్యలు తీసుకోగలము" అన్నారు. అందుకే ఈ సంచికలో ఆ విషయాన్ని ప్రచురిస్తున్నాము. పత్రిక రిజిష్టరు పోస్టు ద్వారా పొందాలనుకునేవారు రూ. 240/–లు అదనంగా (మీ చందాకు అదనంగా) పంపినట్లయితే పత్రిక మీకు తప్పకుండా అందే అవకాశం ఉంది. మా చేతుల్లో లేని సమస్య వల్ల మీరు పడుతున్న ఇబ్బందులకు క్షంతవ్యులం. **– బ్రిగేడియర్ పోగుల గణేశం.**

'పల్లెసృజన' వారికి అభినందనలు. మీరు నిర్వహిస్తున్న 'వీక్లీ వెబినార్' కార్యక్రమం అద్భుతం. 95 వెబినార్ సమావేశాలు నిర్వహించడం అనేది చాలా గొప్పది, అభినందనీయమైన పని. ఇన్నోవేటర్లు, రైతులు ఉభయులకు ఎంతో ఉపయోగకరమైనది. రైతులకు మించిన ఇన్నోవేటర్లు లేరనేది నా అభిప్రాయం. గత 30 సంవత్సరాలుగా వేలాది మంది రైతులతో పని చేశాను. రైతులు నేరుగా సమస్యలను ఎదుర్కొంటారు కాబట్టి సమస్యల పట్ల వాళ్ళకున్న అవగాహన మనకు ఖచ్చితంగా ఉండదు అని నా అభిప్రాయం. నాకున్న అనుభవం ఒకటి మీతో పంచుకోవాలి అనుకుంటున్నాను. 2000 సంవత్సరంలో ఐతానగర్‌లో సాంబశివరావు అనే ఇన్నోవేటివ్ రైతు నావద్దకు వచ్చి, రెడ్డిగారు వరి కోత తర్వాత ఆ పొలంలో మినుములు చల్లి రెండో పంట పండిస్తూ ఉంటారు. కానీ మొక్కజొన్నకు ఇటీవల బాగా డిమాండ్ పెరుగుతోంది కదా, మొక్కజొన్న నాటిస్తే బావుంటుంది అనుకుంటున్నాను అన్నారు. మొక్కజొన్న నాటాలంటే చాలామంది కూలీలు పడతారు కదా ఎందుకు అంత కష్టపడతారు, నష్టపోతారేమో అన్నాను. రైతుకు ఖర్చవుతుందని నేను ఆలోచిస్తే, రైతుకు ఆదాయం ఎలా పెంచవచ్చు అనేది ఆ రైతు ఆలోచన. కాబట్టి ఒకసారి చూద్దాం అసలు ఎంత ఖర్చవుతుంది అన్న విషయం కూడా తెలుస్తుంది కదా అని మొక్కజొన్న నాటించారు. అలా వరి తర్వాత, తడిగా వున్న ఆ వరిమళ్ళల్లో మొక్కజొన్న నాటి పండించడం అన్నది 'రైతు ఇన్నోవేషన్'. మూడు సంవత్సరాల తర్వాత సైంటిస్టులుగా మేము రైతులకు మొక్కజొన్న నాటుకొమ్మని సిఫారసు చేశాం. ఇది రైతు సాంబశివరావు ఇన్నోవేషన్ అని మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాము. అలా మొదలైన ఇన్నోవేషన్ కారణంగా ఈరోజు దేశంలోనే మొక్కజొన్న ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది అని సగర్వంగా చెబుతున్నాను.

మొక్క నాటే కూలీల ఖర్చు పెరుగుతోందని ఆలోచించి, 'గురవయ్య' అనే రైతు మొక్కజొన్న నాటడం, ఎరువులు వెయ్యటం, కలుపు మందు పిచికారి చెయ్యటం అనే మూడు రకాల పనులు ఒకేసారి జరిగేలా వారు చెప్పిన ఆలోచన (ఇన్నోవేషన్) అద్భుతం. రైతుకు చాలావరకు ఖర్చు తగ్గుతుంది. ఇప్పుడు ఆయనను 'గొర్రు గురవయ్య' అంటారు. వారిని 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చి ఎన్నో పురస్కారాలు, బహుమతులు కూడా పొందటం జరిగింది. కానీ, 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వస్తున్న ఇన్నోవేషన్‌లకు తగినంత ప్రాచుర్యం లభించటం లేదు అనుకుంటున్నాను. ఇన్నోవేటర్లకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి, వారిచేతనే వారి ఇన్నోవేషన్లని తయారు చేయించి, అందరికీ అందేలా ప్రయత్నిస్తే వారు అద్భుతాలనే సృష్టించ గలరు అనిపిస్తోంది. దీనికొరకు 'పల్లెసృజన'కు నావంత సహకారం అందించటానికి నేనెప్పుడూ సిద్ధమే.

రైతులకు సేవ చేసే అదృష్టం కొందరికే దక్కుతుంది. అలా దొరికి వాళ్ళనే నేనూ ఒకన్ని అని నా అభిప్రాయం. కొత్త కొత్త ఇన్నోవేషన్లు, సాంకేతికతలు ఎన్నో వెలుగులోకి వస్తున్నాయి కానీ, అవి ప్రతి రైతుకు చేరటం లేదు అందుకు కారణం రైతుల అమాయకత్వం, చదువుకోలేని తనం. ఇలాంటి కార్యక్రమం ద్వారా రైతులకు సాంకేతికతను, అందజేయటంలో ఇప్పటి వరకు 95 వెబినార్లను పూర్తి చేసిన సుభాష్ గారికి, 'పల్లెసృజన' బృందానికి నా అభినందనలు. **– డా. సుబ్బరామిరెడ్డి, డైరెక్టర్, ఆం.ప్ర. విత్తనాభివృద్ధి సంస్థ, లాంఫాం, గుంటూరు.**


**FORM IV**

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094, Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094, Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094, Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

# పర్‌ఫెక్ట్

## త్రిప్స్ నుండి మిరప పంటను కాపాడుతున్న సేంద్రియ పురుగు మందు



ఇన్నోవేటర్
**సంగబోయిన వెంకటకృష్ణ**
నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్

'మిరప' రైతులను ఈ సంవత్సరంనిలువునా ముంచిన పూత లోపలి పురుగును శాస్త్రవేత్తలు ఇప్పటికి కనుగొని దానికి 'త్రిప్స్ పార్విస్పైనస్' అని పేరు పెట్టారు. కానీ, గత సంవత్సరం వేలాది ఎకరాల్లో మిరప పంట నాశనం అయింది. చాలా ప్రాంతాల్లో చేతికి వచ్చిన పంటను దున్ని వేశారు రైతు సోదరులు. కానీ, 'పల్లె సృజన' వెలుగులోకి తెస్తున్న ఇన్నోవేషన్లను నమ్మగలిగిన రైతులు మాత్రం ఈ సమస్యను విజయవంతంగా ఎదుర్కొని తమ పంటను కాపాడుకో గలిగారు.

ఈ 'పర్‌ఫెక్ట్' అనే మూలికా పురుగు మందు పంటపై పిచికారి చేసే ముందు పూతలో నుండి 10-12 సన్నటి నల్లగా వున్న పురుగులు బైటకు వస్తూ కనిపించేవని, 'పర్‌ఫెక్ట్' పిచికారి చేసిన 3-4 రోజుల తర్వాత 2-3 పురుగులు మాత్రమే కనిపించాయని, ఒక వారం తర్వాత మళ్ళీ పిచికారి చేస్తే మొత్తం పురుగులు కనిపించకుండా పోవటమే కాక, పంట చాలా ఆకర్షణీయంగా పెరిగి, మళ్ళీ ఆరోగ్యంగా కనిపించిందని, ఉభయ తెలుగు రాష్ట్రాల రైతులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.










వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-40253096, సెల్ : 9652801700
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

పల్లెసృజన పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఆవిష్కరణలు NABARD

# స్టాప్

## త్రిప్స్ నుండి మిరప పంటను కాపాడుతున్న సేంద్రియ పురుగు మందు



ఇన్నోవేటర్
**సంగబోయిన వెంకటకృష్ణ**
నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్

గత వారం రోజులుగా వందలాది మంది రైతుల వద్దనుండి మాకు ఫోన్లు వస్తున్నాయి. వారి గ్రామాల్లో చాలామంది రైతులు మిరప పంటను ఆశిస్తున్న 'ఎర్రనల్లి' (త్రిప్స్/ నల్లి) మరియు 'ఆకు ముడత' (బొబ్బర/ జెమిని వైరస్) ఆశిస్తున్నాయి. వేలాది రూపాయల డబ్బు ఖర్చు చేసి, ఎన్ని రకాల రసాయన మందులు పిచికారి చేసినా ఆ రోగాలు నయం కాక వేలాది ఎకరాల చేతికి వస్తున్న మిరప పంటను దున్నేస్తున్నారు. ఇలాంటి సంఘటన గుంటూరు జిల్లా సత్తెన పల్లి సమీపంలోని ఒక గ్రామంలో జరిగిన యదార్ధ గాథను కోటేశ్వర రావు అనే ఒక రైతు చెప్పిన ఆడియో రికార్డును మీముందుంచుతున్నాము. దయచేసి చేతికి రాబోతున్న పంటను తీసివేసి నష్టపోకండి.

ఈ మాటలు కోటేశ్వర రావు మాటల్లోనే ఇందువెంట జతపరుస్తున్న 'ఆడియో' వినండి.

కాబట్టి రైతులందరికీ "పల్లెకిసాన్" చేస్తున్న విజ్ఞప్తి ఏమంటే. దయచేసి మీ పంటను తీసివేయకుండా ఒక్కసారి ఈ సేంద్రియ పురుగు మందులను వాడి చూడండి.






వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-40253096, సెల్ : 9652801700
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555


PALLE SRUJANA Telugu Bi-monthly November-December 2022 RNI No. TELTEL 2012/74620


# పల్లెసృజన


## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే

ఇన్నోవేషన్ల వీడియోల కొరకై ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి చూడవచ్చు.











పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

లేదా

"Phone Pe" no 9866 00 1678

QR code for Phone Pe

### సభ్యత్వ వివరాలు (2 సంవత్సరాలకు)

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| సాధారణ పోస్టు ద్వారా | 400/- | 1,000/- |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 650/- | 1,250/- |

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.